Sunday, February 12, 2023
1:06 PM

1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 10
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

డిసెంబరు 2018






**ఉద్యమ చైతన్యంతో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహాసభలు**

**తెలంగాణ ప్రభుత్వ ప్రపంచ తెలుగు మహాసభల తీర్మానాలు ఏమైనాయి? –'తెరవే'**



తెలంగాణ సాహితీ భీష్ముడు – కపిలవాయి లింగమూర్తి



కన్నడ తోటలో విరిసిన తెలుగు పాట... బుర్రకథ ఈరమ్మ – సంచారి ఆత్మకథ

**భాషావిధానాన్ని ప్రకటించని పార్టీలకు ఓటు వెయ్యవద్దు**




## ‘పాఠశాల విద్య మాతృభాషలోనే’

### మా పార్టీ మానిఫెస్టోలో ప్రకటిస్తాం– శ్రీ వి.వి.లక్ష్మీనారాయణ

సామాజిక, సాంస్కృతిక చైతన్య సంస్థ – ‘సమైక్య భారతి’ నిర్వహణలో వరుసగా పలుపట్టణాలలో ‘అమ్మనుడి లోనే విద్య–ప్రజల భాషలోపాలన’ అనే అంశంపై జరుగుతున్న సభల్లో భాగంగా–తాడేపల్లి గూడెంలో నవంబరు 17న పెద్ద సభ జరిగింది. బి.వి.ఆర్. కళాకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి బుద్ధాల వెంకటరామారావుగారు అధ్యక్షత వహించారు.

సి.బి.ఐ లో జాయింట్ డైరెక్టర్‌గా స్వచ్ఛందంగా పదవీ విరమణచేసి, ప్రజాసేవా రంగంలోకి అడుగుపెట్టి నేటి తెలుగు సమాజ పరిస్థితులను అధ్యయనం చేస్తూ పర్యటిస్తున్న వి.వి.లక్ష్మీనారాయణగారు త్వరలో కొత్తరాజకీయ పార్టీని స్థాపించనున్న సందర్భంలో – తెలుగు రక్షణ విషయమై జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనడం ఆసక్తి కలిగించింది.

తొలుత – ప్రధాన వక్తగా పాల్గొన్న తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు కీలకోపన్యాసం చేస్తూ ప్రత్యక్ష రాజకీయ పోరాటంలోకి ప్రవేశించబోతున్న లక్ష్మీనారాయణగార్కి అభినందనలు తెలియజేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆయన రాజకీయరంగ ప్రవేశాన్ని స్వాగతిస్తున్నామంటూ, అన్నిరంగాలతో పాటు, తెలుగుజాతికి, తెలుగురాష్ట్రాల ఉనికికి సంబంధించిన మౌలిక అంశమైన ‘తెలుగుభాష’ను ప్రశ్నార్థకం చేస్తున్న ప్రభుత్వాల విధానాల్లోని ‘కనిపించని కుట్ర’ను గుర్తించాలని విన్నవించారు. ప్రజలభాషలో పాలన, తెలుగులో విద్యాబోధన అన్న అంశాలపై ఇప్పటివరకూ పాలకవర్గాలు ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాయని, ఈ విషయంపై లక్ష్మీనారాయణగారు తమ స్పందనను చెప్పాలని కోరారు. తొలినుండీ ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాన్ని వివరంగా తెలియ జేశారు.

తర్వాత ముఖ్యఅతిథి శ్రీ వి.వి.లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ మాతృభాషల్ని రక్షించుకోవలసిన అవసరాన్ని, యునెస్కో ప్రకటనలను వివరించారు. తమిళనాడులో, మహారాష్ట్రలో భాష విషయంలో ప్రజలూ, ప్రభుత్వాలూ కూడా ఎంత పట్టుదలతో వ్యవహరిస్తాయో ఉదాహరణలతో చెప్పారు. మహారాష్ట్రలో కోర్టుల్లో మరాఠీ భాషలో తీర్పులు వెలువడతాయన్నారు. డా॥రమేష్‌బాబు ప్రసంగంలో ప్రస్తావించిన పలు విషయాలను ప్రస్తావిస్తూ–రాజ్యాంగంలోను, విద్యాహక్కు చట్టంలోను–ప్రాథమిక విద్య మాతృభాషలో ఉండాలని ఉందన్నారు. తమ పార్టీ మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పెడతాము అని సభికుల చప్పట్ల మధ్య ప్రకటించారు. తెలుగుప్రజల్లో భాషాభిమానాన్ని పెంచడానికి తగు నిర్మాణాత్మక కార్యక్రమాన్ని చేపట్టాలని ‘సమైక్యభారతి’ నేత పి. కన్నయ్యగారికి సూచించారు. ఏ దేశంలో ఎక్కువ చట్టాలుంటాయో, అక్కడ పరిపాలన తక్కువగా ఉంటుంది. అని ఒక పరిశోధన తెలిపింది అని అంటూ, చట్టాలు ఎక్కువ – అమలు తక్కువ’ సరికాదని, పటిష్టమైన పరిపాలనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని లక్ష్మీనారాయణగారు అన్నారు. సభలో తెలుగు పండితులు అనుముల వేంకటేశ్వర్లుగారు, స్థానిక ప్రముఖులు శ్రీయుతులు గట్టిం మాణిక్యారావు, పవన్ కుమార్, శ్యాంప్రసాద్ ముఖర్జీ, శ్రీమతి తుమ్మల పద్మజ తదితరులు వక్తలుగా పాల్గొన్నారు.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



డిసెంబరు 2018

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో www.ammanudi.org చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం : | రాజకీయపార్టీలన్ని తమ భాషావిధానాన్ని వెంటనే ప్రకటించాలి | | 7 |
| పత్రికలు, టీవి : | పత్రికలు, ప్రసార మాధ్యమాలలో... | పులికొండ సుబ్బాచారి | 9 |
| కంప్యూటర్లు – తెలుగు : | తెలుగు భాషకు ఆధునిక హోదా – 11 | వీవెన్ | 13 |
| ముఖచిత్ర కథనం : | తెరవే రాష్ట్ర మహాసభలు | సన్నిధానం నరసింహశర్మ | 14 |
| శ్రద్ధాంజలి : | తెలంగాణ సాహితీ భీష్ముడు | సంకేపల్లి నాగేంద్రశర్మ | 18 |
| నాటు తెలుగు : | నాటు తెలుగు మేటిజెట్టి | కీ.శే.బొడ్డుపల్లి పురుషోత్తం | 20 |
| పొరుగు తెలుగు : | కన్నడ తోటలో విరిసిన తెలుగుపాట | రంగనాథ రామచంద్రరావు | 24 |
| పెద్దోరి తీపి గురుతులు: | కవిత్వ ప్రియుల ఎల్లరిలో.... | సన్నిధానం నరసింహశర్మ | 29 |
| సాహిత్యరంగం : | తెలుగు ఛంఘిజ్‌ఖాన్ | మధురాంతకం నరేంద్ర | 31 |
| పిట్ట చూపు : | అందకుండా పోతున్న గృహవసతి... | చలసాని నరేంద్ర | 34 |
| వేమన : | శబ్ద గాండీవి వేమన– 5 | కీ.శే.దుర్గానంద్ | 38 |
| తెలుగు చరిత్రకారులు : | భావరాజువెంకట కృష్ణారావు | జి. వెంకటేశ్వరరావు | 47 |
| పుస్తక సమీక్షలు : | త్యాగరత్న..., తెలంగాణ ఉద్యమంలో | ఎం.వి.శాస్త్రి | 48 |
| గ్రంథాలయం : | | | 50 |
| ధారావాహిక : | | | |
| బౌద్ధం-వైజ్ఞానిక మార్గం -20 | ..... | బొర్రా గోవర్ధన్ | 44 |

కథానికలు :

| | | |
|---|---|---|
| 1. పెద్ద రగస్యం | సి హెచ్. భాగ్యలక్ష్మి | 36 |
| 2. ఆత్మకు కులమేది! | డా॥ లక్ష్మి అయ్యర్ | 42 |

కవితలు :

| | | |
|---|---|---|
| 1. వందగ్గిద్ద | పల్లిపట్టు నాగరాజు | 12 |
| 2. గోదావరిలాంటి గరిమెళ్ళ | ఎన్ ఆర్ పృథ్వి | 41 |
| 3. తెలుగు కవిత్వం | వై. మాధవరావు | 46 |
| 4. తెలుగుతల్లి | గుర్రాల రమణయ్య | 49 |


వ్యంగ్యచిత్రాలు: సరసి,శేఖర్ రేఖాచిత్రాలు : పాపులూరి చిదంబరేశ్వరరావు కంప్యూటరీకరణ : లంకె జనార్దన్

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

– సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.
కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136 e-mail : editorammanudi@gmail.com

రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

# తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **91502001055 0189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, తెనాలి
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం. 58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (*క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్*) లో ప్రచురితమవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే
ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

వార్తలు

## ఆక్స్‌ఫర్డ్‌కు జేజేలు!

**బతుకమ్మ, బోనాలు పదాలు ఇక ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల్లో...**

ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల శ్రేణిలో దక్షిణాసియా దేశాల్లో పంపిణీ అయ్యే నిఘంటువు రూపాంతరంలో కొన్ని పదాలను చేర్చి సరికొత్త రూపాంతరాన్ని విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ కొత్త రూపాంతరంలో తెలుగు పండుగలలో రెండైన బతుకమ్మ, బోనాలు పదాలుగా నిఘంటువులో చేరనున్నాయి. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రముఖులు ఇచ్చే సిఫార్సులను తప్పక పాటిస్తుంది. ఇన్ని రోజుల మన రాజకీయ నాయకుల అలసత్వం వలన మరెన్నో పదాలను చేర్చలేకపోయాము. సోషల్ మీడియా పుణ్యమాని తెలుగు వాళ్ళు ఊతపదాలుగా వాడే కొన్ని పదాలు జన ప్రాచుర్యం చెంది ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల్లోకి మెల్లగా వెళ్ళాలే తప్ప ప్రభుత్వపరంగా, పలుకుబడి ఉన్న స్థాయిని వాడుకొని సిఫార్సు చేయటం లాంటి పనుల వలన ఇది జరగదు. కానీ ఈ సందర్భంలో మాత్రం నిజామాబాద్ తెరాస పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత అభ్యర్థన మేరకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ఈ పనికి పూనుకుంది. గత సంవత్సరం నవంబరులో ఈ రెండు పదాలను నిఘంటువులో చేర్చవలసినదిగా యూనివర్సిటీ ప్రెస్ కు లేఖ రాయగా, వారు ఆ లేఖకు ప్రతిస్పందనగా రెండు పదాలను చేర్చనున్నట్లు ప్రకటించారు. మరిన్ని తెలుగు పదాలు ఆంగ్ల పదనిధికి చేరితే తెలుగు శోభ పెరుగుతుంది.

**తెలుగు ఈ-డిక్షనరీ (ఆన్‌లైన్ నిఘంటువు) విడుదల...**

తెలుగు భాషకు ప్రపంచ భాషలు అనుభవించే అరుదైన అవకాశం అందింది. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల ప్రపంచ భాషల చొరవలో భాగంగా ఆక్స్‌ఫర్డ్ తెలుగు నిఘంటువును అందుబాటులోకి తెచ్చింది. te.oxforddictionaries.com జాలస్థలంలో ఈ నిఘంటువును చూడవచ్చు. సెప్టెంబర్ 2015లో మొదలైన ఆక్స్‌ఫర్డ్ గ్లోబల్ లాంగ్వేజెస్(ఆక్స్‌ఫర్డ్ విశ్వ భాషల) చొరవలో దాదాపు వంద భాషలకు సంబంధించిన వివిధ వనరులను అందుబాటులో ఉంచే విధంగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నిర్ణయించింది. జాలస్థలాలలో, మొబైల్ ఆప్‌లలో, ఇతరత్రా వివిధ ఉపకరణాలుగా, కోట్లాది జనాల మాతృభాషల్లో సమాచారం అందుబాటులో ఉండాలన్నది తమ ఆశయమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల డైరెక్టర్ జూడీ పియర్సల్ మాట్లాడుతూ, "తెలుగులో నిఘంటువు సేవలను అందుబాటులోకి తేవడం ఆనందంగా ఉంది, ఈ ఆక్స్‌ఫర్డ్ గ్లోబల్ లాంగ్వేజెస్ ఇనీషియేటివ్ ద్వారా ప్రపంచ భాషల ఖ్యాతిని పెంచి, ఆయా భాషలలో నిఘంటువులు, ఇతరత్రా భాషోపకరణాలు అందించడమే మా లక్ష్యం. తెలుగు భారతీయ భాషలలో నాలుగవ అత్యధికంగా మాతృభాషీకులు కల భాష. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, ఇరు రాష్ట్రాలలో, ఇంకా ఎన్నో ప్రాంతాల్లో విరివిగా వాడే భాష. ప్రస్తుత తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు ద్వారా మాట్లాడే-రాసే తెలుగు భాషా పదాలను చేర్చాము, అలానే ఆధునిక-ప్రాచీన పదాలను చేర్చాము. అన్ని వర్గాల వారికీ ఇది ఉపయోగపడుతుందని, అందరికీ అందుబాటులోకి తెచ్చాము. అందువలన భాషకున్న సత్తువ పెరిగి ప్రతిరోజు తెలుగు వాడుకను ఒక ఉత్సాహభరిత అనుభవంగా చేయనున్నాము." అని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ గ్లోబల్ లాంగ్వేజెస్ ఇనీషియేటివ్‌కు మునుపు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువుల సంస్థ లెక్సికల్ ఇంజన్ అండ్ ప్లాట్‌ఫారం(leap)ను భాషా వనరులను రూపొందించుకొని ప్రామాణీకరించి, పంచుకొనే సాధనంగా అభివృద్ధి చేసింది.

## శభాష్ గూగుల్!

**గూగుల్ అసిస్టెంట్ తెలుగులో అభ్యర్థనలను కూడా పాటిస్తుంది...**

"ఓకే గూగుల్! నాకొక తెలుగు కథ వినిపించు!"

"ఓకే గూగుల్! ఇవాళ్టి వార్తలేంటో చెప్పు."

"ఓకే గూగుల్! సరికొత్త తెలుగు పాటలను వినిపించు!"

మీ దగ్గర ఉన్న ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లో లేదా గూగుల్ హోమ్ పరికరంలో లేదా అలెక్సా ఎకోలో మీరు ఆంగ్లంలో ఇచ్చే అభ్యర్థనలను అలెక్సా లేదా గూగుల్ అసిస్టెంట్ తీసుకొని మీరడిగిన ఆదేశాన్ని పాటిస్తాయి. పాటలు వినిపించిచెప్పటం, వార్తలు చదవడం, వాతావరణ సూచనలివ్వడం, కథలు/కవితలు/పుస్తకాలు వినిపించిచెప్పటం, స్మార్ట్ సాంకేతిక ఉన్న ఫ్యానులను, లైటులను, ఇతర ఉపకరణాలను కట్టెయ్యడం లేదా ఆడించడం లాంటివి. ఐతే ఇన్ని రోజులు ఈ ఆదేశాలను కేవలం ఆంగ్లంలో చెబితేనే అర్థమయ్యేది. ఇప్పుడు గూగుల్ తెలుగులో కూడా మన ఆదేశాలను విని, అర్థం చేసుకొని, పాటించనుంది. అమెజాన్ ప్రవేశపెట్టిన అలెక్సా, ఆపిల్ వాడు ప్రవేశపెట్టిన సిరి, మైక్రోసాఫ్ట్ వాడి కోర్టానా తరహాలోనే గూగుల్ అసిస్టెంట్ పని చేస్తుంది. కానీ వాటిలో లేని తెలుగుకు సహకారం గూగుల్ అసిస్టెంట్ లో వినూత్నంగా ప్రవేశపెట్టి పరీక్షించనున్నారు. గూగుల్ అసిస్టెంట్ బీటా లో ఈ సాంకేతిక ఉపకరణం మనకు అందుబాటులోకి వచ్చింది. తెలుగుతో పాటుగా హిందీ, గుజరాతీ, తమిళం, తుర్కిష్, ఉర్దూ, బాంగ్లా, కన్నడ, మలయాళం, మరాఠీ భాషలకు కావాల్సిన సామర్థ్యంతో రానుంది. ఈ సామర్థ్యం పూర్తి స్థాయిలో ఎప్పటికి వస్తుందో ఇంకా చెప్పలేము కానీ గూగుల్ దూకుడును చూస్తుంటే తెలుగుకు అమరాల్సిన అన్ని భాషా సాంకేతికాలు ఏర్పాటు చేయడంలో ఏ మాత్రమూ వెనుకంజలో మాత్రం లేదు.

## గూగుల్ ప్రకటనలు ఇక తెలుగులో!

గూగుల్ యూట్యూబులో, శోధన ఫలితాలలో, జిమెయిల్ పక్కన ఇచ్చే వాణిజ్య ప్రకటనలను ఇప్పటి వరకు ఆంగ్లంలోనే ఇచ్చేలా నిబంధన చేసేది. ఇక తెలుగులోనూ ప్రకటనలు చేసేలా వెసులుబాటునిచ్చింది గూగుల్.

## మైక్రోసాఫ్ట్ నుండి తెలుగు శ్రవ్యకాలు

మైక్రోసాఫ్ట్ ఉచితంగా తెలుగు శ్రవ్యకాలను విడుదల చేసింది. మైక్రోసాఫ్ట్ సంస్థ పరిశోధకులకు పనికొచ్చే తెలుగు ఆడియోలను విడుదల చేసింది. వీటిని వాడి, మాట నుండి పాఠ్యం, పాఠ్యం నుండి మాట రూపొందించడం సులభతరమవుతుంది.

## ట్రిపుల్ఐటీ విద్యార్థిని ప్రతిభ

వర్డ్‌నెట్‌లోకి ఇరవైఒక్క వేల పదాల చేర్పు : పారుపల్లి శ్రీకవిత ట్రిపుల్ఐటీ హైదరాబాదు విద్యార్థిని. ఈమె 8483 క్రియాపదాలు, 253 క్రియావిశేషణాలు, 1,673 విశేషణాలతో ఇండోవర్డ్‌నెట్? నెట్ అనే వేదికపై చేర్చారు. శ్రీకవిత తెలుగు భాషా సాంకేతికాలకు సంబంధించి, ఇప్పటికి దాదాపు ఐదు పరిశోధనా పత్రాలను సమర్పించింది.



Unfiled Notes Page 5

### ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీరు ఇదీ...

## ఆంగ్లమాధ్యమంపై ప్రైమరీ టీచర్లకు శిక్షణ

అమరావతి, నవంబరు 21 *(ఆంధ్రజ్యోతి)*: రాష్ట్రవ్యాప్తంగా 7461 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఆంగ్ల మాధ్యమ బోధనపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఆయా పాఠశాలల్లో 2018 –19 నుంచే ఆంగ్ల మాధ్యమం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో 1,2 తరగతులకు పాఠాలు బోధించే 7461 మందిని ఎంపిక చేసింది. ఒకటో తరగతి విద్యార్థులకు ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం (ఈవీఎస్) పాఠ్యాంశాల్లో ఆంగ్ల మాధ్యమంలో ఎలా బోధించాలో శిక్షణ ఇప్పించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణలో, డివిజన్ల వారీగా 60 కేంద్రాల్లో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 2 వరకు ఐదు రోజులపాటు ఈ శిక్షణ ఏర్పాటు చేస్తున్నారు. **అంగ్ల మాధ్యమ బోధనను ఒకటో తరగతి నుంచి ప్రారంభించి ఏటా ఒక్కో తరగతికి విస్తరిస్తారు.** *(ఆంధ్రజ్యోతి)*

## బ్రిటీష్ కౌన్సిల్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం

రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థులకు ఆంగ్లభాషలో తర్ఫీదు నిచ్చేందుకు బ్రిటీష్ కౌన్సిల్ ముందుకొచ్చింది. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఉండవల్లి నివాసంలో కౌన్సిల్ సాంస్కృతిక ప్రతినిధి అలెన్ గామెల్. సౌత్ ఇండియా హెడ్ జనకా పుష్పనాథన్ సమావేశమై కొద్దిసేపు చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేలకుపైగా ఉన్న వర్చువల్ తరగతులలో ఆంగ్ల విద్యాబోధన చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆన్‌లైన్ పద్ధతిలో ఆంగ్లభాషా బోధన పరీక్షల నిర్వహణకు బ్రిటీష్ కౌన్సిల్ సంసిద్ధత తెలిపింది. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆంగ్లభాష నేర్చుకునేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. భారీ ఎత్తున చేపడుతున్న ఆంగ్ల విద్యాబోధన ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యానికి అంగీకరించిన ముఖ్యమంత్రికి కౌన్సిల్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. *(ఆంధ్రభూమి)*

## ఆదిలోనే ఆంగ్ల మాధ్యమం వద్దు
## తాజా పరిశోధన సూచన

లండన్ : భారత్‌లో పేద విద్యార్థులకు చిన్న వయసులోనే ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ప్రయోజనం చేకూర్చదని తాజా అధ్యయనం చెబుతోంది. ముఖ్యంగా ఇంటిలో వేరే భాషలు మాట్లాడేవారు ఆంగ్లంలో విద్యాభ్యాసంవల్ల ఇతరుల కంటే వెనుకబడుతున్నట్లు తేల్చింది. **బహు భాషలు మాట్లాడే భారత విద్యార్థులు...పశ్చిమ దేశాల విద్యార్థుల స్థాయిలో అభ్యాస, మేధో నైపుణ్యాలు ఎందుకు ప్రదర్శించలేకపోతున్నారనే అంశంపై దృష్టి సారిస్తూ ఈ అధ్యయనం సాగింది.** బ్రిటన్‌లోని రీడింగ్ వర్సిటీ పరిశోధకులు, హైదరాబాద్, దిల్లీలకు చెందిన సంస్థల నిపుణులు సంయుక్తంగా నాలుగేళ్లపాటు దిల్లీలలోని వెయ్యిమంది ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సమాచారాన్ని వీరు విశ్లేషించారు. ఈ మూడు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో భిన్న ప్రమాణాలు, వేర్వేరు విద్యాబోధన విధానాలను అనుసరిస్తున్నట్లు గుర్తించారు. విద్యార్థులే కేంద్రంగా సిద్ధంచేసే బోధన విధానాలు లేకపోవడం వల్లే పిల్లల్లో అభ్యాస నైపుణ్యాలు తక్కువగా ఉంటున్నట్లు వీరి విశ్లేషణలో తేలింది. బోధన విధానాల్లో ఉపాధ్యాయుల ఆధిపత్యం ఉంటోందని, స్వతంత్రంగా నేర్చుకునేందుకు పిల్లలకు అవకాశం ఉండటం లేదని బయటపడింది. "పేదలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసించే విద్యార్థులకు ఆంగ్లంలో విద్యాభ్యాసం మొదలు పెట్టడం మంచిది కాదని ఈ ప్రాజెక్టు చెబుతోంది. **సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకే కాదు. ఎవరైనా సరే. తమకు అనువైన భాషలోనే విద్యాభ్యాసం మొదలు పెట్టాలి. అప్పుడే పిల్లలు మెరుగ్గా నేర్చుకో గలరు"** అని కేంబ్రిడ్జి వర్సిటీ పరిశోధకురాలు లాంథి సింప్లీ తెలిపారు.

*(ఈనాడు - 26-11-2018)*



సంపుటి : 4 సంచిక : 10
అమ్మనుడి
డిసెంబరు 2018

సంపాదక హృదయం

# భాషావిధానాన్ని ప్రకటించని పార్టీలకు ఓటు వెయ్యవద్దు

తెలంగాణలో డిసెంబరు 7న శాసన సభకు ఎన్నికలు జరుగనున్నాయి. పార్టీలన్నీ దాదాపుగా తమ వాగ్దాన పత్రాల్ని (మానిఫెస్టో)ను విడుదల చేశాయి. ఏ పార్టీ అయినా తమ ప్రభుత్వం ఏర్పడితే, తమ భాషా విధానం ఏమిటో స్పష్టంగా ప్రకటించిందా? జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపా, రెండు కమ్యూనిస్టు పార్టీలు యీ విషయంపై ఏమని ప్రకటించాయి? ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన ఉద్యమానికి కీలకమైన తెలంగాణ రాష్ట్ర సమితి తన నాలుగున్నరేళ్ల పాలనలో పాలన, విద్యారంగాల్లోను, సాంస్కృతిక రంగంలోను ప్రజల భాషలను వినియోగించడంలో చేసిందేమిటో, చెయ్యబోయేదేమిటో వివరించిందా? ప్రజాకూటమిలో భాగంగా ఉన్న కోదండరామ్‌గారి పార్టీ ఈ అంశాలపై తమ ఎన్నికల ప్రణాళికలో ఏం చెప్తున్నది? – ఈ వివరాల్లోకి వెళ్తే ఎంతో బాధ కలుగుతుంది. ఈ అంశాల పట్ల ఈ పార్టీలన్నిటి 'పట్టనితనం' స్పష్టమవుతుంది.

తెలంగాణ ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడడం జరిగిపోయింది. కేవలం రాజకీయ, ఆర్థిక అంశాలపైనే కాకుండా, భాషా సాంస్కృతిక అంశాలపై కూడా తమ ప్రత్యేకతను కాపాడుకోవడం కూడా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు తప్పనిసరి అని నినదించిన వారంతా ఇప్పుడు ఎందుకు అచేతనంగా ఉన్నారు? పాలనలో, చదువులో అమ్మనుడిని కాపాడుకోలేకపోతే – సాంస్కృతికతే కాదు, సొంత గొంతుకే మూగపోతుందని, సామాజిక అభివృద్ధి కుంటుపడుతుందని వీరికెవరైనా చెప్పాలా? మౌలిక, కీలక అవసరాలను పట్టించుకోకుండా, జాతి మనుగడ సాగించడం నేల విడిచి సాము చెయ్యడం కాదా? ఈ పత్రిక నలుగురికీ చేరేలోపునే – ఎన్నికలు జరిగిపోతాయి. ఆలోచనకు ప్రేరేపించి, ముందున్న కాలం గురించీ బాధ్యతలను గురించీ హెచ్చరించడమే కర్తవ్యంగా వ్రాస్తున్నాము తప్ప, వెంటనే ఏదో సాధించేస్తామని కాదు. నిజానికి, తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో తెలుగు భాషా రక్షణకు ఏమైనా కృషి అంటూ జరిగిందా? పోయినేడు చివరిలో తెలంగాణ ముఖ్యమంత్రిగారు పట్టుబట్టి జరిపిన ప్రపంచ తెలుగు మహాసభల్లో చెప్పిన మాటలేవైనా అమలు జరిగాయా? పైగా తుది నిర్ణయాలను ప్రకటించడానికి మరి కొద్ది రోజుల వ్యవధి కావాలని ముగింపు సభలో స్వయంగా ప్రకటించి, ఆ తర్వాత ఆ సంగతినే మరచిపోయిన ముఖ్యమంత్రిగారి చిత్తశుద్ధిని ఎందుకు శంకించకూడదు?

ఇప్పుడైనా, తెలంగాణకు బంగారు భవిష్యత్తునూ స్వాభిమానంతో కూడిన మనుగడనూ కోరుకొనే వారంతా ఉద్యమించవలసిన అవసరాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఇప్పుడు ఎన్నికలు జరిగి, కొత్త ప్రభుత్వం ఏర్పడబోతోంది. ఆ వెంటనే తెలంగాణ ప్రజల స్వాభిమాన ఉద్యమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించి కొన్నేళ్లపాటు సాగించడానికి ఉద్యమ చైతన్యమున్న ఆలోచనాపరులు పూనుకోవాలి. ప్రజాస్వామ్య పద్ధతుల్లో – కొత్త ప్రభుత్వానికి దిశానిర్దేశం చెయ్యడానికీ, ప్రతిపక్షాలలో చలనాన్ని కలిగించడానికీ – ఈ ఉద్యమం తప్పనిసరి.

ఇదే సమయంలో – 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రం గురించి కూడా మనం ఆలోచించాలి. రాష్ట్ర విభజన

జరిగిన తర్వాత భాషోద్యమకారులు ముఖ్యమంత్రిపై నిరంతరం వత్తిడి తెచ్చిన ఫలితంగా 'తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ' ఏర్పాటుకు కావలసిన ఉత్తర్వులైతే వెలువడ్డాయి. ఆం.ప్ర. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి తెలుగు భాషాభిమానాన్ని వీలైనప్పుడల్లా పొగుడుతూ, ఆయన 'ఇమేజ్' ను కాపాడడానికి నిత్యమూ కృషి చేసే అధికార, అధికారేతర భజన బృందాలు మాత్రం ఎప్పుడూ చురుగ్గా ఉంటాయి. అందువల్ల జరిగే ప్రచారం ఎంత ఉన్నా – చంద్రబాబుగారికి ఉన్న ఆంగ్లభాషా వ్యామోహం గురించి అందరికీ తెలుసు. ఇంగ్లీషులో చదువుకొంటేనే అభివృద్ధి అని ఆయన ప్రగాఢ విశ్వాసం. తెలుగు భాష కేవలం ప్రజలతో మాట్లాడడానికే తప్ప మరెందుకూ పనికిరాదని ఆయనలో ఒక స్థిరమైన అభిప్రాయం ఏర్పడిపోయింది. తెలుగు కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే తప్ప, అభివృద్ధికి పనికిరాదని ఆయన సిద్ధాంతం. ఈ సంగతిని ఆయన అవకాశం వచ్చినప్పుడల్లా బహిరంగంగా ప్రకటిస్తూనే ఉన్నారు. అందుకే ఆయన 'ఉనికి కోసం తెలుగు; బ్రతుకు తెరువుకూ అభివృద్ధికీ ఇంగ్లీషు' అని ప్రభుత్వ వేదికలపైనే – తెలుగు భాషా దినోత్సవాల సందర్భాల్లో సైతం ప్రకటిస్తుంటారు. అదే సమయంలో తెలుగు కోసం 'ఏదో చేస్తున్నట్లు జి.ఒ.లను, వాగ్దానాలను విడుదల చేసి, పండితులకు, కవులకు, కళాకారులకు సన్మానాలు చేస్తుంటారు. దానికి విరివిగా ప్రచారం వచ్చేస్తుంటుంది. ఇలాంటి సందర్భాల్లో మనకు తెలియాల్సింది ఒకటే – 'పాలకులు ఏమి చేసినా రాజకీయకోణం నుంచే ఆలోచించి చేస్తారు' అని. దీన్ని అర్థం చేసుకోవాలంటే – ముఖ్యమంత్రిగారి ధోరణులను నిశితంగా గమనించాలి. ఆయనను మాటల్నిబట్టి కాక, చేతల్నిబట్టి చూడాలి.

తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షాల పాత్ర ఈ విషయంలో ఎంతో నిరాశాజనకంగా ఉంది. కుడి ఎడమల సిద్ధాంతాల పార్టీలైనా, మధ్యేమార్గ పార్టీలైనా – ఉపన్యాసాల వరకే తప్ప, ఉద్యమ రూపంలో గాని, మరో విధంగా గాని ప్రభుత్వ భాషా విధానం గురించి పట్టించుకోలేదు. వామపక్షాలకు చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు కొన్ని మాత్రం ఇందుకు మినహాయింపు. అయినా రాజకీయ పార్టీలుగా అవి భాషోద్యమాల్ని నడిపేందుకు సిద్ధంగా లేవు. భాష పట్ల వారికి ఉన్న అవగాహనలోపమా అనుకోవడానికి వీలులేదు గాని, అది ఇప్పుడొక రాజకీయ అవసరం కాదనో, ఓట్లు తెచ్చిపెట్టే అంశం కాదని భావిస్తున్నారేమో తెలియదు. ఇదే ధోరణి భాజపా, దాని పరివార సంస్థల విషయంలోనూ కన్పిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు జరుగడానికి ఇంకా ఆరు నెలల సమయం ఉంది. ఈ వ్యవధిని పూర్తిగా వినియోగించుకొని, రాష్ట్రంలోని చైతన్యశీలురు కదలాలి. మానవ హక్కుల సంఘాలు, విద్యాహక్కు వేదికలు, ఉపాధ్యాయ – విద్యార్థి సంఘాలు, రచయితల సంఘాలు, సాంస్కృతిక సంఘాలు, కళాకారులతో సహా వివిధ సామాజిక రంగాలలోని ఉద్యమకారులు అందరి ప్రమేయంతో సమాలోచన జరగాలి. ఇందుకు భాషోద్యమకారులు పూనుకోవాలి.

ఈ ప్రయత్నంలో మనం గుర్తు పెట్టుకోవలసిన సంగతి : ఏదో భావోద్వేగ (సెంటిమెంటు) అంశంగా గాక, పాలన, విద్య తెలుగులో జరిగినప్పుడే తెలుగుజాతికి మనుగడ, అభివృద్ధీ, భవిష్యత్తూ ఉంటుందనే ప్రాతిపదిక మీద ఈ ఉద్యమం సాగాలి. రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని గుర్తించి, తమ ఎన్నికల వాగ్దానాల్లో చేర్చి, స్పష్టంగా తమ భాషా విధానాన్ని ప్రకటించి తీరాలి అనే వత్తిడిని తెచ్చేందుకు, ఆ లక్ష్యాన్ని సాధించేందుకూ ఈ ఉద్యమం జరగాలి. భాషా విధానాన్ని స్పష్టంగా ప్రకటించనివారికి ఓటు వెయ్యం అని అన్ని పార్టీలకూ తెలియజెప్పాలి.

తేదీ : 30-11-2018

సామల రమేష్‌బాబు

పత్రికలు, టీవీ

ఆచార్య పులికొండ సుబ్బాచారి
9440493604

# పత్రికా ప్రసార మాధ్యమాలలో భాషారాజకీయం




నిత్యం జరిగే వార్తలలో పత్రికలు ఛానెళ్లు అప్పటికప్పుడే వార్తారచనలో పదాల వినియోగం గురించి తాము నిలబడవలసిన గట్టు గురించి నిర్ణయించుకొని పదాల ఎంపిక చేసుకుంటాయి. తమ భావాన్ని పదాల వినియోగంలో చెప్పిన తాము అటు పక్కన ఉండి సమర్థిస్తున్నాము అనే పూర్తి భావం రాకుండా జాగ్రత్త పడతాయి పత్రికా సంస్థలు. ఈ తరహా భాషావినియోగాన్నే భాషారాజకీయం అని నిర్వచించాలి.

అంతర్జాలయుగంలో ఉన్నాయి మన ప్రసార మాధ్యమాలు. మాధ్యమాల వ్యాప్తికి అంతర్జాలం బాగా తోడ్పడుతూ ఉంది అని చెప్పడమే కాక, అత్యంత ఆధునిక స్థాయిలో మన ప్రసార మాధ్యమాలు ఉన్నాయని చెప్పాలి. అటు అక్షర మాధ్యమం (పత్రికలు) ఇటు దృశ్యమాధ్యమం అత్యంత ఆధునిక సాంకేతిక సౌకర్యాలను వినియోగించుకుంటున్నాయి. వీటి వ్యాప్తి ఎంత పెరుగుతూ ఉందో వాటితో పాటు భాషావ్యాప్తి కూడా అంత పెరుగుతుందని ఇక్కడ అర్థం చేసుకోవాలి. ఇక్కడ దేశ భాషల గురించి విశేషించి – తెలుగు పరిస్థితి గురించే ఈ వ్యాసం ఉద్దిష్టం. ఈనాడు దృశ్య మాధ్యమాలతో పాటు పత్రికలు కూడా ప్రపంచంలోని ఏదేశంలోనైనా ఏ మారుమూల ప్రాంతానికైనా సులభంగా చేరిపోతున్నాయి. దీనికి వెనుక ఉన్నది అంతర్జాల సాంకేతికతే. అయితే ఇంతకు ముందు కూడా తెలుగు పత్రికలు వేరే దేశాలలో ఉన్న తెలుగు వారికి చేరేవి. ఎవరో ఎక్కడో ఏదేశంలోనో ఒకరు చందా కడితే నేటి పత్రిక మూడు రోజుల తర్వాత చేరేది. కాని నేటి పరిస్థితిలో పత్రిక అర్ధరాత్రి మూడు గంటల సమయంలో, అంటే తయారైన మరుక్షణమే జాలగూడులోకి ఎగుమతి చేస్తే అదే క్షణంలో ఎక్కడి వారైనా పత్రికను చదివే సౌకర్యం వచ్చింది. అయితే ఇక్కడ ప్రశ్న ఒకటి పుడుతుంది. ప్రపంచంలో తెలుగు వారు ఉన్న దగ్గరికే ఇది పోతుంది కదా. అక్కడ అప్పటికే తెలుగు వారు ఉన్నారు కాబట్టి ఇక ఈ సాంకేతికత భాషావ్యాప్తికి ఎలా దోహద పడినట్లు, తెలుగు వారే వ్యాప్తి చేస్తున్నారు కదా అన్నదే ఆ ప్రశ్న. ఆయా ప్రాంతాలలో ఉన్న తెలుగు వారు దైనందిన జీవితంలో మాట్లాడుకునే భాష వేరు, మాధ్యమాలలో ఉన్న భాష వేరు. మాధ్యమాలు వాటికవే ఒక ప్రత్యేకమైన భాషాశైలిని ఏర్పరచుకున్నాయి. అటు అచ్చు మాధ్యమాలలో ఇటు దృశ్యమాధ్యమాలలో వాటికై వాటికి ఒక భాష, కొంత పద సంపద ఏర్పడింది. ఇలాంటి ప్రత్యేకమైన పదసంపదతో ఉన్న భాష ఇంతకు ముందు పత్రికలు భౌతికంగా చేరే చోటికే అంటే ఆ పత్రికకే అది తిరిగే ప్రాంతానికే పరిమితం అయ్యేది. కాని నేడు పత్రికలు అంతర్జాలంలో లభిస్తూ ప్రతిదేశం ప్రతి చోటికీ చేరే స్థితిలో ఈ భాషావ్యాప్తి కూడా అలా విశ్వవ్యాప్తం అయింది. అలా విశ్వవ్యాప్తం అయిన మాధ్యమ భాషలో, వినియోగంలో భాషారాజకీయం ఎలా ఉంది. ఎలాంటి పద్ధతులు ఆయా మాధ్యమాలు అనుసరిస్తున్నాయి? అని ఇక్కడ వివేచించదలిచాను.

అటు అక్షరమాధ్యమానికి కాని, ఇటు దృశ్యమాధ్యమానికి కాని ఉన్న అసలైన పని వార్తని ప్రజలకు అందించడం. ప్రజలు మాట్లాడుకునే భాషలో అంటే ప్రామాణికంగా అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యే భాషలో అందించడం. అయితే వార్తని వార్తగా అందించడమా లేదా మాధ్యమం తన అభిప్రాయాన్ని జోడించి అందించడమా. లేక కేవలం తన అభిప్రాయాన్ని మాత్రమే అందించడమా అనేది వాటి అవసరాన్ని బట్టి ఆయా మాధ్యమ సంస్థలకున్న రాజకీయ సైద్ధాంతిక నేపథ్యాన్ని బట్టి ఉంటుంది. ఇలా వార్తనందించే నేపథ్యంలోనే భాష వినియోగం ఒక ప్రత్యేకప్రాధాన్యతని సంతరించుకుంటుంది.

తెలుగు పత్రిక, విశేషించి దిన పత్రిక వార్తని సేకరించి సంపాదనం చేసి పత్రికలో అచ్చు వేసి తన పాఠకులకు అందిస్తుంది. దృశ్యమాధ్యమమూ అదే పనిచేస్తుంది. చూసిన విలేకరి నుండి లేదా చెప్పిన వ్యక్తి అక్కడి నుండి సేకరించిన విలేకరి అక్కడి నుండి సబ్ ఎడిటర్, చివరిగా ఎడిటర్ వంటి అన్ని వడపోతలను దాటి పత్రికలో పాఠకుడికి ప్రత్యక్షం అవుతుంది. దృశ్యమాధ్యమంలో అంటే ఒక టీవి ఛానెల్ అందించే వార్తలో కూడా కాస్త అటుఇటుగా ఇదే వడపోతలతో వార్త అక్కడ శ్రోతకు చేరుతుంది. ఈ క్రమంలో సమాచార దాత, సేకర్త, సంపాదకుడు స్థాయిలు దాటి పాఠకుడి లేదా శ్రోతకు వార్తని చేర్చే సాధనం భాష. ఇదే వార్త సృష్టి కర్తకు వార్త శ్రోతకు లేదా పాఠకుడికి మధ్యన అనుసంధానంగా ఉండే అసలైన మాధ్యమం. ఈ మాధ్యమం అంటే భాష – వార్తని అందించడం లోనే కాదు దాన్ని వ్యాఖ్యానించి అందించడంలో కూడా చాలా గొప్ప పాత్ర పోషిస్తుంది.

వార్తని వార్తలాగా అందించే స్థితి ఒకటి మాత్రమే కాక వార్తాసంస్థలు అంటే పత్రికలు దృశ్యమాధ్యమాలు వాటికున్న రాజకీయ సైద్ధాంతిక నేపథ్యాన్ని జోడించి వార్తని పాఠకుడికి లేదా శ్రోతకి అందిస్తాయి అని అన్నాము. అయితే అన్ని వార్తలని ఇలా అందించవలసిన పనిలేదు. చాలా వరకు వార్తని అంటే విషయాన్ని విషయంగా పాడి

పొడిగా అందించడం ఉంటుంది. ఇక రెండోది తన వ్యాఖ్యానాన్ని జోడించి చెప్పడం ఉంటుంది. ఇక మూడోది కేవలం తన అభిప్రాయాన్ని మాత్రమే చెప్పడం ఉంటుంది ఇది మూడోది. వార్తాపత్రికలో ఉండే భావప్రకటన పుట/ సంపాదక పుట ఈ పనిచేస్తుంది. ఇలాంటి ఒక 'స్లాట్' (కాలవ్యవధి) దృశ్య మాధ్యమాలకు కూడా ఉంటుంది. ఇక సంపాదక (ఎడిటోరియల్) పుటలో కేవలం పత్రిక యాజమాన్యానికి లేదా సంపాదకుల భావాలకు చోటు మాత్రమే కాకుండా ఆయా వార్తలకు చెందిన విశేషజ్ఞుల వ్యాసాలు కూడా ఉంటాయి. ఇది కూడా భావప్రకటనే. వ్యాసకర్తలు ఎవరైనా వారి భావాలు పత్రికా సంస్థకు నచ్చక పోతే వాటిని భావప్రకటన పుటలో వేసుకోరు. అసాధారణంగా వేసుకోవడం క్వచిత్తుగా జరిగేది.

ఈ భావ ప్రకటన సందర్భంలోనే భాషకు ఒక ప్రత్యేక వినియోగం ఉంటుంది. వార్తని వ్యాఖ్యానించి పాఠకులకు లేదా శ్రోతకు అందించే క్రమంలోనే భాషలో ఉన్న కొన్ని ప్రత్యేకమైన పదాలను ఎన్నుకొని వినియోగించవలసి ఉంటుంది. అలాంటి వాక్య రచనలు ఎలా ఉంటాయి. పదాల ఎంపిక ఎలా ఉంటుంది అని పరిశీలించడం ఇక్కడి పని:

ఒక రాజకీయనాయకుడు చెప్పిన విషయాన్ని వార్తగా అందించాలి. కింది వార్తని చూడండి.

"వచ్చే ఎన్నికల్లో వందసీట్లకు తగ్గకుండా గెలుస్తాం".

ఇది ఒక నాయకుడు అన్నమాట. పత్రిక ఈ వాక్యాన్ని యథాతథంగా పాఠకుడికి లేదా శ్రోతకి అందించవచ్చు. కాని, పత్రిక కాని లేదా ఛానల్ కాని ఇలా చెప్పదు. కింది వాక్యాన్ని పరిశీలిద్దాం.

1. "వచ్చే ఎన్నికల్లో వంద సీట్లకు తగ్గకుండా గెలుస్తాం అని ఫలానా పార్టీ నాయకుడు సుబ్బారావు జోస్యం చెప్పారు"

2. "వచ్చే ఎన్నికల్లో వంద సీట్లకు తగ్గకుండా గెలుస్తాం అని ఫలానా పార్టీ నాయకుడు సుబ్బారావు ధీమా వ్యక్తం చేసారు"

3. "వచ్చే ఎన్నికల్లో వంద సీట్లకు తగ్గకుండా గెలుస్తాం అని ఫలానా పార్టీ నాయకుడు సుబ్బారావు బలాన్ని ప్రకటించారు"

పైన ఉన్న మూడు వాక్యాలు మూడు రకాలైన భావాలను వ్యక్తం చేస్తాయి. ధీమా వ్యక్తంచేశారు అనే వాక్యం పత్రికకు కాని లేదా ఆ ఛానెల్ కు కాని ఆ నాయకుడి పట్ల లేదా పార్టీ పట్ల ఉన్న సానుకూల భావాన్ని తెలియజేస్తుంది. ఇలా బలాన్ని ప్రకటించారు అనే మాట కూడా సానుకూల దృక్పథాన్నే తెలుపుతుంది కాని, కొంత తేడా ఉంది. మరింతగా సానుకూలతని చెప్పడానికి వాస్తవ స్థితి ఇదే అని ప్రకటించడానికి ఈ వాక్యం పనికి వస్తుంది. పత్రికే కొంత పకడ్బందీ సమాచారాన్ని సేకరించి ఉన్న స్థితి నిజమైన బలం ఇది అని చెప్పినట్లుగా వార్తని శ్రోతకి లేదా పాఠకుడికి అందించడానికి ఈ వాక్యం ఉపయోగపడుతుంది. ఇక వాక్యం 1 ఆనాయకుడి పట్ల లేదా ఆ పార్టీ పట్ల వార్తా పత్రికకు లేదా ఛానెల్ కి ఉన్న ప్రతికూల భావాన్ని చెబుతుంది. అసలు వార్తా వాక్యానికి ఒక పదాన్ని కలపడం ద్వారా ఇలా పత్రిక లేదా వార్తా సంస్థ తన భావాన్ని జోడించి చెప్పడానికి వీలు పడింది. ఇలా పత్రికా సంస్థ పత్రికలు ఛానెళ్ళు ఒక పదంతోనే వ్యాఖ్యానం చేయడానికి వినియోగించే పదాలు పదబంధాలు మనకు ఈనాడు చాలా కనిపిస్తాయి. కింద మరొకటి పరిశీలన చేద్దాం.

"చెప్పారు", "చెప్పుకొచ్చారు" ఈ రెండు పదాల వినియోగాన్ని సాధారణంగా దృశ్యమాధ్యమాల వారు ఎక్కువగా ప్రచారంలోనికి తీసుకువచ్చారు.

"వచ్చే రెండు నెలల్లోనే ఈ పథకం అమలులోనికి వస్తుందని, దీనివల్ల కనీసం రెండు లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఫలానా వెంకటరావుగారు చెప్పారు".

"వచ్చే రెండు నెలల్లోనే ఈ పథకం అమలులోనికి వస్తుందని, దీనివల్ల కనీసం రెండు లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఫలానా వెంకటరావుగారు చెప్పుకొచ్చారు".

మొదటి వాక్యంలో ఉన్న 'చెప్పారు' అనే క్రియ నాయకుడు చెప్పిన విషయాన్ని యథాతథంగా పాఠకుడికి అందిస్తుంది.

రెండో వాక్యంలో ఉన్న క్రియాపదం 'చెప్పుకొచ్చారు' ఆయన అలా అన్నారు; అంతే కాని అది నిజంగా జరిగేది కాదు అనే భావాన్ని

అందిస్తుంది. మిగతా వారు దీన్ని నమ్మడం సాధ్యం కాదు అని చెప్పే పనిని ఈ రెండో వాక్యం చేస్తుంది.

ఒకే వార్తని అందించడంలో దానికి శీర్షికని ఏర్పాటు చేయడంలో పత్రికలు ఛానెళ్ళు ఏ వైపు తాము నిలబడేది చెబుతాయి. కింది వాక్యాలను చూద్దాం. ఇక్కడ పదాలను వాక్యరచనను మార్చుకొని చెప్పే పద్ధతిని మనం గమనించాలి. ఆర్టీసి కార్మికులు, లేదా ఫలానా పరిశ్రమ కార్మికులు లేదా ఫలానా ఉద్యోగులు సమ్మెచేస్తామని చెప్పారు అని కాని, నోటీసు ఇచ్చారు అని కాని రాస్తే, చెబితే, అది వార్తని వార్తగా ప్రజలకు లేదా పాఠకులకు అందించినట్లు అవుతుంది. కాని వార్తా పత్రికలు అలా చేయవు. కింది వాక్యాలను చూస్తే విషయం మనకు అవగతం అవుతుంది.

"ఆర్టీసి కార్మికులు సమ్మెబాట పట్టనున్నారు".

"ఆర్టీసి కార్మికులు సమ్మె దిశగా పోరుబాట పట్టనున్నారు".

"పరీక్షలు నిర్వహించకుండా సమ్మెకుదిగుతామని అధ్యాపకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు".

"రిజర్వేషన్ల కోసం ఉద్యమ శంఖారావాన్ని, లేదా సమ్మె శంఖా రావాన్ని పూరించారు".

పై వాక్యాలను గమనిస్తే పత్రిక తాను తీసుకుంటున్న స్టాండ్ ఏమిటో మనకు స్పష్టంగా తెలుస్తుంది. 'సమ్మెబాట పట్టనున్నారు'. అనడం కొంత చేసే వారికి అనుకూలంగా చెప్పడం ఉంది. 'సమ్మెచేస్తామని ప్రకటించారు' అని అంటే ఈ భావం దొర్లదు. ఇక రెండో వాక్యం 'పోరుబాట పట్టనున్నారు' అనే వ్యాఖ్యానం స్పష్టంగా పత్రిక కార్మికులను సమర్థించి రాసింది అని తెలిసి పోతుంది. సమ్మె చేస్తామని హెచ్చరించారు అనే వాక్యంలో హెచ్చరించారు అనే పదం చేసే వారికి కొంత ప్రతికూలంగా పత్రిక తన భావాన్ని చెప్పినట్లు తెలుస్తుంది. ఈ సమ్మె వల్ల ప్రజలకు జనసామాన్యానికి నష్టం జరుగుతుంది అని అనుకున్నప్పుడు పత్రికలు ఈ రకమైన ప్రతికూల భావాన్ని ఇచ్చే వాక్యాలు రాస్తారు. "ఆటో కార్మికులు సమ్మెకు దిగడంవల్ల ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు" అని రాయడం కార్మికులు చేసే సమ్మె ప్రజలకు వ్యతిరేకమైనదని, రేట్లు పెంచమని కోరడం సమంజసం కాదు అని ప్రజలు భావిస్తున్నారని పత్రికలు వాటి స్టాండును ప్రకటించవలసి వచ్చినప్పుడు ఇలాంటి వాక్యరచనను ఎంపిక చేసుకుంటాయి.



Unfiled Notes Page 10

"ఇక రిజర్వేషన్ల కోసం, ఫలానా ఉద్యోగులు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం ఉద్యమ శంఖాన్ని పూరించారు" అనే రకమైన వాక్య రచనలో పత్రిక పూర్తిగా సమ్మె చేస్తున్న ఉద్యోగులను సమర్థించి రాయడం కనిపిస్తుంది.

భావ ప్రకటన కోసం పదాలను ప్రత్యేకించి ఎంపిక చేసుకోవడం వాక్యరచనలో భిన్నమైన పద్ధతిని పదప్రయోగాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా ఉన్న విషయానికే పత్రిక తన భావాన్ని జోడించి చెప్పడం పైన చూపిన ఉదాహరణలలో కనిపిస్తుంది. ఇలాంటి వార్తా రచనకు ఇదే తరహా వాక్యాలను చాలా వాటిని చూపవచ్చు.

సమాజంలో కొత్తకొత్తగా జరిగే విషయాలను ప్రజలకు అందించడంలో కూడా వార్తా సంస్థలు పత్రికలు ఛానెళ్లు తమదైన నిర్ణయాలను తీసుకోవడం వ్యాఖ్యాత్మకమైన పదాలను వాక్యరచనను చేస్తున్నాయి. ఇలాంటి వాటిని కొన్నింటిని చూద్దాం.

సొంత కూతురిని, లేదా చెల్లెలిని లేదా వారు ప్రేమించిన వ్యక్తిని చంపడం అనేది ఆయా కుటుంబాల పరువుకు సంబంధించిన విషయం అని ఆయా కుటుంబాల వారు చెప్పరో లేదో కాని పత్రికలు మాత్రం అలాంటి హత్యలను "పరువు హత్యలు" అని నిర్ధారణ చేశాయి. ఇంగ్లీషు పత్రికలు కూడా honor killing అని కొత్త పదబంధాన్ని సృష్టించాయి. మొదట ఇంగ్లీషులో వచ్చిన తర్వాత వేరు వేరు భాషల వారు అనువాదం చేసారో లేదా ఇటు నుండి అటు వెళ్ళిందో చెప్పడం కష్టం. కాని ఈ తరహా హత్యలకు పేరు పెట్టి ప్రచారం చేయడం మాత్రం వార్తా మాధ్యమాలే చేశాయి.

జరిగిన ఒక హత్య వెనుక సరైన కారణం ఉంది అని ఈ హత్యా కాండని సమర్థించవచ్చునని చెప్పే ఒక అర్థం ఈ పదబంధం సృష్టి వెనుక కనిపిస్తుంది. ఎవరి పరువు, ఎవరికి ఆనర్. హత్య చేసిన వారికా పత్రికల వారికా లేదా ప్రజలకా. చివరికి కోర్టులు హత్యని హత్య అనే అనాలి దానికి వేరే వర్గీకరణలు లేవు అని చెప్పవలసి వచ్చింది. మేధావులు కూడా ఇటీవల సామాజిక మాధ్యమాలలో పరువు హత్యలు అని రాయవద్దు అని గట్టిగా చెప్పారు. కొన్ని తెలుగు పత్రికలు కులద్వేషం అని కులాహంకార హత్యలు అని కొత్త పేరు పెట్టాయి. ఇవికొంత అర్థవంతంగా అంటే హత్యే అని నేరపూరితమైనదే అనే అర్థం వచ్చేలా ఉన్నాయి.

దుర్ఘటనలో వ్యక్తులు చనిపోయినప్పుడు కేవలం 'చనిపోయారు' లేక 'మరణించారు' అని రాయకుండా 'దుర్మరణం పాలయ్యారు' అని రాయడంలో కూడా పత్రిక తన భావాన్ని జోడించడం కనిపిస్తుంది. 'ఘోరం' జరిగింది 'ఘోరకలి' అని రాయడం కూడా పత్రిక కేవలం వార్తని మాత్రమే రాయకుండా భావప్రకటన చేయడంగా భావించవచ్చు.

పోలీసులకు వేర్వేరు వాదాల ఉగ్రవాదులకు యుద్ధం జరుగుతుంది. అందులో అటు కొంతమంది ఇటు కొంతమంది చనిపోతారు. 'కాల్పులు జరిగాయి, పది మంది ఉగ్రవాదులు మరణించారు'. 'ఈ ప్రయత్నంలో ఇటు పోలీసులలో కూడా ఇద్దరు మరణించారు' అని పొడిపొడిగా పత్రికలు కాని ఛానెళ్ళు కాని వార్తలు రాయవు. మన సైన్యానికి సీమాంతర ఉగ్రవాదులకు లేదా శత్రుసైన్యాలకు మధ్య కాల్పులు జరుగుతాయి. రెండు వైపులా ప్రాణ నష్టం ఉంటుంది. ఇలాంటప్పుడు కూడా పత్రికలు ఛానెళ్లు తప్పకుండా ఒక పక్కన నిలబడి వార్తలు రాయడం చెప్పడం మనం స్పష్టంగా చూడవచ్చు.

"నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు". లేదా "ఆరుగురు ఉగ్రవాదులు హతం". "మావోయిస్టుల ఏరివేత". "దళాలు జల్లెడపడుతున్నాయి". "ముగ్గురు ముష్కరుల కాల్చివేత".

ఈ తరహా వాక్యాల, పదాల వినియోగంలో పత్రికలు వార్తా చానెళ్ళు ఉగ్రవాద వ్యతిరేక ధోరణిని కనిపింపచేస్తాయి.

హతం, ఏరివేత, కాల్చివేత అనే పదాలు వ్యతిరేకభావాన్ని తెలియజేస్తాయి. ఉగ్రవాదుల పట్ల ద్వేషభావాన్ని చెబుతాయి. ప్రజలు అత్యధికసంఖ్యలో ఉగ్రవాదులకు వ్యతిరేక భావంతో ఉన్నారని తెలుసుకున్న పత్రికలు ఈ తరహా పదాలను వినియోగించి తమ భావప్రకటనకు మంచి ఊతాన్నిస్తాయి.

ఇలాంటి సందర్భాలలో పౌరహక్కుల నేతలు ఈతరహా ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నా, వారి స్వరాన్ని కూడా పత్రికలు వినిపిస్తాయి. అయినా పత్రికలు తాము చెప్పదలచుకున్న భావాన్ని తమ వార్తారచనలో ఒక పదంతోనే వ్యక్తం చేస్తాయి.

ఇలాంటివి నిత్యం జరిగే వార్తలలో పత్రికలు ఛానెళ్లు అప్పటికప్పుడే వార్తారచనలో పదాల వినియోగం గురించి, తాము నిలబడవలసిన గట్టు గురించి నిర్ణయించుకొని, పదాల ఎంపిక చేసుకుంటాయి. తమ భావాన్ని పదాల వినియోగంలో చెప్పిన తాము అటు పక్కన ఉండి సమర్థిస్తున్నాము అనే పూర్తి భావం రాకుండా జాగ్రత్త పడతాయి పత్రికా సంస్థలు. ఈ తరహా భాషావినియోగాన్నే భాషారాజకీయం అని నిర్వచించాలి.

ఇక నేటి రాజకీయాలలో చాలా పార్టీలు దేశంలోని వివిధ భాషాప్రాంతాలలో ఉన్న పార్టీలు సొంతంగా పత్రికలను పెట్టుకున్నాయి. మనకు తెలుగు రాష్ట్రాలలో ఉన్న పార్టీలకు కూడా పత్రికలు ఉండడం మనం ప్రత్యక్షంగా చూడవచ్చు. కనీసం నాలుగు పత్రికలు ఆయా పార్టీలకు అనుబంధ పత్రికలుగా పనిచేయడం మనం చూడవచ్చు. పత్రికలు ప్రత్యక్షంగా ఒక పార్టీకి ప్రతినిధిగా వ్యవహరించినప్పుడు భాషారాజకీయం అనేది మరింత తీవ్రస్థాయిలో ఉంటుంది. అలా ఉండడాన్ని మనం చూడవచ్చు.

ఇలా ప్రతిపక్షంగా ఉండక పోయినా పార్టీలపైన వాటి నాయకులపైన కూడా పత్రికలు సొంత వ్యాఖ్యానాన్ని చేస్తాయి. రకరకాల సమానార్థక పదాల ప్రయోగాన్ని చేసి, వార్తారచనలో వాక్య రచనలో వైవిధ్యాన్ని వైచిత్రిని సృష్టించడానికి ప్రయత్నించడాన్ని మనం చూడవచ్చు. ఒక పత్రిక తన పార్టీకి ప్రత్యర్థిగా ఉన్న పార్టీపైన దుమ్మెత్తి పోయడానికి వాడే పదజాలం చాలా తీవ్రస్థాయిలో ఉండడాన్ని కూడా మనం గమనించవచ్చు.

ఒక పత్రిక అవతలి పత్రికను ఛానెల్ ని 'పచ్చమీడియా' అని 'పచ్చపత్రిక' అని, వారు చెప్పే వార్తలు అన్నింటిని 'పచ్చవార్తలు' అని రాయడం. 'పచ్చకామెర్ల కళ్లు' అని రాయడం మనం చూస్తున్నాము వింటున్నాము. వారికి ప్రత్యర్థిగా ఉన్న పార్టీ అధికారికంగా వినియోగించే రంగు పసుపు పచ్చ కావడం కారణంగా ఇవతలి పత్రిక ఈ విధమైన పదాలు సృష్టించడానికి వీలు కలిగింది. ఇక ఆయా పార్టీల నాయకులకు కూడా పత్రికలు చాలా సృజనాత్మకంగా పేర్లు పెట్టాయి.

"కమలనాథులు" అని అంటే బిజెపి నాయకులు అని అర్థం. కమలం వారి అధికారిక చిహ్నం కావడాన ఇలాంటి పేరు పెట్టడానికి సాధ్యం అయింది. "గులాబీ సైన్యం" అంటే టిఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు

అని అర్థం, "గులాబీదళపతి" అని అంటే కెసిఆర్ అని పాఠకులకు అర్థం అవుతుంది. "తెలుగు తమ్ముళ్లు" అని అంటే వెంటనే తెలుగు దేశం కార్యకర్తలు అని చదివే వారికి స్ఫురిస్తుంది. "పచ్చదండు" అని అంటే కూడా తెలుగుదేశం కార్యకర్తలు అనే అర్థం. కాని ఈ మాట ప్రతి కూల భావాన్ని వచ్చేలా వినియోగించే వారు వాడతారు. ఇలా రాజకీయ వార్తలు రాయడానికి చెప్పడానికి చాలా విస్తృతమైన రాజకీయ పరిభాషని పత్రికలు ఛానెళ్ళు సృష్టించాయి. దీన్నే భాషారాజకీయం అని చెప్పాలి. అంతే కాదు ప్రతి పార్టీకి కొంత మంది సృజనాత్మక రచయితలు వెనుక ఉన్నారు. నాయకులకు ప్రత్యేకించి స్క్రిప్టురచయితలు ఉన్నారని మనకు తెలుస్తూనే ఉంది. కొద్ది మంది నాయకులే ఆశువుగా అనర్గళంగా మాట్లాడతారు. మరికొంత మంది నాయకులు రాసిన దాన్ని చదువుకొని జీర్ణించుకొని తర్వాత మాట్లాడే వారున్నారు.

అలా కాక కేవలం రాసిన దాన్ని మాత్రమే చదివే నాయకులు మనకున్నారు. ఆయా స్థాయి నాయకులు నేటి ప్రత్యక్షరాజకీయంలో ఎవరెవరు అనే విషయాన్ని ఇక్కడ వివరంగా రాయవలసిన అవసరంలేదు. కొన్ని స్లోగాన్ లని మొదట స్క్రిప్టు రైటర్స్ రాసిన తర్వాత దాన్ని నాయకులు చెప్పిన తర్వాత పత్రికలు రాయడం జరుగుతుంది. ఒక్కోసారి పత్రికలో పదాలను సృష్టించిన తర్వాత నాయకులు వాటికి ప్రచారం తేవడం కూడా మనం చూడవచ్చు. కాని అటునుండి ఇటు, ఇటునుండి అటు పదాలు భాషారాజకీయం ప్రవహించడాన్ని మనం స్పష్టంగా చూడవచ్చు.

"మిషన్ భగీరథ" అని, "మిషన్ కాకతీయ" అని ప్రభుత్వం పేర్లు పెట్టగానే దానికి ప్రతిపక్షాలు "కమిషన్ భగీరథ" అని "కమిషన్ కాకతీయ" అని పేర్లు పెట్టి తమ వ్యతిరేకతని చెప్పడంలో భాషారాజకీయం స్పష్టంగా కనిపిస్తుంది. దీనిలో ఉన్న సృజనాత్మక దృష్టిని కూడా భాషావేత్తలు గమనించవచ్చు. "మైఁ చౌకీదార్ (కాపలాదారు) హూఁ" అని ప్రధాని అంటే, ప్రతిపక్షనాయకుడు "చౌకీదార్ నహీఁ భాగీదార్ హైఁ (కాపలాదారు కాదు జరిగిన అక్రమంలో భాగస్థుడు)" అనే వాక్యాలలో భాషకు సంబంధించిన విన్యాసం బాగా కనిపిస్తుంది. రాహుల్ గాంధీని మోదీ "కాంగ్రెస్ కా షెహ్‌జాదా (కాంగ్రెస్ యువరాజు)" అని పిలవడం వెనుక ఉన్నది కాంగ్రెస్ వంశపారంపర్య అధికారంలో ఉంటుందే కాని ప్రజాస్వామ్య వాతావరణం దానికి ఉండదు అని చెప్పడానికి ప్రత్యేకించి చేసిన భాషావినియోగం అది. PayTM ని అలాంటి ఇతర ఆన్‌లైన్ బ్యాకింగ్ వాలెట్ లను మోది సమర్థిస్తున్నాడు అని చెప్పడానికి రాహుల్ "పేటిఎమ్ అంటే పే టు మోదీ" అని వ్యాఖ్యానం చెప్పడం, జీ ఎస్ టి అంటే "గబ్బర్ సింగ్ టాక్స్" అని వ్యాఖ్యానం చెప్పడం భాషారాజకీయ వినియోగానికి మంచి ఉదాహరణలు. కొన్ని సార్లు నాయకులే ఇలాంటి భాషని సృజనాత్మకంగా సృష్టిస్తారు. తర్వాత పత్రికలు వాటిని అనుసరిస్తాయి. కొందరు నాయకులు ఇలాంటి భాషణలలో ఆరితేరినవారు వేరు వేరు పార్టీలలో ఉన్నారు. ప్రస్తుతం ఉపరాష్ట్రపతిగా ఉన్న నాటి బిజెపి నాయకుడు వెంకయ్యనాయుడు ఆశువుగా మంచి సృజనాత్మకభాషలో ప్రసంగించ డంలో ఆరితేరినవారు. మోదీ కూడా ఈ విషయంలో మంచి సృజ నాత్మక కళాకారుడు. రాజకీయనాయకుడికి భాషే మంచి పదునైన ఆయుధం.

నిత్యం వస్తూ నిత్యనూతనంగా వచ్చే మాధ్యమాల భాషలో భాషారాజకీయం గురించి చెప్పడానికి చాలా విస్తృత స్థాయిలో మంచి ఉదాహరణలను చెప్పడానికి వీలుంది. ఇలాంటి భాషారాజకీయం మీద ప్రత్యేకంగా పరిశోధన చేయడానికి వీలుంటుంది.

కవిత

## పండగ్గెద్ద..

మూలిగేనక్కమీద తాటికాయపడ్డట్టు...
బక్కచిక్కిన గొడ్డుపై
కొండబారవులు తిరిగినట్టూ..
పూటగడవడమే గగనమైన బతుకులపై
అప్పుడప్పుడూ
టపీమని రాళ్ళలా పండగలు పడుతుంటాయి..!

కుశాలగా
నూకలు తింటున్న కోడిపిల్లలపై
గెద్దల సడికి తల్లికోడిపెట్ట గాబరాపడ్డట్టు..
వచ్చే పోయే పండగదినాల అలికిడివింటేనే..
పెద్దోళ్ళు మొద్దుబారిపోతుంటారు...!

పిలకాయల ముదిగారం తీర్చలేక
అప్పులమడుగులో కూరుకుపోతూ..
సద్దో గిద్దో తాగి పొద్దెల్లదోస్తున్న
కడుగొట్టుతనాల అమ్మలయ్యలు అవిసిపోతారు..

కలిగినోళ్ళ పండగైతే..
ముక్కలకాడికి తిని
పీకలకాడికి తాగి సిగమెక్కి ఊగుతుంటాది..
పట్టుగుడ్డల్లోనో
నిప్పట్ల కడవల్లోనో
పండగ కులుకుతుంటాది..

కాలేకడుపుకి మండేబూడిద సాలని
కాలమెల్ల దోస్తున్నోళ్ళకు..
యే పండగైనా యాపకాయ చేదేగదా..!

ఏ దినం...
వొక ఎండుతునకనో మిరపకాయనో
పోయిలోయేసి కాల్చుకోని..
వూరిబిండితో తిన్నా..
ఉప్పేసుకుని గెంజితాగిన...
ఆ పూట మా నట్టింట పండగ
పకపకా నవుతున్నట్టే...
ఏ పండగలు మాకు పున్నేలుతేవు...
కన్నీళ్లనే మా వాకిట్లో చల్లి
కష్టాలనే ముగ్గేసిపోతాయి...

పండగంటే..
బలిసినోళ్ళ బోగాల కులుకుతనం కాదప్పా...
ఎండినడొక్కల కంచంలో
పిడికెడు మెతుకుల బువ్వదీపాన్ని వెలిగించడం..
చిరుగుబడ్డా కాలంపై మనిషితనాన్ని కప్పుకోవడం..!

– పల్లిపట్టు నాగరాజు
9989400881.



Unfiled Notes Page 12

వీవెన్
9963029061

# తెలుగు భాషకు ఆధునిక హోదా-11

## చాపకిందకి నీరు వచ్చేస్తున్నది!



నేడు తెలుగు రాష్ట్రాల్లో ఏ మూలకి వెళ్ళి ఎవరిని ఫోను నెంబరు అడిగినా 'నైన్ ఎయిట్" అంటూ ఇంగ్లీషు అంకెలతోనే చెప్తారు. ఇంతా చేసి చేతిఫోన్లు విరివిగా అందుబాటు లోకి వచ్చి, పట్టుమని పదేళ్ళు కూడా కాలేదు. ఇంత విప్లవాత్మకమైన మార్పు ఇంత తక్కువకాలంలో ఎలా జరిగిపోయింది. చాప కింద నీరులా జరిగిన ఈ పరిణామం నుండి మనం - మరీ ముఖ్యంగా తెలుగు భాషాభిమానులు, భాషోద్యమకారులు - నేర్చుకోవాల్సింది ఏమైనా ఉందా?

పిల్లల ఇంగ్లీషు మీడియం చదువులైతే గానీ, టీవీ ప్రోగ్రాముల వల్లనైతే గానీ, మరే ఇతర కారణాల చేతగానీ రోజువారీ మనం వాడే చాలా మాటలను ఇంగ్లీషు మాటలనే వాడేస్తున్నాం. ఈ పోకడ నగరాలను దాటి పట్టణాల్లోకి, పల్లెలలోకి వచ్చేస్తున్నది. మరింత కలవరపరిచే విషయం ఏమంటే - తెలుగు మీడియంలో చదువుకున్న వారి మాటల్లో (అసలు చదువుకోని వారి మాటల్లో కూడా) ఇంగ్లీషు మాటలు అలవోకగా దొర్లిపోతున్నాయి. ఇంతకుమునుపు "తెలుగుకి ఇప్పుడొచ్చిన ప్రమాదం ఏమీలేదు. పల్లెలకు వెళ్ళిచూడండి, వాళ్ళు హాయిగా తెలుగులో మాట్లాడుకుంటున్నారు" అనేవారు. కానీ ఆ పరిస్థితి కూడా వేగంగా కనుమరుగవుతున్నది.

మనం వాడే వస్తూత్పత్తులపై పేర్లూ సమాచారం తెలుగులో ఉండటం లేదు. తెలుగు సినిమాల్లో పేర్లు కూడా (దర్శక నిర్మాతల పేర్లు తప్ప) అన్నీ ఇంగ్లీషు అక్షరాల్లోనే వేస్తున్నారు. కొన్ని సినిమాల పేర్లు కూడా తెలుగు అక్షరాలలో ఉంటడం లేదు.

ఒక కప్పని వేడి నీటిలో జారవిడిస్తే అది చప్పున బయటికి దూకివేసి పారిపోతుంది. కానీ దాన్ని చల్లని నీటిలో ఉంచి ఆ నీటిని మరిగిస్తూ ఉంటే, నీటి వెచ్చదనంతో పాటు ఆ కప్ప తన శరీర ఉష్ణోగ్రతను క్రమేపీ పెంచుకుంటూ ఆ నీటిలో అలాగే ఉండిపోయి మరణిస్తుందని సామాన్య శాస్త్ర తరగతిలో వివరించే ఓ సంగతి.

బయటి ప్రపంచానికి, అవతలి వారికి తగ్గట్టు తెలుగువారు సర్దుకుపోతూ అసలు తామున్న పరిస్థితిని అంచనా వేయలేక తమ భాషను, అస్తిత్వాన్నీ కోల్పోయే దుస్థితి వస్తుందేమో అనిపిస్తుంది. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని చూడలేకపోతే, చూసి మేలుకోకపోతే- మూడు చేపల కథలో మందమతి చేపకి పట్టిన గతే మనకూ పడుతుంది.

ఇంగ్లీషు మీడియం చదువులు, ఉద్యోగావకాశాలు, బహుళ జాతి కంపెనీలు, ప్రపంచీకరణ, సాంకేతిక సమస్యలు, బయటి రాష్ట్రాల / దేశాల వారితో సంబంధాలు, వ్యవహారాలు- ఇలా సవాలక్ష కారణాలు సర్దిచెప్పుకుని, సర్దుకొని పోతూ మన భాషని, సంస్కృతిని మనమే అటకెక్కించేస్తున్నామా?

తమ తమ తాపత్రయాల్లో పడి ప్రజలు, ఏదో తూతూ మంత్రంగా సదస్సులు సన్మానాలు కానిచ్చేస్తూ, భాషకు ఏదో చేసేస్తున్నాం అని భ్రమించే ప్రభుత్వాలు, సంచలనాల వెంపర్లాటలో పడి బాధ్యత మరిచిన మీడియా-ఈ ఆమావాస్య చీకటిలో చుక్కల్లా అక్కడక్కడా మిణుకు మిణుకుమంటున్న చిన్నచిన్న ప్రయత్నాలు భవిష్యత్తుపై ఆశను చిగురింప జేస్తున్నాయి.

తెలుగు వారి జనాభాలో సింహభాగం తెలుగు చదవడం రాయడం తెలిసినవారు ఉండే తరాలలో ఇప్పటి యువతరమే చివరి వారు కావచ్చు. తెలుగు భాషకు పునర్వైభవం తీసుకురావడానికి ఇదే చిట్టచివరి అవకాశం కూడా కావచ్చు.

నాకు కనిపిస్తున్నది. అనిపిస్తున్నది అదే! నేను చూడనిది ఏమిటి, మీరు చూస్తున్నదేమిటి? ఏమి చేద్దాం?

మనం, సామాన్యులం, ఏమి చేయగలం అనుకుంటే తెలుగు గాలిలో పెట్టిన దీపం అయిపోతుంది.

రాజుగారి వేడుకకి ఊరందరినీ పాలు పొయ్యమంటే, "ఆఁ నేనొక్కడినీ నీళ్ళు పోస్తే ఏమవుతుందిలే" అనుకొని ప్రతీ ఒక్కరూ నీళ్ళే పోస్తే- ఇక పాలు జమ అయ్యేది ఎలా!

ఒక లాభాపేక్షలేని చిన్న స్వచ్ఛంద సంస్థ కేవలం 17 ఏళ్ళలో లోకంలోని విజ్ఞానాన్నంతటినీ అందరికీ ఉచితంగా, స్వేచ్ఛగా అందుబాటులో ఉండేలా వికీపీడియా రూపంలో అందించగలిగింది. వికీపీడియా దాదాపు 300 భాషలలో ఉంటే, అందులో 100 భాషలు 30 వేల కంటే ఎక్కువ వ్యాసాలను కలిగివున్నాయి. ఇదంతా, సామాన్యులైన మనలాంటి వ్యక్తుల చొరవ, ప్రయత్నం వల్లనే సాధ్యమయింది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులూ, భాషోద్యమ కారులూ పూనుకొని ఏదైనా చేసి చూపించాలి!

**భాష లేకపోతే భావం లేదు ; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది**

ముఖచిత్రకథనం



సన్నిధానం నరసింహశర్మ
92920 55531

# పాలకుల బాధ్యతలు తెలుపుతూ ఉద్యమ చైతన్యంతో జరిగిన తెలంగాణ రచయితల వేదిక (తెరవే) రాష్ట్ర మహాసభలు

తెలుగు రాష్ట్రాలలో సాహిత్యాన్ని, కవిత్వాన్ని పట్టించుకున్న రచయితల వేదికలూ సంఘాలే ఎక్కువ.

గ్రంథాలయోద్యమకాలంలో గ్రంథాలయ సభలు చేసిన సంఘాలు స్వాతంత్ర్య సమరానికీ, ఆంధ్ర రాష్ట్ర సాధనకీ తీర్మానాలు చేసి, సూచనలు చేసి దోహదం చేశాయి. ఎన్నో సాహిత్య సంస్థలు తెలుగు సాహిత్యానికీ, కవిత్వానికీ సేవలు చేశాయి; కొన్ని పత్రికలను సైతం నడిపాయి. కవితా సమితి, నవ్య సాహిత్య పరిషత్తు ప్రజా వాఙ్మయ పక్షంగా కృషి చేశాయి.

అరసం, విరసం సంస్థలు సమాజంలో సాహిత్యాంశాల్నేగాక; వాటివాటి చర్చల ద్వారా తీర్మానాల ద్వారా కార్యకలాపాల ద్వారా తాము నమ్మిన భావజాలాలకు అహర్నిశం కృషి చేశాయి. దశాబ్దాల తెలుగు సాహిత్య చరిత్రలో వాటి పాత్ర అవిస్మరణీయం. అంతకుముందు ఆంధ్ర సాహిత్య పరిషత్తు వంటివి కొన్ని పండిత పక్షంగా ఎన్నో గొప్ప పనులు నిర్వహించాయి.

తెలంగాణా రచయితల సంఘం వట్టికోట ఆళ్వారుస్వామి వంటి దిగ్గజాలతో చైతన్య పూరిత సేవల్ని చేసింది.

ప్రత్యేక తెలంగాణాకు రచయితల సంస్థలూ కవులు చేసిన వైతాళిక కృషి చరిత్రకెక్క వలసి వుంది.

హైదరాబాదులోని తెలంగాణా రచయితల వేదిక (తెరవే) తెలంగాణా రాష్ట్రావిర్భావం తరువాత తన వంతు పాత్ర నిర్వర్తిస్తూనే వుంది. తెరవే అనేక పుస్తక ఆవిష్కరణలు చేసింది. రైతుల సమస్యలపై భరోసాగా నిలబడింది. ప్రపంచ తెలుగును మరో సభల సందర్భంగా బాధ్యతాయుతంగా తను నమ్మిన భావాలు ప్రకటించింది. అవసరమని భావించినప్పుడు, కరపత్రాలూ, లఘుపుస్తకాలూ ప్రకటించి జనాన్ని చైతన్య పరచింది. రచయితల్ని కూడగట్టింది. కలాల్ని వినిపింప జేసింది.

ఆంధ్రదేశంలో సాహిత్య సంఘాల గురించి మహాకవి శ్రీశ్రీ కిన్నెర పత్రికలో సంపుటం 1, సంచిక 6 ఆగస్టు 1949 లో ఓ స్మరణీయ వ్యాసం రాశారు. అందులో "సాహిత్య సమాలోచనలో రాజకీయ పరిభాష వాడుతున్నందుకు నేను క్షమాపణ చెప్పుకోదలచుకోలేదు. 'మేము సాహిత్య వేత్తలం. మాకూ రాజకీయాలకీ సంబంధం లేదు' అనే వాళ్ళ సంకుచిత దృష్టికి నేను జాలి పడడం మానలేను. సాహిత్యానికీ, రాజకీయాలకీ అవినాభావ సంబంధం వుంది. ఈ సంగతి ఎంత పెందరాళే గుర్తిస్తే అంతమంచిది. రాజకీయ సమస్యలంటే జీవిత సమస్యలు. సాహిత్య సమస్యలు కూడా అంతే" అన్నారు.

ఈ అంశం తనకు తానుగా గుర్తించిన తెలంగాణా రచయితల వేదిక అనేక సభలూ సమావేశాలూ చేసింది.

ఆ కొనసాగింపులో ఒక ముఖ్య సంఘటనగా 2018 నవంబరు 18వ తేదీన హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రభవనంలో రాష్ట్ర మహాసభల్ని కాలీన అవసర సమస్యల చర్చా వేదికగా వివిధ ఆలోచనా పక్షీయులను కలుపుకుంటూ ప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించారు. తెలంగాణాలోని అనేక ప్రాంతాల రచయితలతో, నగరంలో నున్న ప్రముఖ కవి, సాహితీ వేత్తలు అభిమానులు పాల్గొన్న సందడితో సభాస్థలి నిండిపోయింది.

సాహిత్య, సాంస్కృతిక రంగం – వర్తమానం– సవాళ్ళు అంశంపై ప్రథమ సమావేశం జరిగింది. తెరవే ప్రధాన కార్యదర్శి శ్రీ గాజోజు నాగభూషణం తమ సంస్థ కార్యకలాపాల నివేదికతో క్రొత్తవారికి కూడా సంస్థ ఎటువంటిదో తెలిపారు.

ఆచార్య మనోజ వక్తల శక్తుల పరిచయం చేశారు.

తెరవే అధ్యక్షులు, సభాధ్యక్షులు ఆచార్య జయధీర్ తిరుమలరావు 2001 నుండి తెరవే – కార్యకలాపాలను తెలిపారు. శ్రీరావు తమ ప్రసంగంలో రచయితలు ప్రజా సమస్యల్ని తెలుసుకుని స్పందించాలి. సాహిత్యంలో గత వైభవ పునరుద్ధరణ అపాయకరం. రాజరిక భూస్వామ్య పరిస్థితులకు చెందిన పద్య ప్రక్రియలో కాకుండా పాటకు ప్రాధాన్యమిచ్చి రాయాలి. ప్రజల మాటకు, ఆటకు ప్రాధాన్యమివ్వాలి. తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాట, కళలు వహించిన పాత్ర మరవకూడదు. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం వస్తే రాష్ట్ర గీతంగా ప్రకటిస్తామన్న వారు అందెశ్రీ గీతాన్ని ఎందుకు ప్రకటించలేదు? అని ప్రశ్నించారు.

ప్రజల బతుకులు బాగుపడనప్పుడు ఏ పథకం చూసి ఓట్లు వెయ్యాలో అర్థం కావడం లేదు. ఆర్థిక పరమైన అప్పులు మన నెత్తులపై కత్తుల్లా వేలాడుతుంటే రచయితలు ఏం చేయాలి, ఏమి ఇతి వృత్తాల్ని చేసుకుని రచనలు చేయాలో రచయితలు ఆలోచించుకోవాలి. ప్రయివేటు రంగ ప్రేమ ఎక్కువవుతోంది. మనిషి మనస్సును తాకే అభివృద్ధి ఏముంటోంది? పాల్కురికి సోమన నాటి నుండి కాళోజీ వరకూ ప్రతి ఘటన సాహిత్యం సమాంతర సంస్కృతి ప్రభావంతో వచ్చిన వైనాన్ని గమనించి, వర్తమాన కాలంలో మనం ఏమి చేయాలి అని రచయితలు ఆలోచించుకొని రచనలు చేయాలి అంటూ రచయితలు మౌనాన్ని ఛేదించుకుని సమాజ కాలావసర రచనలు చేయాలని పిలుపునిచ్చారు.



Unfiled Notes Page 14



ప్రారంభోపన్యాసం చేస్తూ సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి పి.శివ కామిని-సాహిత్యం అనేది ఒక దీర్ఘ కాలిక రచనా విధానమని, ప్రజా సమస్యల విషయంలో, నిర్లక్ష్యం చేయబడిన ప్రజల అభివృద్ధి విషయంలో రచయితలు చైతన్య పూరితులు కావాలి సమాజంలో వస్తున్న సాంస్కృతిక మార్పుల్ని రచయితలు గ్రహించాలి. ఎన్నికల సందర్భంలో రచయితల నుండి ప్రజలు ఎటువంటి రచనల్ని ఆశిస్తారనేది గమనించాలి. తెలంగాణలో ఎంతోమంది గొప్ప రచయితలున్నారు. భూమి, సంపదలు వంటి సమస్యల్లో ప్రజాపక్షం వహించాలి. వీటిలో ఇంకా ఆంధ్రుల ఆధిపత్యం వుండడాన్ని గమనించాలి. ప్రజల్ని కలిపే సంస్కృతిని రక్షించుకోవాలి. విశ్వజనీనంగా ఆలోచించండి. ప్రాంతీయంగా కార్యకలాపాలు నిర్వహించుకోండి అన్నారు. సమాజాన్ని అభివృద్ధి చేసేది అభివృద్ధి మాత్రమే కానీ ఎన్నికలు కాదని గ్రహించాలి అన్నారు.

సుప్రసిద్ధ రచయిత, సంపాదకుడు శ్రీ హెచ్ ఎస్ శివ ప్రకాశ్ తమ కీలకోపన్యాసంలో భారతదేశంలోని అట్టడుగు బహుళజన సంస్కృతిని పరిశోధించాలి. కన్నడ, తెలుగు, మరాఠీ భాషా సాహిత్య సంస్కృతులు తెలంగాణా వారికి చిర పరిచితాలేనని, సంస్కృత సంబంధం అంతగా లేకుండానే దక్షిణాదిన భక్తి సాహిత్యాలు పరిఢవిల్లిన తీరులు అధ్యయనం చేయాలని దానిలోని ప్రత్యేకతను రచయితలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

కన్నడంలో భక్తి సాహిత్యం ప్రాంతాతీతమని అది మానవులందర్నే కాదు, పశుపక్ష్యాదుల్ని కూడా పట్టించుకుని సంకుచిత దృష్టి రహితంగా వికసించిందన్నారు. రచయితలు సంకుచిత తత్త్వాలకు దూరంగా ఉండాలన్నారు.

ప్రజాస్వామిక విలువలతో ప్రయోగం, ప్రయోజనం వంటి అంశాల్ని గమనించి రచయితలు రచనలు చేయాలన్నారు.

ముఖ్య అతిథి బి. సుదర్శన రెడ్డి (పూర్వ సుప్రీంకోర్టు న్యాయవాది) ఉపన్యాసం - సభోపన్యాస దీపాల్లో ఒక అఖండ కార్తీక అక్షయ దీపంగా ఆలోచనల వెలుగులిచ్చింది. ఆయన రచయితల కర్తవ్యాలు చెప్పినా అవి పౌర కర్తవ్యాలుగా ఆలోచనార్హాలుగా అనిపించాయి.

70 ఏండ్లుగా నిర్మించుకున్న సంవిధానం-భారత రాజ్యాంగం అపహాస్యం పాలౌతున్న. వక్రబుద్ధితో ఆలోచించే రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో అన్ని వ్యవస్థలూ నలిగిపోతున్నాయి. సత్యం మాట్లాడిన హరిశ్చంద్రుడిలా కష్టాలు కొని తెచ్చుకోవద్దంటున్నారు. జ్ఞానంతో ఏదైనా చెబితే సోక్రటీసు వారసుల్ని చేసే గడ్డు రోజులివి.

పాల్కురికి సోమన, వట్టికోట, కాళోజీ, దాశరథి ద్వయం - వీరందరి వారసులైన రచయితలారా మీరు ఎలా ఉండాలో గ్రహించండి. అన్యాయాన్ని ఎదిరించినవాడే ఆరాధ్యుడు అన్న కాళన్న స్ఫూర్తి మనకు అవసరం లేదా?

సోక్రటీసు తల్లి మంత్రసాని, ఆయన తండ్రి వడ్రంగి, జ్ఞాన ప్రసవ సహాయకుడు సోక్రటీసునే, నీవు యువకులకు బోధించడం, రాజ్యాన్ని ప్రశ్నించడం మానవా? అని ప్రశ్నించారు. ఆయన ప్రశ్నించడం మానుకోలేదు. తనను విమర్శించిన వారితో "నా వారసులెవ్వరైనా శ్రేష్ఠత సంపదలలో దేన్ని ఇష్టపడతారని అడగండి. ఒక వేళ సంపదనే ఇష్టపడతామని వారు మీకు చెబితే నన్ను దూషించండి. మీ దూషణలే నాకు నివాళిగా భావిస్తానన్నాడు.

రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి మౌలిక సుగుణాల్ని భంగ పరచుకో కూడదు. రచయితలు ఇందుకు కృషి చేయాలి. పెద్దపెద్ద విప్లవాల వారు కూడా దీనిని గురించి మాట్లాడడం లేదు. కారణం ఇప్పుడు మాట్లాడ కూడదు; ప్రశ్నించ కూడదు. పాలక వర్గాల మార్పులు వచ్చినా ఏమీ జరగటం లేదు. కవి జూకంటి జగన్నాథం అందుకే 'పటం మారింది కాని / పాలకుల మఠం మారలేద'ని రాశారు. 'భగవంతుడు చనిపోలేదు / చంపబడ్డాడు' అన్నాడోకవి. **ప్రజాస్వామ్యంలోనే ప్రశ్నించ కూడదంటే ఎలా? రచయిత ప్రజలకు స్ఫూర్తినివ్వకపోతే, ప్రశ్నించకపోతే అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? స్వేచ్ఛ లేకపోతే సమసమాజం ఎలా అవుతుంది? రచయితలారా, ప్రశ్నించే ధైర్యం కలిగించండి. మీ ధిక్కార స్వరాలు ఏమయ్యాయి? అమర వీరుల త్యాగాలపై నడుస్తున్నాం. అయినా ఆత్మ గౌరవాన్ని మళ్ళీ తాకట్టు పెట్టేలా తయారవుతున్నవారు కొందరు. ఇవన్నీ తెరవే వారు చర్చించవలసిన సందర్భం వచ్చింది. మీ పాటల రాగాలేమిటో చెప్పండి.** రచయితలారా! ఉనికిని పోగొట్టుకునే 'రాజ దర్బారీ' రాగా లాపనలు వద్దు. ఎవరు ఏ పాము చేత కరవబడతారో తెలుసుకోండి. మన ఆట ఆడుకుందాం, మన పాట పాడుకుందాం. ప్రశ్నల ద్వారా ఆట పాటల ద్వారా వ్యక్తమవుదాం రండి.

ప్రసిద్ధ కవి శ్రీ జూకంటి జగన్నాథం- వర్తమానకాలంలో కావలసింది ఆత్మగౌరవం కాదు, ఆత్మవిశ్వాసం అనడంలో తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధి అనేది చెప్పక చెప్పినట్లైంది. సకల జనుల వేదిక ప్రధాన కార్యదర్శి ఆచార్య వినాయక రెడ్డి కొన్ని లోతట్టు అంశాల్ని తెలుపుతూ గణాంక సాక్ష్యాలిస్తూ - **వలస పాలనలో తెలంగాణలో విద్య నిర్లక్ష్యానికి మాత్రమే గురికాగా 'స్వపరిపాలనలో విధ్వంసానికే గురి అయిందన్నారు. దేశీయ విద్యకు తక్కువ బడ్జెట్టు కేటాయించిన రాష్ట్రం తెలంగాణా మాత్రమే. 4,500 పాఠశాలలు మూతబడ్డాయి. విద్యను ప్రయివేటు రంగానికి అప్పగించడం వల్ల సామాజిక మార్పును కోరే విద్య నిరోధింప బడడం జరుగుతోందని, విద్యారంగ ఉద్యోగాల్లో 1,600 ఖాళీలు ఉన్నా భర్తీ చేయలేకపోవడం బాధాకరమన్నారు.**



మధ్యాహ్నం రెండో సమావేశం - **ఎన్నికలు ప్రజల కర్తవ్యాలు** రచయితలు అంశంపై జరిగింది.

శ్రీ అన్నవరం దేవేందర్ అధ్యక్షత వహిస్తూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఓ కీలక సందర్భంలో మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ సభల సందేశంతో తెలంగాణా బుద్ధి జీవుల్లో పెను కదలిక తప్పకుండా వస్తుందని ఆకాంక్షించారు. మాట్లాడేవారు తప్పకుండా మాట్లాడడం సమాజావసరం అన్నారు.

శ్రీ అల్లం రాజయ్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ భావోద్వేగంలో ఉన్నంత తీవ్రతను మనం నిర్మాణంలో చూపకపోవడం మన బలహీనత. అన్ని ఉద్యమాల్లో దళితులు, బహుజనులు క్రమంగా నాయకత్వంలోకి వస్తున్న తరుణంలో అణచివేత పెరిగిపోతోంది. అన్ని రాజకీయ పక్షాలూ సొంత ఆస్తిని కాపాడుకునేందుకే పాటు పడతాయి. ప్రజల బాగోగులు వారికి పట్టనే పట్టవు. రచయితలుగా ప్రజలను ఐక్య పరచాలి. అవరోధ వైవిధ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. ఆత్మీయ అతిధి ప్రముఖ కవయిత్రి ఆచార్య ఎం. ఎం. వినోదిని మాట్లాడుతూ రాజకీయాలు తమ పరిధిలోనికి రానివంటూ రచయితలు తప్పించుకోకుండా వాటిని మార్చడానికి ఆచార్య సూరేపల్లి, మార్గరేట్, వాసుల వలే ప్రయత్నించాలన్నారు.

ప్రజలంటే ఎవరు? ఎస్.సి, ఎస్.టి, బి.సి. మైనారిటీలే ప్రజలు, పాలక వర్గాలు ప్రజలు కారు. నేడు కుల పాలకులున్నారు. మేనిఫెస్టోల విడుదల ఓ ప్రహసనంగా తయారయింది. ప్రజలు చైతన్యవంతులై ఎన్నికల సమయంలో మేనిఫెష్టోపై అధికార పక్షాన్ని నిలదీయాలి. ఇక్కడున్న రచయితలంతా అదిగో చందమామ అన్నవాళ్ళు కాదు. పీడితుల కష్టాలపట్ల స్పందించేవాళ్లం. ప్రభుత్వ పురస్కారాలు తీసుకోడం తప్పు కాదు. ప్రజల సొమ్ముతో వారు చేస్తున్నది కనుక తీసుకోవచ్చు. కాకపోతే రచయితలు నీటిలోని చేపల్లా వున్నారా, గాలానికి చిక్కిన చేపల్లా మారారా పరిశీలించాలి.

మూడవ సమావేశం **మేనిఫెస్టోలు - భాషా సాహిత్య సాంస్కృతిక రంగాలు - వివిధ పార్టీల** అంశంపై జరిగింది.

శ్రీ జయధీర్ తిరుమలరావు సమన్వయ కర్తగా వ్యవహరించారు.

**ముఖ్య అతిథిగా సాక్షి సంపాదకులు డా.కె. రామచంద్రమూర్తి ప్రసంగిస్తూ** తెలంగాణా రాష్ట్ర సాధన కోసం మనలో ఎలుగెత్తిన ఉద్యమ స్ఫూర్తిని నిరంతరం మనతోనే పదిల పరచుకోవాలి. దీనికై రచనలు చేయాలి. సమిష్టి చైతన్యమే సమాజానికి రక్షణ. **ఏ భాషా సంస్కృతుల అస్తిత్వం ప్రాతిపదిక రాష్ట్రాన్ని సాధించుకున్నామో వాని అభివృద్ధికి పార్టీలు ఏం చేయనున్నాయని రచయితలు అడగాలి. మేనిఫెస్టోలో వాటిని చేర్చాలని అడగాలి.** కుల, ధన, కండ బలాలకు అతీతంగా అభ్యర్థుల్ని ఎన్నుకోవాలని ప్రజలు భావించేలా రచయితలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. వరవరరావు అరెస్టు పై ఏ రాజకీయ పార్టీ స్పందించక పోవడం దారుణం. మంత్రివర్గంలో మహిళలకు చోటు లేనప్పుడు ఒక ఉద్యమ నిర్మాణమే జరిగివుంటే బాగుండేది అన్నారు.

మరో ముఖ్య అతిథి ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీ కె. శ్రీనివాస్ వక్తలందరిలో భాషా విషయాన్ని ఎక్కువగా పట్టించుకోవడం అభినందనీయం. శ్రీ శ్రీనివాస్ 'ఓటర్లను ఆకర్షించేందుకు పార్టీల మేనిఫెస్టోల రూప కల్పనల్లో భాషా సాహిత్యాల గురించి పట్టించుకోవడం లేదు. అందుకు రచయితల ఒత్తిడి అవసరం. తెలంగాణా ఉద్యమంలో పాటతో సహా సృజనాత్మక ప్రక్రియలన్నీ ప్రముఖ పాత్ర పోషించాయి. **ఇవ్వాళ తెలంగాణ భాషాభివృద్ధి పరిస్థితి అర్థం కాకుండా తయారయింది. రచయితలుగా మనలో స్పష్టత రాకుండా వుంటే ప్రభుత్వాలకూ పార్టీలకూ ఏమి అర్థమవుతాయి? దీర్ఘ కాలిక కృషి భాషపై జరగాలి-అన్నారు.**

మానవ హక్కుల సంఘం అధ్యక్షులు, గౌరవ అతిథి శ్రీ ఎస్. జీవన్ కుమార్ 'రాజకీయ పార్టీల మేనిఫెస్టోల్లో పౌర హక్కుల పరిరక్షణకు చోటు దక్కక పోవడం శోచనీయం. హింసలు, ఎన్‌కౌంటర్లు లేని పాలన అందిస్తామని ప్రజలకు పార్టీలు ఎందుకు హామీ ఇవ్వడం లేదు అని ఆవేదనతో ప్రశ్నించారు. ఏ పార్టీకీ రమణీయ నాయకునికి సమాజం పట్ల పట్టింపు, బాధ్యత లేదు. మోసకారులై, కొండల్ని పిండి సహజ వనరుల్ని ధ్వంసం చేసే నాయకులు కుబేరులౌతుంటే ప్రజలు కుదేలవుతున్నారు అన్నారు.

జస్టిస్ చంద్రకుమార్ 'కార్పొరేట్ శక్తులు, సంపన్న వర్గాలే భోగాల్ని అనుభవిస్తున్నారు. స్వాతంత్ర్య ఫలాలు సామాన్యుల కందడం లేదు. సంపన్నులకు వేలకోట్ల రుణాలిస్తూ, శ్రమ జీవుల రక్తాన్ని పీలుస్తున్నారు. ఈ దశలో రచయితలు కీలక పాత్ర వహించాలి. మార్పులకు నాంది పలకాలని ప్రబోధించారు. సి.పి.ఐ (ఎం) ప్రతినిధిగా శ్రీ జి. నాగయ్య మాట్లాడుతూ ప్రజలకు విజ్ఞానాన్ని అందించే ప్రజా సాహిత్యాన్ని అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని మా మేనిఫెస్టోలో ప్రకటించనున్నామన్నారు. శాస్త్రీయ విద్యా విధానానికి చర్యలు చేబడతామని, మంత్రులు, బంట్రోతుల పిల్లలు కలసి చదువుకునే విద్యా విధానం రావాలన్నారు.

### తెరవే రాష్ట్ర మహాసభల తీర్మానాలు...

1. ఆ మధ్య సాయిబాబా, ఈ మధ్య వరవరరావు వంటి మేధావులను దేశ వ్యాప్తంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నాం. అనేక మంది ఆదివాసీలను జైలులో పెట్టడాన్ని ఖండిస్తున్నాం.

2. తెలంగాణాలో భావ ప్రకటన స్వేచ్ఛ తగ్గిపోయింది. రాబోయే ప్రభుత్వం దీనిని పునరుద్ధరించాలి.

3. రచయితలకు చేసే ఆర్థిక సహాయం ఇరవై వేలకు పెంచాలి. ప్రతి జిల్లాలోనూ సాహిత్య వేత్తలవి వంద పుస్తకాలు చొప్పున కొనాలి.

4. తెలంగాణా భాషా సాహిత్య రంగాలకు, సంస్కృతికి పెద్ద పీట వేయాలి. అన్ని రంగాలలోను పాలక వర్గాల ఆధిపత్యాన్ని తగ్గించాలి.

5. తెలంగాణా భాషా నిఘంటువు తయారు చేయాలి. అంతేకాక తెలంగాణ భాషా పదాలు, నుడికారాలు సేకరించి ప్రచురించాలి.

6. జానపద కళల్ని ప్రజాసాహిత్యాన్ని పరిరక్షించాలి, భద్రపరచాలి. జాతీయ స్థాయిలో వాటికి గుర్తింపు తేవాలి.

7. తెలంగాణాలో ప్రభుత్వం నిర్వహించిన తెలుగు మహాసభల సందర్భంగా ప్రకటించవలసిన తీర్మానాలను అప్పుడు ప్రకటించలేదు. శోచనీయం. ఇప్పటికైనా వాటిని ప్రకటించాలి.

టి.టి.డి.పి. ప్రతినిధిగా శ్రీ ఎల్. రమణ మాట్లాడుతూ నిద్రావస్థలోని ప్రజల్ని మేల్కొలిపేది రచయితలు మాత్రమేనని, సాహిత్యం సహా అన్ని రంగాల ప్రజలకూ మేలు చేసే విధంగా తమ మేనిఫెస్టో రూప కల్పన చేస్తామన్నారు.

మూడో సమావేశం ముగింపు సమావేశం శ్రీ బూర్ల వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించి శ్రీ తిర్మల్ స్వాగతోపన్యాసం చేశారు.

ముఖ్య అతిథిగా ప్రఖ్యాత కవి శ్రీ నిఖిలేశ్వర్ మాట్లాడుతూ నాయకులు ఇచ్చే తాయిలాలకు రచయితలు లొంగ కూడదని తెలంగాణా ఏర్పడ్డాక కవులకూ విభజన రేఖ ఏర్పడిందని, ఆ విభజన తొలగి మేలు చేయాలన్నారు. తెరవే సమాజంలో ప్రజలకు రచయితలకు ఎంతో సేవ చేస్తోందన్నారు. రాష్ట్రం ఏర్పడగానే అక్షరాలు అమ్ముడు పోయాయి అన్నారు.

సుప్రసిద్ధ గాయకురాలు శ్రీమతి విమలక్క కనుమరుగవుతున్న కళారూపాల్ని రక్షించేదవరో, అన్నారు. తెరవే ఎప్పుడూ ప్రజల పక్షాన్నే ఉండాలని కాంక్షించారు. ఆమె పాటల్లోనే భాషా సాహిత్య కళా రూపాల గురించిన అభిప్రాయాలు స్వర రంజితాలయ్యాయి. పొట్లపల్లి రామారావు శత జయంతి సందర్భంగా ఆర్ద్రమైన పాట పాడారు.

పొట్లపల్లి రామారావు శతజయంతి కన్వీనరు శ్రీ వరప్రసాద్ మాట్లాడుతూ రామారావు ఎన్నో దశాబ్దాలపాటు కవిత్వం వంటి ప్రక్రియల్లో సృజనాత్మక రచనలు చేసిన ఒక సాహిత్య శిఖరమని, వారి సంపుటాల్లోని రచనలు ప్రజా పరమై మరింత ప్రచారంలోకి రావాలని ఆకాంక్షించారు.

తెలంగాణా రచయితల వేదిక లక్ష్యాలతో ఈ మహాసభలు నెరవేరాయి. భాగ్యనగరేతర ప్రాంతాల నుండి దూర ప్రాంతాల నుండి, నగర ప్రాంతం నుండి ఉత్సాహంగా పాల్గొన్నారు. హాలు నిండిపోయింది.

రచయితలకు రాజకీయాలకు గల అవినాభావ సంబంధాలు వక్తల వ్యక్తాభిప్రాయాల వల్ల మరింతగా తెలిసింది. కొంతమంది రచయితలు తమ ప్రసంగాల్లో వరవరరావును విడుదల చేయాలనే అభిప్రాయాన్ని తెలిపారు. మూడు పూటల్లో జరిగిన సమావేశాల్లో మూడు రోజుల్లో అందివ్వగలిగిన అంశాలిచ్చారు. తెరవే ప్రజాస్వామికంగా వ్యవహరించి చివరి సమావేశంలో భాషా సాహిత్యాది అంశాల విషయంలో అన్ని రాజకీయ పక్షాల వారినీ ఆహ్వానించడం, ఈ ఎన్నికల ముందు వాతావరణంలో ఎంతగానో కొరతగింది. కొన్ని రాజకీయ పక్షాలు ఎందుకో భాగస్వామ్యం వహించక పోవడం ప్రజలు గమనించారు.

ఉదయం ప్రజా వాయిద్యాల మధ్య పతాకావిష్కరణ ఆహ్లాద వాతావరణంలో జరిగింది. మధ్యలో అరుణోదయ వంటి సంస్థల నృత్యగానపు సందడులు, చివరలో పాటలు. రచయిత సాహిత్య కళా చైతన్య హృదయాలకు సాక్ష్యులుగా నిలిచాయి. మొత్తం తెలంగాణా ఎదుర్కొంటున్న సమస్యలు చాలా మట్టుకు రావడం, చర్చించబడడం, విశ్లేషించబడటం, ప్రశ్నించవలసిన వారిని ప్రశ్నించడం – వంటివి ప్రజా ప్రయోజనదాయకాలై రచయితలంటే ఏదో రాసుకునేవారు మాత్రం కాదని, ప్రజా సమస్యలను పూసుకునేవారు కూడా అని ప్రజలకు తెలిపింది. అతిశయోక్తిగా ప్రశంస అనుకోకపోతే ఈ తెరవే ఒరవడిని మరిన్ని సాహిత్య సంస్థలు రచయితల వేదికలూ అనుసరిస్తే కొన్ని వ్యవస్థలు తమ బాధ్యతల్ని గుర్తెరిగి మసలడం జరగవచ్చు.

*నిక్కమైన రత్నమొక్కటైనను* చాలు అన్నాడు తెలుగు జాతీయకవి వేమన్న. 'నిక్కమైన సభలు ఒక్క రోజున చాలు' అన్నంత సంతృప్తికరంగా జరిగాయి. పాలకుల బాధ్యతల్ని తెలుపుతూ రచయితలు బాధ్యతగా చేసిన సభలివి.

### కళలు, భాషలు, సాహిత్యం, సంస్కృతి...

మారుతున్న కాలానుగుణంగా రచయిత, భాషా స్వరూపం, సాహిత్యం, కళ, సంస్కృతి వంటి వానిని కొత్తగా మళ్ళీనిర్వచించు కోవలసిన అవసరం ఏర్పడింది. రచయిత ప్రజల సమూహాల్ని కాదని, ప్రభుత్వ యంత్రాంగంలో భాగమైతే సృజనాత్మకత కోల్పోతాడు. ఇక్కడ సాహిత్యానికి గల శక్తి బలహీనమవుతుంది. రచనలు సమాజానికి ఎంత దగ్గిరగా ఉంటే అంత ప్రయోజనకారి. రచయిత పౌర సమాజంపై ఒత్తిడి తెచ్చి ఆలోచింప జేయాలి.

ప్రభుత్వాలు సాహిత్యాన్ని, కళల్ని, తమ అవసరాలకు ఉపయో గించుకున్నంత కాలం రచయిత గౌరవాన్ని కోల్పోవక తప్పదు.

– జయధీర్ తిరుమలరావు

శ్రద్ధాంజలి

సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650.

# తెలంగాణ సాహితీభీష్ముడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కపిలవాయి లింగమూర్తి నిర్యాణం



'గౌరవ డాక్టరేట్' స్వీకరిస్తూ

తెలంగాణా సాహితి వైతాళికుడు, విశిష్ట చరిత్ర పరిశోధకులు, వివిధ సాహితీ ప్రక్రియలలో అరితేరి, శతాధిక రచనలు చేసిన ఘనుడు డా.కపిలవాయి లింగమూర్తి (90) ఇక లేరు. పండుటాకు రాలిపోయినట్లుగా చివరకు కన్నుమూశారు.పాలమూరు జిల్లా సమగ్ర సాహిత్యానికి ప్రతీకగా, నడిచే విజ్ఞాన సాహితీ సర్వస్వంగా ఆయనను పిలుస్తారు. ఆయన తనదైన సాహితీ వ్యాసంగాలలో రాటుదేలి వృద్ధాప్యాన్ని నిర్భయంగా జయించిన వారు, అవిశ్రాంతంగా రచనలు చేసి, తెలుగు సాహిత్యలోకంలోప్రతిభామూర్తిగా చెరగని పరిశోధక ముద్రను వేశారు. హైదరాబాద్ లో దుర్గాభాయి దేశ్ ముఖ్ ఆసుపత్రిలోచికిత్స పొంధుతూ, నవంబర్ 6న తుది శ్వాస విడిచారు. ఈ సంవత్సరం మార్చి నుండే ఆయన తరుచుగా, అనారోగ్యానికి గురవుతూ తిరిగి కోలుకుంటున్నారు. ఏడు పదుల పరిశోధక సాహీత్య జీవితం అపురూపమైనది. నిత్యయవ్వనమైనది.కరువు జిల్లాగా పేరు తెచ్చుకున్న పాలమూరు జిల్లా సాహితీ క్షేత్రంలో నుండి ఏన్నెన్నో సస్యకుసుమాలను తాను బతికినంత కాలం మేరునగధీరుడై, నిత్య వసంతుడుగా పూయించారు. తనదైన శైలిలో రచనలు చేసి, తొమ్మిది పదుల వయస్సులో కాలధర్మం చెందారు. గుర్తింపుల కోసం వెంపర్లాడకుండా,నిరాడంబరంగా జీవిస్తూనే, రచనలు సాగిస్తూనే, తన రచనలతో నాటి తరానికి, నేటి తరానికి మార్గదర్శిగా నిలిచారు. ఆయన తొలి రచన శతక సాహిత్యంతోనే మొదలైంది. పాండురంగ శతకం రాశాక, వెనువెంటనే శ్రీ వేంకటేశ్వర శతకం రాశారు.

ఆయన ఒక్క తెలంగాణాకే కాకుండా తెలుగు సాహిత్యలోకానికి పరిశోధనలో స్ఫూర్తిగా నిలిచిపోయారు. డా.లింగమూర్తి నిర్యాణం పట్ల, తెలంగాణా రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు, పలువురు సాహితీ వేత్తలు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సాహిత్య జీవితం ఆదర్శవంతమైనది, ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమి వంటి సంస్థలు పురస్కారాలు ఇచ్చిగౌరవించకున్నా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నూతన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన పురస్కారాలు ఇచ్చి, గౌరవించడం ఆనందదాయకమే కదా. తెలంగాణాలో నూతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత,తెలుగు విశ్వవిద్యాలయం వారు 26-8-2014న

ఏకంగా గౌరవ డాక్టరేట్ సత్కారాన్ని ఇచ్చి ఘనంగా సన్మానించారు. తెలంగాణా వచ్చాక ఆయనకు వచ్చిన తొలి దొడ్డ గుర్తింపు ఇదేనని చెప్పవచ్చును. పాలమూరు జిల్లానుండి అనర్ఘళ సాహితీరత్నాల జాబితాలో ఒక్క వెలుగు వెలిగిన సురవరం ప్రతాపరెడ్డి, గడియారం రామకృష్ణ శర్మ వంటి ఉద్దండుల తర్వాత కపిలవాయి లింగమూర్తి తనస్థానం పదిలం చేసుకున్నారు.

ఆయనపై సాహితీవిమర్శ, చారిత్రిక పరిశోధకులైన స్వర్గీయ వేటూరి ప్రభాకరశాస్త్రి, నిడదవోలు వెంకట్రావు,ఆచార్య పుల్లెల రామచంద్రుడుల పరిశోధక ప్రభావాలు పడ్డాయి. ఆయన సాహిత్య, చారిత్రిక పరిశోధక జీవితం వెలలేనిది,ఆధ్యాత్మికంగా ఎన్నో పరిశోధక రచనలు చేసి,తుప్పుపట్టి, దుమ్ము పట్టిన ప్రాచీన గ్రంథాలను, తాళపత్ర ప్రతులను సేకరించి, పరిశోధించి, దోషాలను సవరించి, సరైన వ్యాఖ్యానాలు చేసి, అట్టివాటిని గ్రంథాల రూపంలో పాఠక లోకానికి అందించారు. పూర్వ మహబూబ్ నగర్ జిల్లా అంతటా గ్రామ గ్రామాన తిరిగి దేవాలయాల చరిత్రను పరిశోధించి 2010లోపుస్తక రూపంలో తెచ్చారు. అందువల్లే ఆయన సమగ్ర సాహిత్య, చారిత్రిక పరిశోధకుడిగా ఎదిగి పలు గ్రంథరచనలు చేయడానికి కారణమైంది. స్వర్ణకార వృత్తిపరంగా తన ఇంట్లో వారసత్వంగా దొరికిన మాంగళ్య శాస్రం అనే గ్రంథాన్ని పరిశోధించి, మద్రాసు గ్రంథాలయం నుండి ఇందుకు సంబంధించిన ఒక ప్రతిని తెప్పించి, సరిచూసి, ఇందులో పెన్సిల్‌తో పలు ఆభరణాల చిత్రాలను తానే సొంతంగా వేసి, పుస్తక రూపంలో వెలువరించారు. ప్రాచీనకాలం నుండి ఇప్పటివరకు మంగళాభరణాలు ఏ పేర్లతో ఏ రూపంలో ఉండేవో సచిత్రంగా వివరిస్తూ, వాటికి సంబంధించిన నియమ నిబంధనలను కూడా వివరించిన గ్రంథానికి చక్కటి పేరు వచ్చిందని ఆయనే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నారు. సోమేశ్వర క్షేత్ర మహాత్యం అనే గ్రంథాన్ని పరిశోధించి, తప్పొప్పులు సవరించి ప్రచురించారు. వారిని రెండు మూడు సాహిత్య సభల్లో చూశాను, గత పదేళ్ళనుండి ఫోన్ లో మాట్లాడుతుండే వాడిని. వారి మనవడు ఆనంద్ తో దగ్గరి సాహిత్య పరిచయాలున్నాయి. లింగమూర్తిగారు స్వర్ణకార వృత్తి కులానికి



గద్దర్‌తో...

చెందినవారు. వీరు కొంతకాలం స్వర్ణకార వృత్తిని చేసినట్లు చెప్పుకున్నారు. వీరు తరుచుగా భాగ్యనగరానికి వెళ్ళి, ఆబిడ్స్ లో పాత గ్రంథాలు కొని తెచ్చుకొని పరిశోధిస్తుండే వారు.

వీరు 1928, మార్చి 31న పాత మహబూబ్ నగర్ జిల్లా, ప్రస్తుతం కందనూల్ జిల్లాగా ప్రసిద్ధినొందిన నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరి మండలం జినుగుంట గ్రామంలో జన్మించారు. వెంకటాచలం, మాణిక్యమ్మలు తల్లి తండ్రులు. ఆయనకు రెండున్నరఏళ్ళ వయస్సులో తండ్రి చనిపోగా, మేనమామ పెద్ద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. వీరినే లింగమూర్తి గారు తన సాహిత్య గురువుగా ప్రకటించుకున్నారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశాడు. ఆంధ్ర సారస్వత వరీక్షలు రాసి, తెలుగులో విశారదలో ఉత్తీర్ణులయ్యారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగులో ఏంవోఎల్ పూర్తి చేశారు. 1954 లో నాగర్ కర్నూల్ లోని జాతీయోద్యమ తెలుగు పాఠశాలలో వీరు తెలుగు పండితునిగా 18ఏళ్ళు పని చేశారు. వీరు నాగర్ కర్నూల్ లోనే స్థిరపడ్డారు తర్వాత పాలెం లోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో చరిత్ర పాఠాలు11ఏళ్ళు బోధించి, 1983లో పదవీ విరమణ పొందారు. 300 పుస్తకాలకు ముందు మాటలు, అభిప్రాయాలు రాశారు. వీరు తన కొత్త ఇంట్లో పదివేల పుస్తకాలుండే గృహ గ్రంథాలయాన్నిప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు. వచ్చి పోయే సాహితీవేత్తలతో వీరి ఇల్లు కళకళ లాడుతుండేది. అతిథి సత్కారాలలో వీరు అందె వేసిన చేయి. వీరు రాసిన 70 వరకు పుస్తకాలు అచ్చుకాగా, ఇందులో చాలా మంది ఆర్థిక సాయంతోనే అచ్చయ్యాయి. 11 వరకు పునర్ముద్రణకు నోచుకున్నాయి. 25కు పైగా రచనలు అముద్రితాలు.

ఇటీవలే నాగర్ కర్నూల్ కొత్త జిల్లా దేవాలయాల చరిత్రను రాసి, మంత్రి జూపల్లి కృష్ణారావుచే ఆవిష్కరించుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, వీరిలో పెద్ద కుమారుడు కిశోర్ బాబు చనిపోగా, చిన్నవాడు




పుస్తకావిష్కరణ సందర్భం...

అశోక్ కుమార్, హైదరాబాద్ స్టేట్ బ్యాంకులో పని చేస్తున్నారు. అశోక్ బాబు ఇటీవల కపిలవాయి లింగమూర్తి సాహిత్య పీఠం నెలకొల్పి, తెలంగాణా సారస్వత పరిషత్ అధ్యక్షుడైన ఆచార్య ఎల్లూరి శివారెడ్డిని తండ్రి సమక్షంలోనే సన్మానించారు. 4-12-2017న కృష్ణదేవరాయ భాషానిలయంలో ఈ సభను నిర్వహించారు. వీరిపై రెండు డాక్యుమెంటరీల నిర్మాణాలు జరిగాయి.

**బిరుదులు-పురస్కారాలు :**

కవితా కళానిధి, పరిశోధన పంచానన, కవికేసరి, వేదాంత విశారద, గురు శిరోమణి, సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు వీరి సాహిత్య కృషికి దక్కాయి. 2017లోతెలంగాణా సారస్వత పరిషత్ వారి దేవులపల్లి రామానుజారావు శతజయంతి పురస్కారంతోపాటు, బూర్గుల రామక్రిష్ణారావు, బ్రౌన్, నోరి నరసింహశాస్త్రి, బిఎన్.శాస్రి, కందుకూరి రుద్రకవి సాహిత్య పురస్కారాలను అందుకున్నారు. వీరు యాభైకి పైగా పురస్కారాలను అందుకున్నారు.

**రచనలు :**

వీరు బహు భాషా కోవిదులు, వీరిపై ఆరుగురు సిద్ధాంత పరిశోధనలు చేశారు. వీరు కావ్యాలు, పద్యాలు, వచనాలు, నాటకం, కథలు, నవలలు, బుర్రకథలు, హరికథలు, అనువాదాలు,గీతాలు, శతకాలు, పీఠికలు, స్థల చరిత్రలతోపాటు,బాల సాహిత్యంలో రచనలు చేశారు. పాలమూర్ జిల్లా మాండలిక నిఘంటువును తయారు చేసి ముద్రించారు. వీరు 14 చారిత్రిక రచనలు చేశారు. తెలంగాణా ప్రాంత చరిత్రకారునిగా రాశిలోను, వాసిలోను పేరు తెచ్చుకున్నారు.

క్షేపాల గంగోత్రి-తూమువంశ రెడ్ల చరిత్ర, చక్ర తీర్థ మహాత్యం, భాగవత కథాతత్వం, మహా క్షేత్రం-మామిళ్ళపల్లి స్థల చరిత్ర, దీనికి అనుబంధంగా మూడు తరాల ముచ్చట అనే చారిత్రిక నవల, శ్రీ భైరవకోన క్షేత్ర మహాత్యం, శ్రీమత్ ప్రతాపగిరి ఖండం(అమ్రాబాద్ చరిత్ర), చత్రపతి, ఇందేశ్వర చరిత్ర, సోమేశ్వర మహాత్యం,సాలగ్రామ శాస్త్రం, ఉప్పునూతల కథ, గద్వాల హనుమత్ వచనాలు,పద్యకథా పరిమళం, అంతేకాక దుర్గాభర్గ శతకం, జినకుంట రామబంటు శతకం, పరమహంస శతకం, .ఆర్యా శతకం, పామర సంస్కృతం అనే పాలమూర్ మాండలికం,రాజరథం అనే భువజవిజయం రాయలవారి ఆస్థానం పై రాసిన ప్రత్యేక సాహిత్య రూపకం, కావ్య గణపతి అస్టోత్తరం, కొల్లోజు కనకాచారి సమకూర్చిన సాహితీ వనంలో ఒక వనమాలి పేరిట వీరి జీవిత చరిత్ర, కపిలవాయిపై డా.వెలుదండ సత్యనారాయణ రాసిన గురు శతకం ఇటీవలె అచ్చులో వచ్చాయి. వీరి రచనలు సంపుటాలుగా తీసుకొని రావాల్సివుంది. తెలంగాణా సాహిత్య అకాడమి వారు గాని,తదితర కేంద్ర,రాష్ట ప్రభుత్వ సాహిత్య సంస్థలు, ప్రభుత్వేతర సాహిత్య సంస్థలు గాని ఆర్థిక సాయం చేయడానికి ముందుకు రావాల్సి వుంది. ఇది తక్షణ కర్తవ్యం.

వీరి మృతికి తెలంగాణే కాక, తెలుగు సాహిత్యలోకం అంతా కన్నీరు కార్చింది. వీరి అంత్యక్రియలు నవంబర్ 7న జరిగాయి. వీరి రచనలు, పరిశోధనలు చిరంజీవాలు. తక్కువ ధరపై అమ్మడానికి వీరి రచనలు అందుబాటులోకి తేవాలి. వీరి రచనల్ని పాఠ్యపుస్తకాల్లో,వీరి విగ్రహాన్ని ట్యాంకుబండ్ పై, పాలమూర్ జిల్లాలో పెట్టాల్సి వుంది. అదే వారికి ఇచ్చే సరైన నివాళి.

నాటు తెలుగు

కీ.శే. బొడ్డుపల్లి పురుషోత్తం

# 'నాటు తెనుఁగు' మేటిజెట్టి

## (దాసవ్యాస సంగ్రహ సమీక్షా సముపేతము)



నాటుమందు, నాటువైద్యం, నాటుమనిషి అనే వాడుకలు విన్నాను కాని, 'నాటు తెనుగ' నే వ్యవహారం చూచి ఆశ్చర్యపోయాను. అంతకుముందు 'అచ్చ తెనుఁగు' అచ్చ తెనుఁగు కబ్బాలు' అనే వ్యవహారం బాగా పరిచయమైంది. 'అచ్చ శబ్దభవం 'అచ్చ', 'అచ్చ తెనుఁగంటే సంస్కృత సమేతరమైన తెనుఁగనే నిర్వచనం సుప్రసిద్ధమైంది. సంస్కృత సమేతర మంటే 1 సంస్కృతభవం 2) ప్రాకృతసమం 3) పాకృతభవం 4) దేశ్యమనే నాల్గు విధాలుగా ఉన్న పదజాతం అన్న మాట. దీన్ని బట్టి తెనుగు పదజాలాన్ని రెండే రెండు విభాగాలుగా నిరూపించుకోవచ్చు. 1) సంస్కృత సమం 2) సంస్కృత సమేతరం అని. ఇదంతా సంస్కృత ప్రాకృతాల్ని మనస్సులో నిల్పుకొని చేసిన విభాగంగా స్థూలంగా చూస్తేనే గోచరిస్తుంది.

ఏ భాషకైనా ఆ భాషలో నిసర్గంగా ఉత్పన్నమైన పదజాలమే జీవం. ఆ నిసర్గ పద నిర్మాణాన్ని అనుసరించే, అన్య భాషా పదాలు తదనుకూలంగా మార్పు చెంది అటువంటి నిర్మాణాన్నే పొందుతాయి. సంస్కృత ప్రాకృతాలు కూడా తెలుగుభాష కన్యభాషలే అవుతాయి. కాలాంతరంలో తెలుగు భాషకు అరబ్బీ, పారసీక, తురుష్కాది భాషల్తో సన్నిహిత సంబంధ మేర్పడింది. ఆయా భాషాపదాలు చాలావరకు తెలుగు దేశీయ పదనిర్మితి ననుసరించే మార్పులు చెంది తెనుగులో చేరాయి. ఇట్లే అద్యతన కాలంలో ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసు, ఆంగ్లాది భాషలతోను సంబంధాలు ఏర్పడ్డాయి తెనుగు భాషకు. ఇందుండే పదాలు చాలా మార్పులకు లోనై తెలుగులో వ్యవహృతమౌతున్నాయి. ఇలాంటి పదాలన్నీ క్రమంగా 1) ప్రాచీన తద్భవాలు 4) అర్వాచీన తద్భవాలు 8) నవీన తద్భవాలు అని వ్యవహరించవచ్చు. ఇట్టి తద్భవా లేర్పడటానికి హేతువు తెనుగునాటిలో సహజంగా పుట్టిన దేశీయ పదజాల నిర్మాణమే...

దేశీయ పదజాల నిర్మితి ననుసరించి మార్పునకు లోనుకాకుండా శిష్టుల వ్యవహారంలో విశేషంగా వాడుకలో ఉన్న పదాలను పై క్రమాన్ని అనుసరించి 1) ప్రాచీన తత్సమాలు 2) అర్వాచీన తత్సమాలు 3) నవీన తత్సమాలు అని వ్యవహరింపవచ్చు, వీని నిర్మితి భిన్నంగా ఉండటంచేత వీటిని పృథక్కరిస్తే, తద్భవాలు, దేశ్యాలు ఒకే ఒక శ్రేణికి చెంది సమాసాది నిర్మాణాలకు తోడ్పడుతున్నాయి.

ఈవిధమైన దేశీయ పద ప్రాముఖ్యాన్ని మనస్సులో బాగా మననం చేసుకొనే ఆ మహావ్యక్తి "నాటు తెనుగ" నే పదాన్ని కల్పించి ఉంటారని భావించటంలో విప్రతిపత్తి ఉండదు. 'నడవబడ్డ దేశం - నాడు'. అటువంటి 'నాడు' లో పుట్టిన పదజాలం 'నాటు తెనుంగు' అని నిర్వచింపవచ్చు. ఇట్టి 'నాటు తెనుఁగు' లో రచన చేయటం రచయితలకు క్రమక్రమంగా ప్రవాహానికి ఎదురీతే అయింది; అనాగరకమే అయింది. అయినా ఆ మహామనీషి 'నాటు తెనుగు' లో రచన చేయటమే తన జీవిత పరమ ధ్యేయంగా పెట్టుకొని ఎటువంటి కృతకత్వం రానీక అలవోకగా ఆ 'నాటు తెనుగు' లో బహుముఖీనంగా రచన కావించి, మేటిజెట్టిగా విఖ్యాతి నార్జించాడు. ఆ మహామనీషే శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు మహోదయులు. వారి ఈ భాషావిషయికమైన ఆగ్రహానికి అంజలించటానికే ఈ వ్యాసరచనం. అంతేకాని దాన్ని ఆద్యంతాలుగా నిరూపించి, పరితల ఆగ్రహానికి గురి కావాలని కాదు.

**శ్రీ నారాయణదాసు మహోదయులు ఎంతో రచన చేశారు, 'పుంభావసరస్వతుల'ని కాస్త కూస్తో చదువుకొన్న వాళ్ళందరిని సంభావిస్తారు కొందరు. సరస్వతి చతుష్షష్టి కళల కధిదేవతగదా ! అంతదూరం ఆలోచించటానికి అవకాశం లేకపోతే...కనీసం విభిన్న స్వభావాలు కలిగినప్పటికీ; ఒక దానికొకటి ఆశ్రయమై, క్షీరనీరంగా కలిసిపోయిన సంగీత సాహిత్యాల్లోనైనా పారం ముట్టిన వ్యక్తినే; సరస్వతీ దేవి మధుర స్తన్యాన్ని రెండు వైపులా కడుపునిండా త్రాగి, తేపగలిగిన మనిషినే 'పుంభావ సరస్వతి' అని సంభావిస్తే కొంత సముచితంగా ఉంటుంది. తెలుగుదేశంలో ఇటువంటి గౌరవాని కర్హమైన వ్యక్తి - ఈ విషయంలో అనామికాన్ని సార్థకం చేయగల మూర్తి శ్రీ మదజ్జాడవారే అని చాటటానికి భయపడే పని లేదు.**

తెలుగులో నన్నయనుండి నేటివరకు రచనలు చేసినవారిని ఈ క్రింది రీతిగా వింగడింపవచ్చు.

1) ఇది సంస్కృతం, ఇది దేశ్యం అనే విచక్షణ లేకుండ, ఉదాత్త విషయాన్ని ఉదాత్త శైలిలో రచించేవారు.

2) దేశ్యపదం లభిస్తుండగా సంస్కృతాన్ని వాడకుండా,

అత్యవసరంపట్లనే సంస్కృతాన్ని పరిమితంగా వాడేవారు. వీరిని "జాను తెనుఁగు" రచయితలనవచ్చునేమో!

8) సంస్కృతాన్నే రానీకుండా సంస్కృత సమేతర పదజాలంతో రచనలు సాగించినవారు.

నన్నయాది మహాకవులు తొలి వరుసలోనివారు. వీరి కావ్యాలే జనానీకంలో విశేష ప్రచారాన్ని అందుకొన్నాయి. మనం తినే 'అన్నం' కూడా సంస్కృతమే కావడం చేత; ప్రజానీకం సంస్కృతభాషను దేవతాభాషగా పరిగణించి, మన సంస్కృతి అంతా ఆ భాషలో నే నిక్షేపించబడిందని భావింపబడడం చేత ఆరీతి రచనా వ్యాసంగమే ఆదరణీయమైంది. దీన్ని ప్రవాహమార్గం అనవచ్చు,

తిక్కనాది మహాకవులు రెండవ శ్రేణికి చెందినవారు. పై రచనల కన్న ఈ రచనల్ని అర్థం చేసుకోవడమే క్లిష్టమనిపిస్తుంది. ఇట్టి రచనలు చేయటంలో రచయితలకెంతో నిగ్రహం కావాలి. 'జాను తెనుఁగు' బాగా తెలియాలి. తెలుగు నుడికారం సొగసు ఆకళింపు కావాలి. ఇది ప్రవాహానికి కొంత ఎదురీత.

పొన్నకంటి తెలగన్నతో మూడవ శ్రేణి రచయితలు ప్రారంభమౌతారు. ఈ విధమైన రచన ఒక ఉద్యమంగా సాగింది. కందుకూరి వీరేశలింగంగారు కూడ ఈరీతి రచనలు కావించి తమ అభినివేశాన్ని చూపారు. శ్రీ మదజ్జాడవారు తమ రచనావ్యాసంగం – ఏకొద్దిగానో మినహాయిస్తే – ఈ పద్ధతికే అంకితం చేసారు. ఇదీ ప్రవాహానికి పూర్తిగా ఏదురీతే అనాలి. ఎందుకంటే ఇది ఒక విధంగా

---

తెలుగునుడుల నెఱిఁగి, వానిని వాడుకోలేని తెలుగువారి బేల తనాన్ని ఎన్నోమార్లు దాసుగారు ఎగతాళిచేసారు – అనేక వ్యాసాల్లో వారి ఎద్దేవా చాల అందంగా ఉంటుంది. "ఎవరిసీమ వారికిమ్ము. దేని పిల్ల దానికి ముద్దు. ఎవ్వని ముక్కు వానికిఁ దిన్నన. ఎవరికంపు వారికింపని తెలిసీ తెలియని తెలుఁగు దేబ నాటు తెలుగున్బాటింపకున్న నేమి ? పులుసు చవి తెడ్డెఱుగునా ? తన యింటి నాల్లుమూలలే తెలియని వెడగు మింటి చుక్కలన్లెక్కించునట్లు తనయూరి తెల్గు పల్కులనే గుఱుతింపనేరని యెడ్డి యెట్లు వేల్పునొడవుల న్దెలియఁగలడో ఇలాంటి పలుకు బండులు వారి రచనలంతటా తామరతంపరగా ఉంటాయి.

---

కృతకమై పోయింది. దేశ్యపదాలు చాలా సంస్కృత పదఘట్టనానికి కృశించి నశించిపోయాయి, కొన్ని అచ్చ తెనుగు పదాలు సంస్కృత భావచ్ఛాయల్లో కల్పించబడ్డాయి. 'సీత' అంటే సులభంగా తెలుస్తుంది. కాని 'పుడమి మొలనూలి చేడియ కనిన పడుచు' అంటే కొండను త్రవ్వి ఎలుకనుబట్టినట్లే అసావాదిత్యో బహ్మలాగా తలచుట్టు చేతినిత్రిప్పి, ముక్కును జూపించే రీతిలోనిది. అప్పకవి యిట్టి భాషను 'తెనుగు మఱుగులు' అన్నాడు,

శ్రీ మదజ్జాడవారి నీ పద్ధతి రచనే ఎందుకో విశేషంగా ఆకర్షించింది. అయితే వీరి రచనల్లో పై శ్రేణికి చెందిన చాలా రచనల్లో



**సంస్కృత భాషా పాండిత్యమే పాండిత్యమని, ప్రతి తెలుగు పదాన్ని సంస్కృతానికి ముడి పెట్టుకొని ముచ్చటపడే పండితులకోవకు చెందని పండితమాన్యుడు, పరిశోధకుడు, ఉపజగలమనీషి, స్వతంత్ర ప్రతిపత్తిగల వ్యక్తి. శ్రీదాసుగారంటే అభిప్రాయ భేదముంటుందనుకోను.**

కనిపించే కృతకత్వం సాధారణంగా కనిపించదు. నిసర్గమనోహరంగా, అలవోకగా వీరి రచన సాగుతోంది. అనేక హరికథా కాలక్షేపాల్లో నాటు తెలుగులో నెలకొన్న దాసుగారి వర్ణనలు విని పరవశించిన సందర్భాలనేకం ఉన్నాయి.

**ఆకాలంలో శ్రీవారు అనేక విషయాలపై పత్రికలకు వ్యాసాలు కూడా 'నాటు తెలుగు' లోనే రచించారు. అందులో ఏమాత్రం మోటుతనం కనిపించదు. "వేల్పుముచ్చటు" "ఎచ్చరిక" "తెనుఁగు" "మంచి బ్రతుకు" "మానిసులు" మున్నగు వ్యాసాలు ఇటువంటివే. ఈ వ్యాసాల్లో వారి విశేష దృక్పథం, ప్రగతిశీలం గోచరిస్తుంది. అక్లిష్ట మనోహరమైన భాషలో మనోజ్ఞమైన భావాలను, తెనుగుజాతి ఆరోగ్యంగా బతకాలని ఆశిస్తూ రచించారు ఆ వ్యాసాల్ని.**

ప్రతి వ్యక్తి తాను సంపాదించిన సొమ్మును తన గ్రామ సౌభాగ్యానికే వ్యయం చేయాలని వీరి ఆశయం. కష్టించి పని చేయాలి ప్రతి వాడు అని వీరి హెచ్చరిక. పరోపకార బుద్ధిని పెంపొందించుకోవాలని వీరి ప్రబోధం. ఎవరు పాఱులో, ఎవరు దొరలో, ఎవరు కోమటులో, ఎవరు కాపులో శ్రీ దాసుగారు "మంచి బ్రతుక" నే తమ వ్యాసములో బాగా వివరించారు. ఆదర్శ గ్రామంలో ఇండ్లు ఎట్లా నిర్మించుకోవాలో కూడా నిరూపించారు. "ఊఱి (రి) కి నడుమ వేయిమంది కొల్వుచేయఁదగిన రచ్చ చావడి యొక్కటి నెలకొల్పఁదగున" ను వీరి సలహాను ప్రభుత్వమిప్పటికైనా పాటించాలి,

"పదునెన్మిదేండ్లలోపున మగవానికిం బన్నెండేండ్లయీడులోపున నాడు దానికిం బెండ్లి తగదు" అని ఆ కాలంలో వీరనగల్గటం ఎంతో అభ్యుదయదృష్టి ఉండబట్టే వివాహం ఎట్లా ఉండాలో కూడా శ్రీదాసుగారు బాగా పేర్కొన్నారు. "పెండ్లికూతురు కన్న బెండ్లి కొడుకై దేండ్ల కన్న నీడున మించియుండకూడదు. ఏ తెగలకుఁజెందనీగాని యాల్మగ లొండొరుల నెంచుకొని వెల్లడిగా నొప్పుకొన్నఁగాని పెండ్లి చేయరాదు. అనే వాక్యాల్లో వీరి పరిశీలనాదృష్టి ఎంతనిశితమో విదితం. ఆరోజుల్లో ఆడపిల్లల్ని ముప్పదియేండ్ల మగవానికిచ్చి చేసేవారు. శుల్కం తీసుకొని. ఇప్పుడు నరునికన్నా నా నాలుదుఏఁడ్లు మిన్నగా వధువున్నా కట్నాలిచ్చి అంటగడుతున్నారు. ఈ వైపరీత్యం అనారోగ్యకరమైంది. సామాన్యంగా కనిపించే సంగతులుగానే కన్పట్టినా శ్రీదాసుగారు ప్రతి చిన్న విషయాన్ని అయినా ఎంతలోతుగా చూస్తారో ఈ "మంచి బతుక"నే వ్యాసం నిరూపిస్తుంది.

ఇటువంటిదే ఇంకో వ్యాసం "ఎచ్చరిక", ఆటపాటల్లో అందెవేసిన చేయి గదా శ్రీదాసుగారు, ఈ విద్యలు భగవత్సేవకు కైంకర్యము కావాలేకాని, మానవుల మెప్పుకో; ప్రభువుల ప్రశంసలకో పనికిరావని శ్రీదాసుగారు అనేక సందర్భాల్లో ఘాటుగా హెచ్చరించారు. ఐదో యేడునుండి పోతన భాగవతం కంఠస్థం చేసిన శ్రీదాసుగారికి - ఈరీతి దృక్పథం ఏర్పడటంలో ఆశ్చర్యం లేదు.

రచనల్లో సంస్కృతానికి దాస్యంచేసే బుద్ధి దాసుగారి కేమాత్రం గిట్టదు, "మదమాతంగ తురంగ సద్భట లసన్మాణిక్య గాణిక్యసంపద" అనే పద్యపాదం ఎంతమనోహరంగా శబ్దాలంకారశోభితంగాఉన్నా, వారి కెందుకో రుచింప లేదు. "మస్తీకిలాతము, మంచియొంట్రింపు లాలుపూస వెల వెలందికలుములు" అంటమే శ్రీదాసుగారికి విహితంగా ఉంటుంది. "బొత్తిగాఁ గొఱగాని కల్లచదువరుల లేనిపోని, ఁతెలిసీ తెలియని వేల్పు మాటల న్బొప్పంద్ర చెంగట సొరకాయల న్దెగనకుచుఁ బొట్ట కక్కురితి న్డాబు చేయుచున్నా రౌరౌరా! అని శ్రీదాసుగారు ఆశ్చర్యపడుదురు. భాషా విషయకముగా వీరికున్న 'వీఁక' యితరులకు కొంత "సిరు వీఁకు" గొల్పు నేమోగాని వారికట్టి దేకోశంలోను కానిపించదు. తమిఁళులకు గూడా నింతటి 'వీక' లేదేమో అనిపిస్తుంది.

'మాటలల్లువా'ని లక్షణాల్ని శ్రీ దానుగారిట్లా వివరించారు. ("వేల్పుగుడిలోసుంతయునేని పతను నేవి తన పాలెము తెనుఁగు మాటలకున్దేట తెల్లముగాఁ దెలియజాలునట్లు జావళులు, పాటలు, దబ్బులు, పెక్కు రకంబుల నాల్గడుగుల మాటల కూర్పులు న్దొల్లింటి పెద్దల కట్టు పాట్లకులోనై యెంగిలి ముక్కల తుగకొరుల న్వొంబడింపక, తనయుజ్జలనే వెలువరించుచు, లయకాఁడై యాటపాటల మేటియై, మాటకారి మేటరియై నిండుకొలువులం జదివి, పాడి, పలుసీమ నుడువులన్జెప్పి, యొప్పింపఁదగు నాతడే మాటలల్లువాఁడు" ఈరీతిగనే 'పాటకాని' 'ఆటకాని' లక్షణాల్ని యథాశక్తిగా నిరూపించారు శ్రీ దాసుగారు.

తెలుగునుడుల నెఱిఁగి, వానిని వాడుకోలేని తెలుగువారి బేల తనాన్ని ఎన్నోమార్లు దాసుగారు ఎగతాళిచేసారు - అనేక వ్యాసాల్లో వారి ఎద్దేవా చాల అందంగా ఉంటుంది. "ఎవరిసీమ వారికిమ్ము. దేని పిల్ల దానికి ముద్దు. ఎవ్వని ముక్కు వానికిఁదిన్నన. ఎవరికంపు వారికింపని తెలిసీ తెలియని తెలుఁగు దేబ నాటు తెలుగున్బాటింపకున్న నేమి ? పులుసు చవి తెడ్డెఱుగునా ? తన యింటి నాల్లుమూలలే తెలియని వెడగు మింటి చుక్కలన్లెక్కించునట్లు తనయూరి తెల్గు పల్కులనే గుఱుతింపనేరని యెడ్డి యెట్లు వేల్పునొడవుల న్దెలియఁగలడో ఇలాంటి పలుకు బండులు వారి రచనలంతటా తామరతంపరగా ఉంటాయి.

**శ్రీనాథాది మహాకవులు మరీ బరితెగి డు, ము, వు, లను జేర్చి సంస్కృతాన్నంతా తెనుగనే రీతిగా మరీ స్వతంత్రించారు. దీనికో విధమైన తిరుగుబాటే అచ్చ తెనుగు రచనోద్యమం. ఆ ఉద్యమంలో కడపటి మేటి జెట్టి శ్రీ దాసుగారుగా గోచరిస్తారు. "వేల్పునుడి జోలి సుంతయు నేని "తేటనాటు తెనుఁగు మాటలనే పొందుగానల్ల వలయు - న్గానియడ్డాదిడ్డీగా నోటికి వచ్చిన ట్లెల్లఁ గట్టుమట్టెఱుఁగక కలగూరగంపగా వేల్పు నొడువులకు, డు, ము, వు, లతికి చెఱచిన నుడుగులన్గలిపిన బాజారు తెలుగు పలుకల వ్రాసి; మాటకారులమనియు, మాటలల్లు వారమనియు, వ్రాయసకాంద్రమనియు న్బొప్పంద్ర చెంగట సొఱకాయలు నఱకు వదరుబోతులు నిక్కపు చదువరుల వలెఁ బ్రాచీనవిత్తులు తెగ నీల్గుచున్నా రౌరా పగడనాటు తెలుగు పలుకులన్గాని వేల్పునొడవుల నాని వేరు వేరుగా మాటలల్లి వహిన్గావించి చదువరులన్ మెప్పించుడన తోకముడిచి తాము మాటలల్లువాంద్ర మనుకొను నిప్పటి తిప్ప కాయలెల్లఁ బటాపంచలై పరుగిడకుందురా?" అను రీతిగా విమర్శిస్తారు తమ తెనుఁగు అనే వ్యాసంలో.**

శ్రీ దాసుగారి ఎన్నికలో ఇరువురే మహాకవులు. (1.) సంస్కృతంలో శ్రీ జయదేవుఁడు. (2.) తెలుగులో పోతనామాత్యుఁడు. ఏమంటారో వినండి. "నా యరయికన్పట్టి వేలుపు నుడువుల కూర్పు తెలివి జయదేవునకు న్దెపలుకునల్లు నేర్పు బమ్మెర పోతనకున్దప్ప మఱేమాట లల్లువారలకు నన్పట్టదు. వీరిట్లా ఎన్నిక చేయటానికి కారణం అందరిలాగా వీరు కవిత్వాన్ని వరించ లేదు. కవిత్వమే వారిని వరించింది. కవిత్వం అభ్యాసమూలంగా వచ్చేది కాదనే మాటను దాసుగా రెలా చెప్తారో వినండి. "వినవింపగ కుత్తుక, మాటలల్లు నేర్పు తనంత నోజమైఁ బుట్టుక తోనే రావలయున్గాని వాయింపులు, వ్రాతలు, వాలకములవలె నేర్చుకొన వీలులేదు"

**తెలుఁగు పదానికి వీరి వ్యుత్పత్తి విచిత్రమైంది. "తెలివిగలవారి పలుకునకుఁ దెనుఁగని పేరు. ఆ తెలుగు మాట్లాడఁగలవారే నిక్కముగా తెలివిగలవారు. తక్కినవారెల్ల మ్రుక్కడు లే యనక తీరదు. ఇట్టి రచన కెవ్వరు కోపగించుకోరాదు. ఇది వారి అభిమానానికి పరాకాష్ఠం త్రినగ శబ్దభవం తెనుఁగని; త్రిలింగశబ్దభవం తెలుఁగని వచించే వారిని వీరిట్లా నిర్దయతో ఖండించారు. అంటే వారి సిద్ధాంతం పట్ల వారికిగల నమ్మిక అటువంటిది.**

"త్రినగము, త్రిలింగములను వేల్పునుడులనుండి పుట్టిన వనియు న్బెక్కేల? వేల్పునొడవు నందలి పగడవ్రాయి యైనదియు నెట్లు మాఱిపోయినఁగాని యున్నఁజాలు నట్టి తెలుగు పలుకు వేల్పు నుడినుండి పుట్టినదని తెలుగుపలుకుపాడి తెలిసీ తెలియక అవ మింటన్మాటాడు కొనుచు, వహినుండి తెనుఁగు నేర్చుకొను చఱవ సీమను న్దెలుగు నాడునకు న్నడుమ నెలకొని తాముకూడఁ దెలుగు చదువరుల మఱికొను త్రుళ్ళుబోతులు కూటికక్కూఱితి నేమో చెత్త కవితలవ్రాసి యచ్చొత్తింపించి, బొప్పంద్ర న్మెప్పించి, దుడ్డుకూర్చు కొనుచు, నెణఃకగలవారివలెఁ దెగనీల్లుచు, నగటున వేలుపు నుడువుల నుండి తెలుగు పలుకులు పుట్టినవని వదరుచున్నారుగాని యెవరెవరికిఁ బుట్టిరో మొదలెవరైనఁ దెల్పగలరా?"

పై మాటలకేమిగాని, శ్రీ దాసుగారు, తెనుగు మున్నగు భాషలు సంస్కృతజన్యమనే వాదం అనాడు ప్రబలంగా అందరు పండితుల్ని పట్టుకొన్నది. కాదని సరసంగా ఖండించటం వారికిగల భాషాదృష్టికి నిదర్శనం. "ఎద్దినెననగ గొందిలోఁ గట్టుమన్నట్టు వేలుపునుడి యెల్ల నుడువులకు న్దల్లిపలుకని పెద్దలన్నంతతోడనే తెలుగుమాటలెల్ల నెద్దివ్రాయి పోల్కియుండినఁజాలు న్దెఅగంట్ల నుడువులనుండి వెల్లడించు వెంగళులిస్సీ యేమి విడ్డూరము? కొంత మలక పోల్కికలదు గనుక, నిప్పాఱుఁడీ దొర యిక్కోమటి, యిక్కాపామలక కుఁ బుట్టినాడని యనవచ్చునా?" ఇలా మంచి హాస్యధోరణిలో వ్యాసాన్ని నడిపించటమే కాక, అవసరంపట్ల విషయ సేకరణంకూడా చేసారు. నాటు తెలుగు నుడువుల్ని సంస్కృతాలుగాను, తద్భవాలుగాను భ్రాంతిపడ్డారని ఎన్నో పదాలు వీరు ఁసేకరించారు.

సంస్కృత భాషా పాండిత్యమే పాండిత్యమని, ప్రతి తెలుగు పదాన్ని సంస్కృతానికి ముడి పెట్టుకొని ముచ్చటపడే పండితులకోవకు చెందని పండితమాన్యుడు, పరిశోధకుడు, ఉపజగలమనీషి, స్వతంత్ర ప్రతిపత్తిగల వ్యక్తి. శ్రీదాసుగారంటే అభిప్రాయ భేదముంటుందనుకోను.

నాటు తెలుగులో వారెంతటి శాస్త్రీయ విషయాన్నై నా అలవోకగా ఉపజ్ఞతాస్ఫోరకంగా ఎలా చెప్తారో ఒక్క ఉదాహరణం పరికించండి "చత్వారి శృంగా త్రయో అస్యపాదా/ ద్వేశీర్షేసప్తహస్తా సో అస్య,/ త్రిధాబద్ధో వృషభోరోరవీతి / మహాదేవో మర్త్యా ఆవివేశ/ ఋగ్వేదం 3. 8. 3)

"రెండు తలలు, నాల్గు శృంగముల్ చెలువొంద /మూఁడు కాళ్ళు, చేతులేడుగల్గు / త్రివిధబద్ధమైన వృషభరాజము మహా / దేవుఁడై ప్రజాళి నావహించు".

ఈ ఋగ్వేద మంత్రాన్ని అన్ని శాస్త్రాలకు అన్వయించారు మన పూర్వులు. దీన్ని నాటు తెల్గులో శ్రీ దాసుగారిలా వ్యాఖ్యానించారు సంగీతపరంగా. "మాట యను బసవడు పలుకులు తల్కుబెళ్కులను నాల్గు కొమ్ములు తత్తఱ నడివడులను మూఁడు కాళ్లు; మీఁదు క్రిందులను రెండు తలలు, నెమలికూఁత, యెద్దుఱంకె, మేక గునుపు, బాతు మ్రోత, కోయిల పల్కు, గుఱ్ఱపు సకిలింపు, ఏనుగుఁ గీకలను నేడు చేతులు తనరార, హెచ్చు తగ్గు మందడి రవళుల మూటనట్టఁబడి, మగటిమి వగ యోర్పు నగవు హొయలు, వెఱిపబ్బర నలుక వెగటులను తొమ్మిది చవుల న్వెల్లి గొల్పుచు మిన్ను మన్నులు పిక్కటిల్ల నిచ్చలు ముఱయుచుండును".

"గానమ"నే వ్యాసం మాత్రం నాటు తెనుగులోగాక మామూలు తెలుగులో రచించినారు శ్రీ దాసుగారు. నాట్య వేదోక్తులతో నెంతో వివరించారు. నాట్యశాస్త్రానికే శ్రీ దాసుగారు వ్యాఖ్యానం రచిస్తే ఎంతో సముచితంగా ఉండేది. సంగీత నృత్య విద్యార్థుల్లో... ఉండిపోయాయి. వారి వ్యాఖ్యాన వైఖరిని బాగా ఆకలించుకొనే నృత్య సంగీతాదులు నాకు తెలియలేదు. కాని మధ్యమధ్యలో వారిదృక్పథాన్ని వివరించే మాటలెన్నో నా గుండెకు గుచ్చుకొన్నాయి. "(1) డబ్బు కొఱకు నృత్య గీత వాద్యములు జీవనవృత్తి కావించుకొనరాదు. భరత వర్షమున హిమవత్పర్వత మెట్లనాది సిద్ధమో చాతుర్వర్ణ్యమట్లనాది సిద్ధము. (2) నిజమైన శూద్రునకు బాహ్మణ ద్వేషముండదు; మఱియు నిక్కమగు బ్రాహ్మణుఁడు శూద్రుని జుల్కనాడఁడు. తమతమ పెద్దల నాటి మర్యాదను గాపాడుకొనుచున్నంత కాలము బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులు నలువురును బరస్పరము బేమ గౌరవాతిశయముల జూచుకొనక తప్పదు.

(3) సభాముఖమున నాట పాటలు ప్రదర్శించదగినది వేశ్యా కన్యక యొక్కతయే. ధనాశ లేని వేద విద్వాంసుడు హరికథా సంకీర్తనమున నృత్య గీత ప్రావీణ్యమున జనసత్కారమును బొందుట మేలు గాని యబ్బడ్డ వాడెల్ల స్వార్థపరుడై డబ్బాసలో నాట పాట మాట మీటల జీవన వృత్తిగాఁ జేసికొని తాఁ జెడ్డకోతి నమెల్లఁ జెఱచు నట్లొరుల మోసపుచ్చి తా మోసపోక తప్పదు.

(4) వినపడునదెల్లఁ బాటయే. అగపడునదెల్ల నాటయే. "నామ రూపాత్మం జగత్" – జగమంతయు నాటపాటలరూపే – యాట పాటలు కాని దినుసే లేదు.

(5) తనతోటి జీవుల నేవగించక, పాటుపడి కూడుగుడ్డల న్గూర్చుకొని, తన్గాపాడుమనిముప్వేళల న్బొద్దు వేల్పునకు మొక్కులిడువారికన్న సంగీత విద్వాంసు లితరు లెవ్వరు ?

శ్రీ దాసుగారి లౌకికాలౌకిక ప్రజ్ఞాపాటవం వారి యిష్టదైవమైన సూర్యభగవానుని వంటిది. ఆ భగవంతుడికి అంజలిస్తున్నాను.



Unfiled Notes Page 23

పొరుగు తెలుగు

# కన్నడతోటలో విరిసిన తెలుగుపాట

## బుర్రకథ ఈరమ్మ-సంచారి ఆత్మకథ




కన్నడ మూలం
డా. నింగప్ప ముదేనూరు

అనువాదం
రంగనాథ రామచంద్రరావు

(నవంబరు సంచిక తరువాయి...)

### సంచారి ఆత్మకథ జాడ పట్టుకుని...

హొసపేట నుంచి కంప్లికి వచ్చి, అక్కడ బళ్ళారికి వెళ్లే బస్సు ఎక్కితే ముందుగా మెట్రి అనే ఊరు వస్తుంది.

దాని తరువాత దేవులాపుర.

ఈ దేవులాపురలోని సగం ప్రాంతం సండూరు ఉపవిభాగం పరిధిలో చేరుకుంది.

ఇక్కడి నుంచి ఒకటి రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న ఊరే - హాళె దరోజి.

హాళె దరోజి బళ్ళారి జిల్లా సండూరు తాలుకాకు చెందింది.

సండూరు అనగానే మనకు రెండు విషయాలు గుర్తుకొస్తాయి.

ఒకటి మైనింగ్.

మరొకటి కుమారస్వామి కొండ.

హాళె దరోజిలో (పాత దరోజి) మైనింగ్ లేకపోయినప్పటికీ పక్కన కొండలున్నాయి.

కొండల్లో రాళ్ళను చీల్చుకుంటూ వచ్చే డైనమైట్ల శబ్దాలు అప్పుడప్పుడు వినిపిస్తుంటాయి.

ఈ ఊళ్ళో భోవిలు (వడ్డెర్లు) ఎక్కువ సంఖ్యలో ఉండటం చూస్తే మొదట్లో వీళ్ళు కొండ పరిసరాలలో రాళ్ళు కొట్టి జీవించేవారని అనిపిస్తుంది. ఊరికి కుడి భాగంలో ఉన్న ఈ కొండ 'కరడిగుడ్డ' (ఎలుగు బంట్ల గుట్ట) అని పేరుపొందింది. ఇక్కడంతా ఎలుగుబంట్లు తిరుగుతుంటాయి. కొండమీద 'రామలింగేశ్వరస్వామి దేవస్థానం' ఉంది. చుట్టూ అక్కడక్కడ కోటలు ఉన్నాయి. ప్రకృతి దత్తమైన ఈ కొండగుట్టలతో కూడిన పరిసరాలను చూస్తే ఆదిమ జనసముదాయాలు ఈ రాతిగుహలనే ఇళ్ళుగా చేసుకుని నివసించిన అనేక గుర్తులు కనిపిస్తున్నాయి. ఇప్పుడు అడవి జంతువులు, ముఖ్యంగా ఎలుగుబంట్లు నివాసం ఏర్పరుచుకున్నందున, అది కరడిధామమనే (ఎలుగుబంట్ల స్థావరంగా) ప్రసిద్ధి చెందింది. హాళె దరోజి అనగానే 'కరడిధామ' గుర్తుకు రావటం ఈ కారణం వల్లనే. ఈ కొండల వరుస హంపి వరకూ ఒక కొంగులో పరుచుకుని ఉంది.

ఈ ఊరికి ఒక పెద్ద చెరువు ఉంది.

ఆ చెరువు అయిదారు పల్లెల వడ్లు, చెరుకు, జొన్న, పత్తి, వేరుశెనగ పంటలకు నీళ్ళు అందిస్తుంది.

ఈ చెరువు పైనున్నదే కోడి సర్వయ్య(వీరభద్రేశ్వర) దేవస్థానం.

కోడి పడిపోకూడదనే ఊరి రక్షణకోసం ఈ జనం చేస్తున్న జాతర కూడా అత్యంత ముఖ్యమైనది.

ఊరులో పద్దెనిమిది కులాలవారు బతికివుండాలనే పూర్వీకుల నమ్మకాన్ని నిజం చేస్తూ, హాళె దరోజిలోనూ పద్దెనిమిది కులాలవారున్నారు.

సుమారు 500 ఇళ్లున్న ఈ ఊళ్లో ఎక్కువమంది వడ్డెర్లు. మిగిలినవారు లింగాయతులు. వడ్రంగులు, కోమట్లు, కురువలు, వాల్మీకులు, బేస్తవాళ్ళు, పింజారులు, హరిజనులు, చాకళ్లు, మంగలివాళ్లు, భజంత్రీలు, ఎరుకలు, జంగమలు(లింగాయతుల పురోహితులు) రెడ్లు, ముసల్మానులు మొదలైనవారు ఉన్నారు. వాళ్ళతోపాటు బుడగ జంగమలు కూడా నివసిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాల, ప్రౌఢశాల, పిండి గిరణి, రైస్ మిల్లు, సొసైటి, పోస్ట్ ఆఫీసు, ఫోన్, టి.వి. మెటడోర్, ప్రపంచ బ్యాంకు సహాయంతో నిర్మింపబడిన నీటి ట్యాంకు - ఇలాంటి ఎన్నో ఉన్నాయి.

సండూరులోని గనుల తవ్వకాలకు గురైన అనేక కుగ్రామాలు ఇంకా ఆధునికత కొత్త గాలులు వీచక లోలోపల నలుగుతున్నప్పుడు హాళె దరోజి ఈ సౌకర్యాల వల్ల రాజకీయ నాయకుల దృష్టిలో ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఒకవైపు అభిమానమూ కలుగుతుంది.

ఈ అభిమానం ఎందుకంటే ఈ ప్రాంతమంతటా రాజులు మహారాజులు తిరిగారు.,

ఏనుగుల అంబారీలు నడిచి వెళ్లాయి.

ఒక సమయానికి విజయనగర సామ్రాజ్యానికి ఇదే మహాద్వారం.

'దరవాజ్' అని అప్పట్లో పేరు పొందిన ఈ ఊరు లోపల 'ఆనె బజార్' (ఏనుగుల బజారు) అనే పేరుగల వీధి ఉంది.

ఇక్కడ బంగారం, వెండి, ముత్యాలు, రత్నాలు, వజ్రాల వ్యాపార



**కన్నడ రచయిత**
డా. నింగప్ప ముదేనూరు

**అనువాదకుడు**
రంగనాథ రామచంద్రరావు

వ్యవహారాలు నడుస్తుందేవని ఆ ఊరిలోని అనేకులు చెబుతారు. ఎవరూ చూసివుండని సామ్రాజ్యం గురించి చూసినవారిలా మాట్లాడే ఈ ప్రజలే ఇక్కడ బుర్రకథ చెప్పే ఈరమ్మ ఎక్కడుందో మీకు తెలుసా అని అడిగితే ఎందుకో మౌనం వహిస్తారు. లేదా ఊరి బయట ఉండే వేషగారులా అని ఉదాసీనంగా అడుగుతారు.

భారతదేశంలోని కిందిజాతి (దళిత) అనుభవించిన క్రూరమైన సామాజిక పీడనలను, బహిష్కారాలను నేరుగా అనుభవించకపోయి నప్పటికీ, వారిని బుడగ జంగమ (వేషగారులు) అని భావించటంలో, లేదా ఒప్పుకోవటంలో మరో విధమైన స్వార్థముంది. ఈ స్వార్థం బుడగ జంగమ కులంలోని ఒక తెగ వేషాలు వేసి మన శిష్టకులాల విధానాలను అనుకరిస్తున్నది మరియు అభినయిస్తున్నదీ అనే మూలం నుంచి వచ్చింది.

ఇంతకు మునుపు రాసినట్టు మీరు వేషగారులనే అడిగి చూడండి.

'మేము బ్రాహ్మణుల వేషం, లింగాయతుల వేషం, జంగమల వేషం, ముసల్మానుల వేషం, కురువల వేషం, నాయకుల వేషం, దళితుల వేషం, ఇలా పద్దెనిమిది కులాల వేషాలు వేసుకుని ఆ కులపు తీరుతెన్నులను వారి జీవన పద్ధతుల్లో చూపుతాం' అని అంటారు. అయితే వారు ఒక విషయాన్ని చెప్పటానికి వెనుకాడరు. ప్రతి ఒక్క కులంలోని బందారాన్ని తమ వేషం ద్వారా బయటపెడతామని అంటారు. హాళె దరోజీలో ప్రస్తుతం నివాసమున్న సణ్ణ రామణ్ణ నాలుగైదు దశాబ్దాల నుంచీ ఇదే వేషం వేస్తున్నాడు. మునుపటి ఊళ్ళోని సంఘర్షణలు, పీడనలు, అవమానాలు, హీన పరిస్థితులను జ్ఞాపకం చేసుకుంటూ వాళ్లు వేషాలు వేసేవారు. ఇలా వేషాలు వేయటమే అలాంటివారి కాయకమైపోయింది.

వేషగారుల ద్వారా పరంపర తెలియక, వేషం వేసుకునే వాస్తవాల తప్పనిసరి పరిస్థితులను అర్థం చేసుకోక, ఊళ్ళోని ఒక వర్గం ప్రజలు వాళ్లను భౌతికంగా దూరం పెట్టారు. లేదా వీళ్లే ఊరి బయట ఉండి కొత్త బతుకును రూపొందించుకునే దారిలో ఉన్నారు. ఇలాంటి సంచారులకు ఊరూరు ప్రయాణమే. ఒకే వృత్తి అయినప్పటికీ కాలమానపు కొన్ని సందిగ్ధతలు వారిని నెలవుకొనేలా చేస్తాయి. హాళె దరోజీలో పన్నెండు కుటుంబాలు నివసించటం ఈ కారణంగానే.

ఈ కథను తరువాత చెబుతాను.

ప్రస్తుతం హాళె దరోజి (పాత దరోజి) విషయానికి వద్దాం.

'హాళె దరోజి' (పాత దరోజి) ఉన్నదంటే 'హొస దరోజి' (కొత్త దరోజి) ఉండాలి కదా !

అదీ ఉంది. చెరువు తూర్పువైపున కనుచూపుమేరలో కనిపించేదే 'హొస దరోజి'.

చెరువు వెనుక భాగపు అంచులోనే జిందాల్ ఫ్యాక్టరీల వైభవం కనిపిస్తుంది.

వందలాది సంవత్సరాల కిందట ఊరికి మహమ్మారి ప్లేగు వచ్చినపుడు జనం పండుటాకుల్లా రాలిపోయారు.

పశువులు, ఆవులూ దూడలూ లేకుండా పోయాయి.

గ్రామదేవత దగ్గర మొరపెట్టుకుంటే ఊరు వదలమని ఆదేశించింది.

దాంతో మునుపు ఉన్న ఊరు మరింత ముందుకు జరిగింది.

కొంతమంది జనం వెనక్కు జరిగారు.

ఇలా వెనక్కు జరిగిన వారు కొత్త ఇళ్లను కట్టుకుని కొత్తఊరు నిర్మించుకున్నారు.

అయితే ఊరు కొత్తగా నిర్మాణమైనప్పటికీ పేరులో 'దరోజి'ని వదులుకోలేదు.

హాళెదరోజి, హొసదరోజి అని రెండు భాగాలైనప్పటికీ ఇప్పటికీ అవి తమ జీవితపు మునుపటి స్వరూపాన్ని కాపాడుకున్నాయి. ఈ రెండు ఊళ్ల ప్రత్యేకతను సంతరించుకున్న చిన్న ద్వీపాల్లా కనిపించినప్పటికీ భావనాత్మకమైన సంబంధాలు మాత్రం అలాగే ఉండిపోయాయి.

ఇది ఈరమ్మ కులస్థులు ప్రస్తుతం నివాసం ఉన్న ఊరి ఒకచిత్రం!

ఊర్లోని వడ్డెర్లు, నాయకులు, లింగాయతులు, చాకళ్లు, కురువలు, బారికోళ్ళు- వడ్రంగులు, ముసల్మానులు, ఎరుకలోళ్లు, మొదలైన కులాల మధ్య ఊళ్లోని ఒక భాగంలో (పాఠశాల పక్కన) ఈ బుడగ జంగమలు బతుకు సాగిస్తున్నారు. వీళ్లకు ఉన్న ఒకటి రెండు రాతి ఇళ్లు భాగ్యజ్యోతిని అంటే భాగ్యజోతి పథకం ద్వారా కరెంట్ సౌకర్యాన్ని పొందటం తప్ప ఇతర ఏ సౌకర్యాలూ వీరి ఇంటి ముంగిట్లోకి అడుగులు పెట్టలేదు. ఇదివరకూ బుడగ జంగమలు వేషగారలని (వేషగారుల జాతిగా గుర్తింపబడే ప్రమాదం) తమ ఏ మూల కులం నుంచి వంచితులైనారో ఇప్పుడు అదే కులం వారికి బతుకు చూపించే భరోసాను ఇస్తున్నదంటే మీరు నమ్మరు. ఈ 'బుడగ జంగమ' ఇప్పటికే అనుబంధ జాతుల పట్టికలో చేరింది.

పల్లెలు ఇంకా ఈ కులాల కోటల నుంచి విముక్తి పొందలేదు. అయినా ఈరమ్మ అన్న ఇంటి దగ్గరి సందులోనే లింగాయతుల, చాకళ్ళ రెండిండ్లు ఒకదానిపక్కన ఒకటి ఉన్నాయి. మరొక ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఊరంతటికీ సొంతమైన టెంపో ఒకే ఒకటి ఉంది. ఎవరినైతే ఇప్పటి వరకూ అల్పులని, అస్పృశ్యులని చెరువు, బావులు, ఊరు, హోటళ్ల నుంచి దూరంగా పెట్టారో అలాంటి దళిత కుటుంబానికి చెందిన గురుస్వామికి చెందినది. ఏ గురుస్వామిని తమ ఇంట్లోకి, అంగడిలోకి, హోటళ్లలోకి రానివ్వరో అదే జనం అదే దళిత గురుస్వామి టెంపో ఎక్కి ఊళ్లు తిరుగుతున్నారు. ఇప్పుడు వీళ్ళ మడి-మైల ఎక్కడికి పోయాయో? గ్రామాలలో ఈ విధమైన చారిత్రక మార్పుల గాలులు వీస్తున్నాయనటానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

బుడగ జంగమల జీవితాలు కూడా ఇలాంటి ఉదాహరణల వైపు

చలిస్తున్నాయన్నది మీకు పరోక్షంగానైనా ఇక్కడ చెప్పాలి. నాలుగైదు కుటుంబాలు తలా ఒకటో రెండో ఎకరాల భూమిని వేషగారుల వృత్తి ద్వారా కొనుక్కుని ఇప్పుడు వ్యవసాయ వృత్తికీ పూనుకున్నాయి. రాముడులాంటి వ్యక్తి కాస్త బాగా చదువుకుని ఈ సముదాయంలోని వాళ్లల్లో అవగాహన కలగజేయటంతోపాటు తానూ ఎల్.ఐ.సి. సేవలో నిమగ్నమై ఉన్నాడు.

2000 సంవత్సరంలో ఈ నాలుగైదు కుటుంబాలు కలిసి 400 బస్తాల వడ్లు పండించటం గొప్ప విషయం. సంవత్సరంలోని ఒక పంట కోసం 8–10 వేలు ఖర్చు పెడతారు. 4–5 వేలు మిగిలితే వారి బతుకు సాఫీగా సాగిపోతుంది.

అయితే ఈరమ్మ వ్యక్తిగతంగా దీనికి సంబంధించినది కాదు.

ఆమె ఊరూరు తిరిగి వచ్చి కడుపుకింత తిని పడుకునేది. ఈరమ్మ ఎక్కడ కథ చెబుతుందో అక్కడ తన గుడారం సిద్ధం చేసుకునేది. కొన్నిసార్లు వేషగాళ్లు అదే ఊళ్లో ప్రదర్శనలు ఇస్తుంటారు. అలాంటప్పుడు వాళ్లు మకాం పెట్టిన స్థలం పక్కనే ఈరమ్మకు ఒక ప్రత్యేకమైన గుడారాన్ని వేసి పెడతారు. ఈరమ్మది ఒక విధంగా సన్యాసిని జీవితం. ఆమెకు ఆ గుడారమే అంతఃపురమూ, అదే నివాస స్థలమూ. ఒకే చోట శాశ్వతంగా నివాసం ఉండని సంతుల బతుకది.

అంతేకాదు, ఈరమ్మ దరోజి చుట్టుపక్కల గ్రామాలలోనే కూలీనాలి చేసుకుని జీవించేది.

ఈరమ్మకు దినకూలి కేవలం ఇరవై రూపాయలు మాత్రమే.

మెట్రి గ్రామంలోని చిన్న గుడారంలో కొన్ని వారాలుంటే, వేషగారుల కుటుంబంతో మరో ఊళ్లోని గుడారంలో నిలిచి, అక్కడ కూలినాలి కథలు ప్రారంభిస్తుంది. జీవితంలో ఇలాంటి శ్రమజీవులు మౌనంగా కూర్చునేవారు కాదు. ఈరమ్మ పగటి పూట కూలికి వెళ్లేది. ఇక రాత్రంతా బుర్రకథ చెప్పేది. పగటి ఈరమ్మనే వేరు, రాత్రి ఈరమ్మనే వేరన్నట్టుగా ఉండేది ఆమె జీవితం. హాళెదరోజిలో తన సంబంధీకులు, బంధువులు, ఉన్నప్పటికీ, ఈరమ్మ భావనాత్మకమైన సంబంధాన్ని పెట్టుకుంటుందే తప్ప, ఉట్టినే ఎవరి ఇంటి కూడును ముట్టేదికాదు. ఆమె జీవితం ఇక్కడంతటా తెరిచిన పుస్తకంలా కనిపిస్తుంది. అదే విధంగా మన మనస్సును ఆక్రమిస్తుంది. ఈరమ్మ సంచార జీవితమూ, ఆమె గానం చేసే మహాకావ్యాల విషయాలూ విస్మయాన్ని కలిగిస్తాయి. ఆమె బతుకు చిన్న జలపాతంలా లేదా నదిలా కనిపిస్తే తన ఒడిలో కేరింతలు కొడుతూ కూర్చున్న మహాకావ్యాలు ఒక్కసారిగా కడలి ఉప్పొంగినట్టు పొంగుకు వస్తాయి. ఇది ఉత్ప్రేక్షపు మాట కాదు. జీవితం కొన్ని రోజుల్లోనే చూడగలిగేది కాదు. ఆమె జీవితాన్ని కొన్ని నెలలు లేదా సంవత్సరమంతా దాఖలు పరిచినా ఇంతే చెబుతుంది. లేదా ఇంతకన్నా తక్కువే చెబుతుంది. ఎందుకంటే ఈరమ్మ వ్యక్తిగత జీవితమంతా ఆమె మహాకావ్యాలలోనే కలిసిపోయింది. ఒక వేళ మహాకావ్యాలను శోధించటానికి పూనుకున్నా అక్కడ ఈరమ్మ దొరకదు. ఈరమ్మ పడిన కష్టాలూ కనిపించవు.

ఈరమ్మను, ఆమె పాటలను, ఆమె జీవితాన్ని, ఆమె కావ్యాలను సాక్షిగా పెట్టుకుని ఆమె జీవితంలోని అడుగులను ఆమె బాల్యపు రోజుల నుంచే చూద్దాం.

***

## పాటలాంటి బాల్యం

బుడగ జంగమలు రాయచూరు, బళ్లారి జిల్లాలలో అధిక సంఖ్యలో కనిపిస్తారు.

కర్ణాటక, ఆంధ్ర సరిహద్దులలో అధికంగా కనిపించే ఈ జన సముదాయం వాస్తవానికి ఆంధ్ర ప్రాంతం నుంచే వలస వచ్చారు. సంచార జీవులైన వీళ్ళకు స్థిరమైన పిడికెడు సొంతనేల లేదు. అందువల్ల వీళ్ళు ఒక చోట స్థిరంగా ఉండేవాళ్ళు కాదు. పొట్టకూటి కోసం కథలు చెప్పటం, వేషాలు వేయటం మొదలైన కళలు వీరికి వంశపారంపర్యంగా వచ్చినవి. బతుకుతెరువు కోసం నిరంతరం ఊరూరు, గ్రామాలు తిరుగుతూ గ్రామాల బయట గుడారాలు వేసుకుని జీవించే జనసముదాయానికి చెందినవారు. వీళ్లను పుట్టిన ఊరు గురించి అడిగితే సరియైన సమాధానం దొరకదు. జీవితంలో ఒక లక్ష్యం అంటూ వీరికి లేదు. భిక్షం ఎత్తుకునో, కథలు చెప్పుకునో, పాటలు పాడి పొట్టపోసుకుని, బతుకు బండిని సాగించడమే వారికి తెలుసు.

బుడగ జంగాలకు పెంపుడు జంతువులంటే ప్రాణం. పెంపుడు జంతువులైన గుర్రాలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలను ఎంతో ప్రేమగా పెంచుకుంటారు.

గుర్రాల మీద సామానులు వేసుకుని కుటుంబాలతో పాటు, తమ జంతువులను వెంటబెట్టుకుని, ఊళ్లూళ్లు తిరుగుతూ, ఏదో ఒక గ్రామం బయట గుడారాలను వేసుకుని మకాం పెడతారు. తమ ప్రయాణాల్లో ఎవరైనా పెద్దలు, ముసలివాళ్ళు, నడవలేనివాళ్లుంటే వాళ్ళను కావడిలో కూర్చోబెట్టుకుని, ఆ కావడిని మోసుకుంటూ, ఊళ్లూ తిరిగే నిజమైన శ్రవణకుమారులు వీళ్ళు.

అలా ఆంధ్ర నుంచి తిరుగుతూ తిరుగుతూ కర్నాటక చేరుకున్నారు. కర్నాటక సరిహద్దులోని జిల్లాలో నివాసం ఉన్నారు. ఇలాంటి సంచార జనసముదాయాలు ఆంధ్ర, కర్నాటక సరిహద్దు ప్రాంతాలైన రాయచూరు, బళ్లారి, కొప్పళ, తుమకూరు, కోలార, ధారవాడ, బెంగళూరు, బెళగావి, బాగలకోట, బీదర, గులబర్గా, బీజాపుర మొదలైన ప్రాంతాల్లో నెలవై వున్నారు. బుడగ జంగములు బుర్రకథలు చెప్పటం, వేషాలు వేయటం, హస్త సాముద్రికం తెలుసునన్నట్టు చేయి చూసి భవిష్యత్తు చెప్పటం, భిక్షం అడగటం మొదలైన వృత్తులతో తమ బతుకు సాగిస్తున్నారు.

ఇలాంటి ఓ సంచార జనసముదాయానికిచెందిన వ్యక్తి ఈరమ్మ!

ఈరమ్మ వంశస్థులు కూడా ఆంధ్ర నుంచి కర్నాటకకు సంచారులుగా వలస వచ్చినవారు. కర్నాటక ఆంధ్ర సరిహద్దు లోని బళ్లారి జిల్లాలో తిరుగుతూ చివరికి సందూరు తాలూకాలోని హాళె దరోజి గ్రామానికి వచ్చి మకాం పెట్టారు.

ఒక చోట మకాం పెట్టినా సంచారజీవితం నుంచి వారు దూరం కాలేదు. బుర్రకథలు చెప్పడానికి, వేషాలు వేయడానికి చుట్టుపక్కలున్న అనేక గ్రామాలు సంచరించాల్సి వచ్చేది. అలా వెళ్ళినపుడు ఆయా ఊళ్ల

బయటనే గుడారాలు వేసుకుని బతుకుతెరువు కోసం ఊరూరు తిరిగేవారు.

ఇలాంటి సంచార కుటుంబంలో ఈరమ్మ పుట్టింది.

ఈరమ్మ !

ఇది పెద్దలు పెట్టిన పేరు. వీళ్ళ కులగోత్రం 'అశ్వి'. ఈ 'అశ్వి' అన్నది 'అశ్వము' అనే పదం నుంచి వచ్చింది. అశ్వము అంటే గుర్రం. వీళ్లను గుర్రం గోత్రీకులు అనవచ్చు. ఈరమ్మ తండ్రి అశ్వి లాలప్ప. తల్లి జంబలమ్మ. తాత అశ్వి జంబణ్ణ, అవ్వ సుంకులమ్మ.

ఈరమ్మ తల్లితండ్రులు బుర్రకథలను తెలుగులో చెప్పేవారు. తాత కూడా బుర్రకథా కళాకారుడు. ఈరమ్మకు అయిదుగురు అక్కాచెల్లెళ్లు. ముగ్గురు అన్నతమ్ముళ్లు. సుంకమ్మ, మారెమ్మ, శివమ్మ, సణ్ణ మారెమ్మలు అక్కా చెల్లెళ్లు. నాగభూషణప్ప, తిప్పేస్వామి, బాలస్వామిలు అన్నదమ్ములు.

మొదట్లో వీరి తాతముత్తాతలు, వారి కుటుంబాలు గుర్రాల మీద లేదా గుర్రాలతో ఊరూరు తిరిగేవాళ్లు.

దీర్ఘకాలపు నడక వల్ల అలసిపోతే పిల్లలను, ఆహార సామగ్రిని గుర్రం మీద ఇరువైపులా సమభాగాలుగా వేలాడదీసుకుని వెళ్లేవారు.

ఎన్నో అడవులు-బయళ్లను, కొండలు-లోయలను దాటి ఊళ్లకు రావలసిన సందర్భాలలో గుర్రాలే వారికి జీవనాధారాలయ్యాయి. ముసలి వాళ్లయిన తల్లితండ్రులను మోసుకునిపోవటానికి జంగాల పురుషుడు వెదురుతో చేసిన కావడిని వాడేవాడు. వెదురు కావడికి ఇరువైపులా బుట్టలను కట్టుకుని అందులో కూర్చోబెట్టుకుని వందలాది మైళ్ళు నడిచేవాడు.

ఒట్టికాళ్లతో నడవటం వల్ల కలిగిన కాళ్ళ నొప్పులకు, కావడిని మోయటం వల్ల కలిగిన భుజం నొప్పికి ఉపశమనం పొందడానికి అతడికి అడవి ఆకుల రసం లేదా నొప్పిని తగ్గించే నూనె సిద్ధంగా ఉండేది. ఒక్కొక్కసారి కావడిలో ఒక్కరినే తీసుకునిపోవాల్సి వచ్చేది. అలాంటి సందర్భంలో ముందరి బుట్టలో తల్లినో, తండ్రినో లేదా తాతనో, అవ్వనో, కూర్చోబెట్టుకుని వెనుక బుట్టలో అంతే బరువు కలిగిన సామాన్లనో, బట్టలనో, కోళ్లు, కుందేళ్లనో నింపుకునేవాళ్లు. ఈ దృశ్యాన్ని కనుల ముందుకు తెచ్చుకుంటే మనకు ప్రాథమిక పాఠశాల పాఠ్యపుస్తకంలో చదివిన శ్రవణకుమారుని కథ గుర్తుకు వస్తుంది. శ్రవణకుమారుడు ఇదే అడవిలో కళ్లు కనిపించని, ముసలివాళ్లయిన తన తల్లితండ్రులను కూర్చోబెట్టుకుని తిరిగినది ఇదే కావడిలో కాదా? ఈ విధమైన సంచారమే సంచారుల జీవితపు దినచర్య. ఇప్పుడున్నట్టు ఆధునిక ప్రయాణ సౌకర్యాలు లేని ఆ సమయంలో వాళ్లు గుర్రాలను, పశువులను, కావడులను వాడేవారు. ఇప్పటికి ఆధునిక సౌకర్యాలు లేని ప్రాంతాల్లో వీటినే వాడుతారు. గుర్రం, పశువులు, వాళ్ల పెంపుడు జంతువులైతే, 'కావడి' వాళ్ల భుజాలకు అలంకారాలు.

నిజానికి ఇదంతా ఈరమ్మ కళ్లారా చూడలేదు. అయితే తన తల్లితండ్రుల ద్వారా, పెద్దల ద్వారా తెలుసుకుంది. కథలుగా విన్నది. ఆమె బాల్యజీవితం కథలు వినటంతో ప్రారంభమైంది. తన తాత నుంచి తండ్రికి, తండ్రి నుంచి తనకు ఈ కథాసాగరం ప్రవహించిన విధానం ప్రత్యేకమైనది. అదే విధంగా దాన్ని వదిలివుండలేని బాంధవ్యం గురించి వింటే, మన బాల్యానికి ఆమె బాల్యానికీ ఎంత తేడా ఉందో తెలుస్తుంది.

ఈరమ్మ బాల్యం కథలు వినటంతో ప్రారంభమైంది.

బాల్యంలో ఈరమ్మ తల్లితండ్రులు, తాతాఅవ్వలతో ఊరూరు తిరిగేది.

తల్లితండ్రులు బుర్రకథలు చెప్పడానికి వెళుతుంటే ఈరమ్మ, తన అక్కచెల్లెళ్లతో, తోటిపిల్లలతో కలిసి పశువులు కాయటానికి వెళ్లేది.

గ్రామీణులలో చాలామంది బాల్యంలో పశువులను మేపుతూ కాలువలు-కుంటలు, కొండలు-గుట్టలు, బయలు ప్రదేశాలలో తిరు తుంటారు. చెరువు ఒడ్డున ఆడుకుంటూ ఇసుకలో గుళ్లు గోపురాలు, ఇల్లు వాకిళ్లు కట్టుకుంటూ సంతోషంతో కాలం గడుపుతుంటారు. కొందరు తుంటరి చిత్రాలు గీస్తూ, అక్షరాలను దిద్దుతూ కాలం గడుపుతారు.

అయితే ఈరమ్మ జీవితం మరోలా ఉండేది.

తెల్లవారగానే లేచి చద్ది కట్టుకుని తమకున్న పాడిపశువులను తోలుకుంటూ ఊరిబయటి పచ్చగడ్డి మైదానాల్లోకి వెళ్ళేది.

అక్కడ పశువులు మేత మేస్తూ, అప్పుడప్పుడు చెట్ల కింద సేదతీరుతూ నెమరు వేసుకుంటూ ఉంటే, ఈరమ్మ రాత్రిళ్ళు తల్లితండ్రులు పల్లెల్లో చెబుతున్న కథలను గుర్తుకు తెచ్చుకునేది. తల్లితండ్రులు పాడుతున్న కథన కావ్యాలను మననం చేసుకునేది. ఆ పాటలను పాడుకుంటూ గంతులేసేది.

తల్లితండ్రులు కథలు చెబుతున్న సమయంలో ఈరమ్మ చాలా చిన్నపిల్ల. అయినా కథ ప్రారంభించే ముందు లేదా ముగింపుకు వచ్చే సమయానికి ఈరమ్మ అగరొత్తులను వెలిగించుకుని కూర్చోవలసి వచ్చేది. అది తల్లితండ్రులు ఆమెకు అప్పగించిన పని. ఆ పనిని ఆమె ఆ చిన్న వయస్సులోనే బాధ్యతగా నెరవేర్చేది. కొన్నిసార్లు తల్లితండ్రులు చెప్పే కథల్లో లీనమైపోయి, చేతిలోని అగరొత్తులు చేతివేళ్ళను చురుక్కు మనిపించినా క్షణంలో సర్దుకునేదే తప్ప, ఎన్నడూ ఏడ్చి, కథాగమనానికి ఆటంకం కలిగించేది కాదు.

ఈరమ్మ తల్లిదండ్రులు రసవత్తరంగా కథ చెబుతుంటే, జనం తదేక చిత్తంతో కథవింటూ కూర్చునివుండేవారు.

తల్లిదండ్రులు తన బాల్యంలో తెలుగులో చెబుతున్న ఈ కథలను, ప్రజల ఆసక్తులను ఈరమ్మ శ్రద్ధగా గమనిస్తూ వుండేది.

అప్పుడే తనకు తెలియకుండానే కథలు వినాలనే కోరిక, కథలు చెప్పాలనే అభిలాష ఆమె మనస్సులో బీజంలా పడింది.

తల్లిదండ్రులతో వందలాది ఊళ్లను తిరిగింది. అక్కడి పరిసరాలు, ప్రజలు, వారి భాష, వారి నడతలు, ఇష్టాయిష్టాలు గమనించేది.

ఆనాటి కాలంలో జనం కథలు వినడం కోసమే వీధుల్లో గుమిగూడేవారు.

కథ ముగిసిన తరువాత 'మరొక కథ' కోసం 'మాట' (ఒప్పందం) జరిగితే అక్కడి నుంచి మరో ఊరికి మూటాముల్లె సర్దుకుని వీళ్లు వెళ్లాల్సి వచ్చేది.

**కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!**

ఇలా వీళ్లు ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్లటాన్ని వాళ్లు 'దేశం తిరిగే కాయకం' అనేవారు.

ఇలా ఊరూరు కథలు చెప్పటానికి ఒక ఊరి నుంచి మరో ఊరుకు తిరుగుతూ, గుడారాలను మోసుకుని పోయి అక్కడ గుడారాన్ని వేసుకోవలసి వచ్చేది.

ఈ విధంగా ఆంధ్ర నుంచి కర్నాటకకు వచ్చినవారు ఈ బుడగ జంగములు.

ఇక్కడికి వచ్చిన తరువాత తప్పనిసరిగా ఇక్కడి స్థానికులతో కలిసి జీవించాల్సి వచ్చింది. స్థానిక భాషను నేర్చుకోవలసి వచ్చింది. స్థానిక భాషలోనే కథలు చెప్పవలసి వచ్చింది. అప్పటిదాకా తెలుగులో ఉన్నటువంటి కథలను, కావ్యాలను, ప్రజల కోరిక మేరకు కన్నడలోకి మార్చుకుని పాడవలసి వచ్చింది. వారి జీవితాలే ఊరూరు తిరగటం వల్ల, ఆయా ఊరి భాష, పరిసరాలను అలవాటు చేసుకున్నారు. ఆ భాషలోనే అనువదించుకుని కథలు చెప్పసాగారు. ఆ కారణంగా చిన్న వయస్సులో ఉన్న ఈరమ్మకు తొందరగానే ఈ కథలను నేర్చుకోవటం, గానం చేయడం సులభమైంది. నేర్చుకోవాలన్న ఆమె స్వాతంత్ర్యానికి, కోరికకు వయస్సు అడ్డురాలేదు.

తమతోపాటు ఉన్న పశువులను మేపటానికి దూరంలో పచ్చటి అడవికి తోలుకొని పోవాల్సివచ్చేది.

ఈరమ్మ ఆ పశువులను ఒంటరిగానే తోలుకునిపోయేది.

పశువులు హాయిగా మేతను మేస్తుంటే, ఈరమ్మ ఏ చెట్టుకింద కూర్చునో, లేదా ఏ బండరాయి మీద కూర్చునో రాత్రిళ్ళు తల్లితండ్రులు గ్రామాల్లో చెప్పిన కథలను, పాటలను మననం చేసుకుంటూ ఉండేది. అలా చేసుకుంటూ చేసుకుంటూ ఆమెకు తెలియకుండానే ఆమె మనస్సులోంచి ఏదో ఆవేశం పొంగుకు వచ్చి, పైకి గట్టిగా తల్లితండ్రులను అనుకరిస్తూ, కథ చెబుతూ, పాటలు పాడేది. సంతోషంతో పాడుతూ అడుగులు వేసేది.

ఇలా ఆమెకు ఆ చిట్టడవి పాఠశాల అయింది. ఆమె కథాగానానికి వేదిక అయింది. ఆమె మేపుతున్న ఆవులు, దూడలు, అడవిలోని చెట్లుచేమలూ ఆమెకు ప్రాణ స్నేహితులయ్యాయి. ఆమె కథలకు శ్రోతలయ్యాయి. నిజంగానే ఆ అడవి ఆమె పాలిట ద్రోణాచార్యుడు లేని గురుకులంగా మారింది.

తల్లిదండ్రులు పాడుతున్న పాటలను, కథనగీతాలను మననం చేసుకుని కంఠస్థం చేసేది. నేర్చుకున్నవాటిని పదే పదే మననం చేసుకుంటూ పాడుకునేది. ఈ అభ్యసనం వల్ల, ఆమెను అర్ధరాత్రి లేపి ఫలాన పాట పాడమన్నా అవలీలగా పాడేది.

కూతురులోని ఈ ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు తమ వెంట బుర్రకథలు చెప్పడానికి ఈరమ్మను పిల్చుకుని వెళ్లేవారు.

తండ్రి తంబూర వాయిస్తూ బుర్రకథను చెబుతూవుంటే ఈరమ్మ నేపథ్యగాయకురాలిగా తల్లితో గొంతు కలిపి పాడేది.

ఈరమ్మ కుటుంబం ఊరి బయట గుడారంలోనే ఉండేది.

వారికి ఉన్న పదిపదిహేను పశువుల కారణంగా పాలు, పెరుగులకు కొరత ఉండలేదు.

ఈరమ్మ స్వయంగా చుట్టుపక్కలనున్న ఇతర గుడారాల్లోని తన సముదాయపు జనాలకు పాలు, పెరుగు, మజ్జిగ ఇచ్చేది. అలా ఇచ్చినందుకు వారి నుంచి ఎన్నడూ ఏమీ తీసుకోలేదు. వారి నుంచి ఏమీ ఆశించలేదు.

తల్లితండ్రులు చెబుతున్న కథల్లోని ధానధర్మాల ప్రస్తావనలు ఆమె మనస్సులో నాటుకునిపోయాయి.

వాటి ప్రభావంతోనే ఈరమ్మ చిన్నప్పటికి నుంచే ధానధర్మాలు చేసే గుణాలను అలవరుచుకుంది.

తల్లిదండ్రులు రాత్రిళ్ళు బుర్రకథలు చెప్పేవాళ్ళు.

ఈరమ్మ పాటలు నేర్చుకుంటూ, పశువులు కాస్తూ, తన రోజువారీ పనులు చేసుకుంటూ, అప్పుడప్పుడు తల్లితండ్రులతో కథాగానంలో పాల్గొంటూ పెరిగి పెద్దదైంది.

కూతురులో పాటల పట్ల, బుర్రకథ పట్ల, ఉన్న ఆసక్తిని చూసి సంతోషంతో తల్లిదండ్రులు మురిసిపోయేవారు.

అదే సమయంలో ఆమె సోదరులు వేషాలు వేసేవాళ్లు.

వాళ్ళకు బుర్రకథ విద్య అబ్బలేదు.

తండ్రి – తన కొడుకులు బుర్రకథ చెప్పటం, పాటలు పాడటం నేర్చుకోలేదని మధనపడేవాడు.

తండ్రి తాను బతికి ఉన్నంత కాలం ఈరమ్మకు అండగా నిలిచాడు. ఆమెలో ఉత్సాహం నింపాడు. తల్లితండ్రుల ద్వారా తను నేర్చుకున్న ఈ పాటలు, కథలు ఆమె బతుకు తెరువుకు ఆధారమయ్యాయి. తల్లితో కలిసి ఈరమ్మ నేపథ్యంలో పాడుతూ తండ్రి బుర్రకథకు సహకరించేది. తమ కూతురిలో ఉన్న ఈ కులవృత్తిని, ఆ ప్రేమవాత్సల్యాలను చూసి స్వయంగా తల్లితండ్రులు ఆనందపడవారు. ఆడపిల్ల అయినా ఈరమ్మ శ్రద్ధగా పాటలు, కథలు నేర్చుకుంటూ ఉంటే, ఆమె అన్నదమ్ములు ఈ బుర్రకథలను నేర్చుకోవటానికి సాధ్యం కాక, వేషాలు ధరించి రామాయణ, మహాభారతంలోని సంఘటనలను, దృశ్యాలను, పద్దెనిమిది కులాల వర్ణనలను ప్రదర్శిస్తూ ఊరూరు తిరుగుతూ పొట్టపోసుకునేవారు.

ఈరమ్మ ఆడపిల్ల అయినప్పటికీ నాకెందుకు ఈ కథ, పాటలు అని ఎన్నడూ విసుగుపడేది కాదు. ఇదీ ఒక విద్య. తల్లితండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఈ విద్య కడుపుకు ఇంత అన్నం పెడుతుంది. బతుకుతెరువు చూపిస్తుంది అని ఈరమ్మ గాఢంగా నమ్మింది.

'నీ బతుకు తెరువుకు ఈ విద్య ఉపయోగపడుతుంది నేర్చుకోమ్మా' అని తండ్రి చెప్పిన మాట ఆమె మనసులో నిలిచిపోయింది.

తండ్రి మాటలకు గౌరవం ఇచ్చి, ఆమె సరస్వతిని మూలన పెట్టకుండా, ఆ సరస్వతి తల్లి చేయి పట్టుకుని నడిచింది.

ఆ తల్లి కూడా ఈరమ్మ చేయి వదల్లేదు.

'ఈ బుర్రకథే నా జీవిత సహచరి' అని నమ్మిన ఈరమ్మ పెరిగి పెద్దయింది.

పాటలా సాగిన బాల్యంలో యవ్వనం కాలు పెట్టింది..

(వచ్చే నెలలో– **కలవరపడిన కన్నెవయసు**)

* * *

సన్నిధానం నరసింహశర్మ
9292055531

# కవిత్వప్రియులు ఎల్లరిలో నిలిచిన 'కొత్తపల్లి'



వచన కవిత ఎలా రాయాలీ అంటే, యువతరం కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణగారి కవితల్ని మార్గదర్శకాలుగా భావించుకోవచ్చు, తీసికోవచ్చు.

వెలుతురు పిట్టలు, అక్షరంలో అంతరిక్షం, వామన విశ్వం, స్వస్థానమిత్రుడు వంటి ఆయన కవితా సంపుటాలు తెలుగు వచన కవిత్వంలో మేటి కవితా సంపుటాలు. శబ్దాలపై అదుపు, భావాల వ్యక్తీకరణలో పొదుపు, తాజాగా ఆలోచించి అనుభూతి చెంది మాత్రమే రాయగలగడం ఆయన విశిష్టతలు. ఇస్మాయిల్, శ్రీకాంతశర్మ వంటి అనుభూతి కవులలో తాను ఒకరైనా, తన విలక్షణతను తాను రక్షించుకొంటూ రాసిన గొప్ప కవి–కొత్తపల్లి.

పిఠాపురంలో ఆవంత్స సోమసుందర్‌గారితో శ్రీమన్‌గారు ఎన్నో రాత్రుళ్ళూ అర్ధరాత్రుళ్ళూ కేవల కవిత్వ చర్చల్లో, సాహిత్య చర్చల్లో గడిపేవారు. శ్రీమన్‌గారి వెలుతురు పిట్టలకి సోమసుందర్ రాసిన 'దివ్య చైతన్య స్రవంతీ మంజుల నినాదం' పీఠిక ఒక కవితా తాత్త్విక పీఠిక.

ఎవరినీ నొప్పించకుండా, స్వీయాభిప్రాయం ప్రకటించడంలో వెనక్కి తగ్గకుండా వుండేలా ప్రవర్తించడం మా గురువుగారు మధునాపంతుల వారిలో చూశాను; మిత్ర బృందంలో సత్యశ్రీమన్నారాయణగారిలో చూశాను. ఒకసారి ఒకాయన 'సోమసుందర్ కవితలన్నీ సంపుటాలుగా రావాలి' అని అంటే, శ్రీమన్ నవ్వుతూ 'ఎంపిక చేసి కూడా సంపుటాలుగా వేయచ్చు' అన్నారు. ఆయన మాటల్లో 'కాకువు' చిత్రంగా ఉండేది.

అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి శతాధిక కవి సమ్మేళనం చేసింది రాజమహేంద్రవరంలో. అది వాగర్థ సమాఖ్య ద్వారా. కొత్తపల్లీ, నేనూ, సాదనాల వేంకట స్వామినాయుడు ప్రధాన కార్యకర్తలం... కవుల పేర్లు అకారాదిగా వేసి ఆ విధంగా పిలిచాం. ఆవంత్స అధ్యక్షులు. అద్దేపల్లి, జయధీర్, ఎన్.గోపి, ఆర్వీయస్ ఇలా ఎంతమందో 120, 130 మంది దాకా కవితా పఠనం చేశారు. గ్రంథాలయంలో నా గది కవి పండితులతో రచయితలతో సందడిగా వుండేది.

ఎం.పి. అరుణకుమార్ కవిత వ్రాసి ఇచ్చారు. శ్రీమన్ చూశారు. చదివించాం. ఉదయం సుమారు 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ సాగింది. ఎమ్మెల్యేలు, రాజకీయ వేత్తలు గౌరవించుకోతగినవారే అయినా, వారిని సాహిత్య వేదికలపైకి అంతగా ఆహ్వానించేవాళ్ళం కాదు.

శ్రీమన్నారాయణగారి జీవితం, కవిత్వమూ, అధ్యయనం బాగా తెలిసిన సతీష్ చందర్‌గారు ఆయన కవిత్వంపై ఓ పుస్తకం రాస్తానన్నారు. రాయతగినవారు. వారు ఆ పుస్తకాన్ని సమీప భవిష్యంలో అందిస్తారని ఆశిద్దాం.

కేంద్రీకృత భావదీప్తికి కవితా వచనం ఏవిధంగా ఆధునికంగా, శిల్ప సమన్వితంగా మలచాలో, అనే అంశంలో శ్రీమన్‌గారి ఎరుక చాలా గొప్పది.

ఆయన ప్రధాన ప్రక్రియ వచన కవిత్వమే అయినా–పద్య రచన క్రొత్త తలపుల సిరులుగా ఇచ్చారనడానికి ఆయన 'వామన విశ్వం' సంపుటే తార్కాణం. అందులోని పద్యాలు పురాణం సంపాదకులుగా ఉన్నప్పుడు ఆంధ్రజ్యోతి వార పత్రికలో వచ్చేవి. మధునాపంతుల అంతటివారు వారి పద్యాలను మెచ్చుకునేవారు. పద్యాలు రాశాక ఏమైనా వ్యాకరణ దోషాలు రాకుండా మెలకువలు వహించడానికి తణుకులో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసిన మా బావగారు గాడేపల్లి కుక్కుటేశ్వరరావు గారి వద్దకు వెళ్ళి చూపించాం. జానపదాల బాణీల్లో కొన్ని పాటలు కూడా రాశారాయన. వేదునూరి గంగాధర జానపద వాఙ్మయ గ్రంథాలయానికి ఆయన ఉపాధ్యక్షులుగా ఉండేవారు. న్యూఢిల్లీలో విజ్ఞాన భవన్‌లో ఆంధ్రకేసరి సమితి వారు నిర్వహించిన ఓ పెద్ద సభకు ప్రధాని రాజీవ్ గాంధీ ముఖ్య అతిధి...ఆ సభకు కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. ప్రధాని ఉన్న, తాను అధ్యక్షత వహించిన సభా ఛాయా చిత్రాన్ని అయినా తెచ్చుకోలేదు. కీరితి వెంపరలాటకు ఆయన ఎప్పుడూ ఆమడ దూరంలో వుండేవారు.

భౌతికశాస్త్రం గురించి మాట్లాడుతున్నా, రోదసీ శాస్త్రం గురించి మాట్లాడుతున్నా చివరకు కవిత్వంలోకి తీసుకు వచ్చే అచ్చమైన కవితా ప్రియుడైన కవి ఆయన.

రాజమహేంద్రిలో శ్రీమన్‌గారూ నేనూ 'కవిత్వం' అనే వేదికపై

ఏక కవి కవితా పఠనలు నిర్వహించాం. 'కవితా ప్రమేయం' పేరుతో ఒకరు కవి కవితా వైశిష్ట్యాన్ని విశ్లేషింప జేసేవాళ్ళం. అఫ్సర్ వంటి విశిష్ట కవులు ఆ వేదికపై కవితా పఠనం చేశారు. హైద్రాబాదు బ్రిటిష్ లైబ్రరీ నుండి ఆయన ఆంగ్ల గ్రంథాలు తెచ్చుకుని చదివేవారు.

గ్రంథాలయ ఉద్యమకారులు గ్రంథాలయాలను కేవలం గ్రంథాలయ వస్తు కేంద్రాలుగా చూడలేదు. ఆయా జ్ఞాన శాఖల పాఠకుల మధ్య వంతెనగా చూచారు. పదిమంది కలసి ఎరుక ముచ్చట్లాడుకునే భావ సంచలన కేంద్రాలుగా బహుముఖ కార్యకలాపాలకేంద్రాలుగా చూశారు. నేడు అది మృగ్యమవుతోంది. శ్రీమన్‌గారు, నేను ఇలా కొందరు పెద్దవారి స్ఫూర్తితో ఏం కార్యకలాపాలు చేసినా, గౌతమీ పొత్తపు గుడిలోనే చేసేవాళ్ళం. సామూహిక చైతన్యాలే సామాజిక వికాసాల విత్తనాలవుతాయి. కవిత్వాన్ని శిఖరాయమాన కళగా, తపస్సుగా సాధించ వలసిందని ఆయన నూటికి నూరు శాతం విశ్వసించారు. విద్యుచ్ఛక్తి శాఖలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు స్థానమనేది పెద్దదే అయినా సభా కరపత్రాలలో కవి అని వ్యవహరింపబడడానికే మొగ్గు చూపేవారు.

గొప్ప కవిత్వం రాయగలిగేవారిలో కూడా గొప్పగా నైతిక జీవనులై అందరూ వుంటారని చెప్పలేం.

ఒక్కపైసా అంటే పైసా అవినీతి చేయని అధికారిగా విద్యుచ్ఛక్తి శాఖలో పేరొందారు.

పైగా తమ కార్యాలయంలో పనికాక, లేదా వాయిదా పడి నిరాశగా వెళ్ళి వృద్ధులకీ, మహిళలకీ వారిపనులు నిర్వర్తింప జేసేవారు. క్రింది ఉద్యోగుల వద్దకు తానుగా వెళ్ళి, వారిని కసురుకోకుండా, విసురుకోకుండా పనులు నిర్వహింపజేసేవారు. పురస్కారాల సరైన ఎంపికలు చేసే ఫ్రీవర్స్ ఫ్రంటు, నూతలపాటి గంగాధరం స్మారక పురస్కారాలు ఆయనకు వచ్చాయి.

ఆయన కవిత్వం గురించి వ్రాయబోతే పుటలు ఎన్నో కావాలి. కవితా వస్తు స్వీకరణలో కాకి ఎంగిలి కూడా నాకు వద్దనే మౌలిక కవి, ఆయన.

చెట్టులేని చోట ఆముదం చెట్టు వంటివాడు కాదాయన. జనమంచి కామేశ్వరరావు, సహదేవ సూర్య ప్రకాశరావు, మధునాపంతుల, మల్లంపల్లి శరభేశ్వరశర్మ, రంధి సోమరాజు, ఆర్.ఎం. చల్లా వంటివారున్న కవి బృంద రాజమహేంద్రంలో కవిగా నిల్చినవాడు, రాష్ట్రంలో గొప్ప కవిగా గణించబడినవాడు.

కవితా వేత్తలు ఆయన కవిత్వంపై విశ్లేషణాపూరిత వ్యాసాలు, గ్రంథాలు రాయాలి. పాఠ్య గ్రంథాలలో ఆయన కవితల్ని వేయాలి.

వెలుతురు పిట్టలులో సూర్యకోకిలం కవిత

'చీకటి కాకి / చుక్కల గుడ్లను / రాత్రల్లా పొదుగుతుంది / ఒకే ఒకటి / సూర్యకోకిలం అవుతుంది / మిగిలినవన్నీ / కాకి పిల్లలై / చీకటి కాకితో ఎగిరిపోతాయి/ కాకుల మంద తరిమేసిన / సూర్య కోకిలం / ఒంటరిదైనా / సమస్త జగత్తునీ / రంజింప జేయగలుగుతుంది' ఇటువంటి అపూర్వ భావ విలసితాలైన కవితలు స్వయంభువులై శ్రీమన్‌గారి సంపుటాల్లో దృశ్యశిల్పాలై అనుభూతి ప్రదంగా మన హృదయాల్ని లోగొం టాయి. 2009 డిశంబరు 31న రాత్రి తన పుట్టిన రోజును చేసుకున్నారు. 12 గంటల తరువాత విందుకు వచ్చిన కవి బృందాలను పలకరించు కున్నారు. అంతకు మునుపు తన కవితా సంపుటాలన్నిటిని ముద్రిం చుకున్నారు.

రసజ్ఞుల హృదయాలపై శాశ్వత కాలీన కవిత్వాలతో ముద్రలు వేసుకున్న కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ ఆనాడు వెలుతురు పిట్టై ఎగిరి పోయారు. ఎక్కడికో తెలియని 'చివరాఖరు' చోటికి.

అయితే ఎల్లరి రసజ్ఞ హృదయాల్లో కవిత్వరూపంలో శాశ్వతంగా వెలుగుతున్నారు ధ్రువనక్షత్రంగా.




**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష
గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు
విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.**

**పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి**

మధురాంతకం నరేంద్ర
9866243659

# తెలుగు ఛంఘిజ్ ఖాన్




**ప్రపంచస్థాయి కథలతో పోలిస్తే తెలుగు కథ యేమీ తీసిపోదనీ, ప్రపంచపు గొప్ప కథా రచయితలలో మనవాళ్ళైన తెలుగు కథకులు తప్పకుండా వుంటారనీ మన విమర్శకులూ, రచయితలూ అంటూ వుంటారు. "వెంటనే మన తెలుగు నవలల్లో మాత్రం అలా గొప్పదని చెప్పదగిన నవలెక్కడుందో చెప్పండి!" అని నిరుత్సాహంగా నోరు చప్పరించేస్తారు. వెంటనే "ఛంఘిజ్‌ఖాన్ వుంది గదండీ" అన్నాన్నేను యెన్నోసార్లు. చాలామంది, దాదాపుగా అందరూ "అది అనువాద నవలగదా" అనేస్తారు. "కాదండీ! అది తెలుగులో వచ్చిన అసలు నవలే!" అన్నానెన్నోసార్లు. చాలామంది ఆ మాటే అన్నప్పుడు వొక్కోసారి వాళ్ళు చెప్పిందే నిజమేనేమోనని సందేహపడిన సందర్భాలు కూడా లేకపోలేదు. మళ్ళీ వోసారి ఆ నవల పుటల్ని తెరిచి, రచయిత రాసిన ముందుమాటను మరింత జాగ్రత్తగా చదివిన తర్వాత, వాళ్ళు పొరబడ్డారని తెలిసి వచ్చేది. యిప్పటికీ చాలామంది పండితులూ, విమర్శకులూ 'చెంఘిజ్‌ఖాన్' అనువాద నవలేనని అనుకుంటూ వుంటారు. అలా రావలసినంత పరిగణన రాకపోయిన నవలగా, తెలుగు వాళ్ళు ఇది తమదీ అని చెప్పుకోడానికి గర్వపడవలసిన నవలగా, 'చెంఘిజ్‌ఖాన్' మిగిలిపోయింది. "ఛంఘిజ్ ఖాన్" అనే మంగోలియన్ వీరుడితో తెలుగువాళ్ళకెలాంటి చారిత్రక సంబంధమూ లేకపోవడమూ, అటువంటి వీరుడి గురించి తెలుగు వాడెందుకు నవల రాస్తాడు లెమ్మన్న నమ్మకమూ యీ అపోహకూ, యీ సాహిత్య విస్మరణకూ చాలావరకూ కారణాలుగావచ్చు.**

భారతదేశాన్ని ఆరేడు శతాబ్దాలపాటూ అప్రతిహతంగా పరిపాలించిన మొగలు వంశపు స్థాపకుడు బాబరు తన తండ్రివైపు నుంచి తైమూరు వంశానికీ, తల్లి వైపునుంచీ చెంఘిజ్‌ఖాన్ వంశానికీ చెందినవాడు. క్రీస్తు పూర్వం 3వ శతాబ్దిలో హూణులు మహా సామ్రాజ్యాన్ని స్థాపించిన మంగోలియాలో క్రీస్తుశకం 12, 13 శతాబ్దాల్లో గొప్ప శక్తిమంతమైన సైనిక శక్తిని తయారు చేసినవాడు చెంఘిజ్‌ఖాన్. "హూణుల గుర్రం నడచినచోట గడ్డి పరకైనా మొలకెత్తదు" అనే నానుడిని మళ్ళీ వెయ్యి సంవత్సరాల తర్వాత రుజువు చేసిన మహావీరుడు ఛెంఘిజ్‌ఖాన్.

"ఛెంఘిజ్ ఖాన్" అనే వ్యక్తిని గురించీ, అతడు సాగించిన పోరాటాలను గురించీ చరిత్రకారులు పరస్పర విరుద్ధమైన అంచనాలు వేశారు. పర్షియన్లు అతడ్ని "దేవుడిశాపంగా" భావించారు. అతడి చేతిలో బాగా దెబ్బతిన్న చైనావాళ్ళు అతనినొక విధ్వంసక శక్తిగానే గుర్తించారు. ఆఫ్ఘనిస్తాన్ వాళ్ళు దుర్మార్గుడని నమ్ముతారు. తనను సర్వ నాశనం చేసిన చంఘిజ్‌ఖాన్‌ను యిరానియన్లు నరహంతగా పేర్కొంటారు. ఛంఘిజ్‌ఖాన్ జీవితాన్ని గురించి రాసిన పాశ్చాత్య రచయితలందరూ ఛంఘిజ్‌ఖాన్‌ను దుర్మార్గుడనే చిత్రించాయి. యిక ఛంఘిజ్‌ఖాన్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని వచ్చిన హాలివుడ్ చిత్రాలన్నీ అతడ్ని దుయ్యబట్టటానికే పూనుకున్నాయి. ఛంఘిజ్‌ఖాన్‌ను కిరాతకుడుగా నిరూపించడం కోసం అతడికి తమ్ముడి వరసైన ""చమూగా"ను శాంతి కాముకుడిగా, గొప్ప మానవతా వాదిగా రూపొందించే ప్రయత్నాలూ జరిగాయి. ఇదంతా ఆసియా గడ్డ మీద కూడా వొక మహా పురుషుడు పుట్టాడని అంగీకరించలేకపోయిన "పాశ్చాత్య నాగరికుల" స్వభావాన్నే నిరూపిస్తోందని అంటారు. "ఛంఘిజ్‌ఖాన్" నవలను రాసిన తెన్నేటి సూరి (1911-1958).

కఠోరమైన సైనిక శాసనాల్ని అమలు జరిపి రాక్షసుడిలా వ్యవహరించితే, యే వ్యక్తి అయినా ప్రపంచాన్ని జయించవచ్చుననే తప్పుడు అభిప్రాయాన్ని జర్మన్ చరిత్రకారులు బలపర్చడంతో, దాని ప్రభావంతో హిట్లర్ అనే రాక్షసుడూ, వినాశకారుడూ పుట్టుకొచ్చాడు. 123 గుడిసెలు (డేరాలు) న్న బంజారీ తండా నాయకుడు ప్రపంచంలో ముప్పాతిక భాగం దాకా జయించి, మూడు శతాబ్దాలపాటూ స్వర్ణయుగాన్ని అనుభవించిన మహా సామ్రాజ్యాన్ని నిర్మించడానికీ–జాత్యహంకారంతో ప్రపంచంలోనంతా విధ్వంసం సృష్టించిన అహంకారానికీ మధ్య వుండే తేడా యేమిటో తెలుసుకోవడం చాలా అవసరం. బహుశా రెండవ ప్రపంచ యుద్ధపు విధ్వంసాన్ని స్వయంగా గమనించిన వ్యక్తి గావడంతో, తెన్నేటి సూరిగారిని "ఛంఘిజ్ ఖాన్" చరిత్ర ఆకర్షించినట్టుంది. ఛంఘిజ్ ఖాన్ గురించి చరిత్రలన్నీ చదివాక ఆయనకు హెన్రీ హెచ్ హోవర్తు దంపతులు రాసిన మంగోల్ చరిత్ర పుస్తకాల్లో నిజం దొరికిందనిపించింది. అందుకే ఆయన తన నవలను "మంగోల్ ప్రజల చరిత్ర ను సముద్ధరించడానికి తమ జీవిత సర్వస్వాన్నీ త్యాగం చేసిన హెన్రీ హెచ్ హోవర్తు దంపతులకు" అంకితం చేశాడు.

చరిత్ర అన్నదెప్పుడూ వివాదాస్పదంగానే వుంటుంది. "జయించిన వాళ్ళే చరిత్రను రాశారు" అన్నదాంట్లో అత్యుక్తి లేదు. అందుకే చరిత్రనెప్పుడూ వాళ్ళు విజేతల దృష్టిలోంచే రాస్తారు. చారిత్రక దృష్టీ, శాస్త్రీయ అధ్యయనాలు లేని మన భారతీయుల వంటి వాళ్ళ చరిత్ర విదేశీయుల చేతుల్లో యెన్ని అవస్థలు పడుతుందో చెప్పలేము. 16వ

శతాబ్దంలోని షేక్స్‌పియర్ చరిత్రను యింగ్లీషువాళ్ళెంత జాగ్రత్తగా పదిల పరచుకున్నారో చూసినప్పుడు దాదాపుగా షేక్స్‌పియర్‌కు సమకాలికుడైన పోతన జన్మస్థలం గురించి యిప్పటికీ వొక నిర్దుష్టమైన నిర్ణయానికి రాలేని మన స్వభావం స్పష్టంగా అర్థమవుతుంది. అన్ని చారిత్రక రుజువులున్న షేక్స్‌పియర్ గురించి యిప్పటికీ ఎన్నో అనుమానాలూ, వింత కథలూ ప్రచారంలో వున్నాయి. వొక వ్యక్తి ప్రసిద్ధుడైనప్పుడు, అతని చుట్టూ అనేక కథలు పుడుతూనే వుంటాయి. కాబట్టి చరిత్ర అనేదాంట్లో శాస్త్రీయతతో బాటూ కాల్పనికత గూడా తప్పకుండా చేరిపోతూనే వుంటుంది. "చరిత్ర నమోదు చేస్తుంది. సాహిత్యం సృజనను గావిస్తుంది" అనేది నిర్వచనం. అయితే యివి తారుమారయ్యే సందర్భాలను గుర్తు పట్టడమంత తేలిక గాదు.

చారిత్రక నవలల్లోని సత్యమెంత? సాహిత్య ప్రక్రియగా – నవలగా రూపొందించడానికోసం రచయిత ఆసత్యాల్లో యెంత కల్పనను జోడించాడు? – అనే ప్రశ్నలెప్పుడూ పాఠకుల్ని వెంటాడుతూనే వుంటాయి. అసలు చరిత్రకారుల చేతుల్లో ముఖ్యమైన వ్యక్తుల జీవితాలే స్పష్టాస్పష్టంగా రూపు దిద్దుకుంటున్నప్పుడు, అతని జీవితంతో ముడిబడిన మిగిలిన మనుషులు క్రీనీడల్లా, ఛాయా మాత్రాలుగానే దొరుకుతారు. వాటిలోకి రక్తమాంసాలను చేర్చి, వాళ్లను సజీవమైన పాత్రలుగా మలచడానికి రచయిత యెంతో కల్పనను జోడించక తప్పదు. అందుకే చరిత్రను భూమికగా తీసుకుని మానవ జీవన సందర్భాలను చిత్రిస్తున్నప్పుడు రచయిత చేయవలసిందీ, చేయగలిగిందీ – సామాజిక చలన సూత్రాలనూ, వ్యక్తుల స్వభావపు మూలాలను మాత్రమే! కేవలం వినోదమే ప్రధానంగా రూపొందే పుక్కిటి కథల్లాంటి జానపద సినిమాలకూ, చరిత్ర నాధారంగా తీసుకున్న చలన చిత్రాల మధ్య వుండే తేడా స్పష్టంగానే వుంటుంది. కొన్ని జానపద చిత్రాలు చారిత్రక సినిమాలకంటే సాధికారికంగానూ, కొన్ని చారిత్రక సినిమాలు జానపద చిత్రాలకంటే నేలబారుగానూ ఉంటాయి. చరిత్ర నాధారంగా చేసుకుని రాసే నవలల గొప్పతనాన్ని రచయిత సాహిత్య శిల్పమర్మజ్ఞతే నిరూపిస్తుంది.

"ఛంఘిజ్‌ఖాన్" నవలను బహుశా తెన్నేటి సూరి చార్లెస్ డికెన్సు "రెండు మహానగరాలు" ను అనువదించాకే రాసి వుంటారు. ఆ అనువాదం ఆయనకొక శిక్షణను సాధనను సమకూర్చినట్టుంది. స్థూలంగా 'ఛంఘిజ్‌ఖాన్' డికెన్సు "రెండు మహానగరాలు" శిల్పాన్నే అనుసరిస్తుంది. అయితే గొప్ప రచయితలు కేవలం ప్రభావం దగ్గరే ఆగిపోరు. దానికి తనదైన విశిష్ట వ్యక్తిత్వాన్ని అదనంగా చేకూరుస్తారు. డికెన్సు నవలను అత్యున్నత ప్రమాణాలకు చేర్చిన మహారచయిత. ఆయన నవలల్లో "రెండు మహానగరాలు" కు విశిష్టమైన స్థానముంది. రెండు మహానగరాలు (టేల్ ఆఫ్ టు సిటీస్) నవలలోని మొదటి అధ్యాయం అనితర సాధ్యమైన రచన. "ఇట్ వాస్ ది బెస్ట్ ఆఫ్ టైమ్స్, ఇట్ వాస్ ది వర్స్ట్ ఆఫ్ టైమ్స్..." అలా సాగే ఆ ప్రారంభాన్ని తెన్నేటి సూరి "అదొక మహోద్భుతమైన కాలం, అదొక దుర్భరమైన కాలం" అంటూ చేసిన అనువాదం మూల రచనకేమాత్రమూ తీసిపోదు. తెలుగుభాషతో ఆయనకక్కడ చేసిన సాధన " ఛంఘిజ్‌ఖాన్" నవలలో గొప్పగా విప్పారింది.

"జాజ్వల్యమానంగా నెగళ్ళు మండుతున్నాయ్.

ఆ జ్వాలా రేఖల్లో నిగనిగలాడే నల్లటి ఊలు పట్టాలతో దింపిన డేరాలు మిలమిలా, చలచలా మెరుస్తున్నాయ్".

– అంటూ ప్రారంభమవుతుంది నవల. ప్రతి సన్నివేశాన్నీ పాఠకుల మనస్సులో చలన చిత్రంలా నిలబడేట్టుగా సాగుతుంది తెన్నేటి సూరి రచన. భాషను తానెన్నుకున్న విషయానికనుగుణంగా ఆయన మలచుకున్న తీరు విశిష్టమైంది. భాష మాత్రమే తెలుగు. నవలా రచయిత మనకు తెలియని గోబీ బంజరు నేలలకు సారీ కీ హర్ మైదానాలకు, యెక్కా మంగోల్ యెడారులకూ తీసుకెళ్ళిపోతాడు. ఆటపాటలతో సాగే బంజారీల జీవితంలోపాట గూడా వుంది. ఆయా పాటల్ని రాసేటప్పుడు తెన్నేటి సూరిగారి పదలాలిత్యం అపూర్వంగా వుంటుంది.

మిసమిసలాడే
పసిరిక భూమిని
పాప పదుచు నీళ్ళాడిందీ
మైకం కమ్మే
పసరు వాసనల
మత్తిలి కన్నులు మూసిందీ –
గోబీ బంజరు కొండ కోనలో
గొప్పరాణి నీళ్ళాడిందీ
సారీ కీర్
మైదానంలో
జగజ్జెట్టి ఉదయించాడు.

"ఛంఘిజ్‌ఖాన్" అనేది నిజానికి అతడి బిరుదు. అతడి అసలు పేరు టెమూజిన్. అతడి తండ్రి యాసుకై భగత్తూర్. అతడి తల్లి యూలన్‌ను వేరే తెగనుంచీ యెత్తుకొచ్చి బలవంతంగా పెళ్ళి చేసుకున్నాడు. టెమూజిన్ వాళ్ళ ఆచారం ప్రకారం కుర్రాడిగా వున్నప్పుడే మరో తెగలో వుండే బుర్టీ అనే పిల్లతో ప్రధానం అయి, అత్తవారింట్లోనే వుండిపోతాడు. అప్పుడు తండ్రి యాసుకై విష ప్రయోగంలో చనిపోతాడు. అప్పటి నుండీ టెమూజిన్ జీవితం బాధామయమై గడుస్తుంది. తండ్రికి లోబడి వుండిన తండాలన్నీ అతడికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తాయి. అతడు దుర్భర దారిద్ర్యాన్నీ అనుభవించాల్సి వస్తుంది. వోసారి శత్రువులు బంధించి చంపేంత పని చేస్తారు. టెమూజిన్ అదృష్టవశాత్తు తప్పించుకుని పారిపోతాడు. క్రమంగా తన తండాకు నాయకుడౌతాడు. తన తండ్రికప్పుడు మిత్రుడైన చైనా చక్రవర్తి తుగ్రుఖ్‌ఖాన్‌తో చేతులు కలుపుతాడు, ప్రతిరోజూ పోరాటంగా జీవితం గడుపుతూ వస్తాడు.

"కురుల్తాయ్" అనే మంగోలు సభ అతడ్ని ఖాఖాన్ (చక్రవర్తి)గా యెన్నుకుంటుంది. రాజకీయాలనే చదరంగం ఆటలో యెత్తులకు పై యెత్తులు వేస్తూనే గొప్ప సామ్రాజ్యాన్ని తయారు చేస్తాడు.

స్థూలంగా ఛంఘిజ్‌ఖాన్ చరిత్ర అది. ఆ చరిత్రను నవలగా మలచడంలో సూరిగారి గొప్ప నైపుణ్యాన్ని గమనించవచ్చు. ప్రతి అధ్యాయం ఆసక్తిగా, చక్కగా సరిపోయే రీతిలో ప్రారంభమై గొప్ప

బడిలో–గుడిలో–ఏలుబడిలో తెలుగుకు సాధికారత కావాలి

ముగింపుతో ముగుస్తుంది. ప్రతి పాత్రా సజీవంగా, సహజంగా యెదుగుతుంది. ఛంఘిజ్‌ఖాన్‌ది ఇస్లాం మతం కాదు. అతడి మతం పేరు షామానిజ. భూతాలు, అభూత శక్తులూ బాగా ప్రచారంలో వుండే మూఢ నమ్మకాల జనం వాళ్ళు. "షామాన్" అనే మతాధికారి చేతుల్లో వాళ్ళంతా బందీలు. అటువంటి జనంలోంచీ పుట్టుకొచ్చిన చెంఘిజ్‌ఖాన్ జీవన ప్రస్థానం ఆశ్చర్యాన్నీ, అద్భుతాన్నీ కలిగిస్తుంది.

తండ్రి యాసుకై భగతూర్‌లోని మానవ జంతు స్వభావాలూ, తల్లి యూలన్ పరాధీనతా, మామ కరాచర్ మంత్రాంగమూ, షామాన్ మోసకారితనమూ, అండా (సోదరత్వం) చమూగా పైన టెమూజిన్‌కున్న అవ్యాజమైన ప్రేమా, తుగ్రుల్‌ఖాన్ కపట రాజనీతీ, భార్య బతికుండగానే ఆవిడ గోరీ మీద రాయడానికై కవిత్వం రాసే తైష్, భర్త నిరాదరణకు గురైన నిర్భాగ్యురాలు బైషీకామూన్...యెన్ని పాత్రలు? యెవరికివారే భిన్నమైనవాళ్ళు. ఛంఘిజ్‌ఖాన్ జీవితం మరో రకమైన మంగోలు భారతం.

నవలారంభంలోనే ఛంఘిజ్‌ఖాన్ చరిత్రలో వొక బౌద్ధ భిక్షువు దొరికాడు తెన్నేటి సూరికి. అతడికి ఆయన ధర్మపాల్ గుయుక్షీ అని పేరుపెట్టి గొప్ప మరపురాని పాత్రగా రూపొందించాడు. "నేను భారతదేశపు నదీ గడ్డమీద పుట్టాను కరాచర్! ధర్మ నిర్వహణ చెయ్యవలసి వచ్చినప్పుడు, ఫలితాన్ని లెక్క చేసే పద్ధతిని నా జాతి సంస్కృతిగా అంగీకరించదు" అంటాడు గుయుక్షీ.

"ఛంఘిజ్‌ఖాన్" నవలలో ప్రతి పాత్రకూ తనదైన వ్యక్తిత్వముంది. ప్రతి సంఘటనకూ మూల సూత్రంతో అనుసంధానముంది. ప్రతి సంఘటన నుంచీ చారిత్రకమైన సత్యంతోబాటూ గొప్ప సార్వకాలికమైన విలువనూ రచయిత ప్రతిపాదిస్తాడు. ప్రతి చిన్న భాగంలోనూ జిలుగు వెలుగుల్ని చెక్కే జపాను దేశపు చిత్రకారుల పనితనంతోబాటూ మొత్తం నవలకు బృహదీశ్వరాలయం వంటి శిల్ప పరిపుష్టిని సమకూర్చడమెలాగో తెలుసుకోవాలనుకునే వాళ్ళకు "ఛంఘిజ్‌ఖాన్" పాఠ్యగ్రంథంలా వుపకరిస్తుంది.

తనను దొంగతనంగా యెత్తుకు పోతున్నప్పుడు యేడుస్తున్న యూలన్‌తో "యెందుకు యేడుస్తున్నావ్? పిచ్చిదానా! ఊరుకో – అందమైన ఆడది బలవంతుని ఆస్తి – ఇది గోబీ యెడారి ధర్మం!" అంటాడు యాసుకై. ధర్మపాల్ గుయుక్షీని కిరాతకంగా షామాన్ చంపినప్పుడు "అమాయకుడైన గంగిగోవులాంటి ఒక మహా పురుషుణ్ణి పొట్టన పెట్టుకుంటున్నావ్ ఈ మహా కిరాతకానికి ఇంతకింతా యాతనా మరణాన్ని అనుభవిస్తావ్" అంటూ గొల్లుమంటాడు కరాచర్ యాసుకైతో. సింగ్‌పాల్ నగరంలో స్త్రీలను బానిసలుగా విక్రయిస్తున్న వర్తకులపై విరుచుకు పడ్డ టెమూజిన్ తమ్ముడు చమూగాతో "ఛీ! పక్షీ! ఏమిటలా వాగుతావ్! ఆడదాన్ని గుడ్డలూడదీసి నడి వీధిలో నిల్చోబెట్టడమేనట్రా – నీ సభ్యతలూ, నీ నాగరికతలూ, నీ కళలూనూ?" అని నిలదీస్తాడు. గీబీ బంజారు బంది పోటు దొంగ టెమూజిన్ బౌద్ధ గురువు ముందు మ్రోకరిల్లి "గోబీ బంజార్ల అంధకారం విచ్ఛిన్నం కావటానికి ఒక చిన్న దీప కళికను ప్రసాదించండి. మంగోల్ నాయకులు తమ వాంఛితాలను కత్తి పట్టి సాధించి వశం చేసుకోవడమే తప్ప, యాచించడం ఎన్నడూ యెరుగరు. మాలో ప్రథమ యాచకుణ్ణి నేనే! అంజలి ఘటించి యాచించుతున్నాను. గోబీకి విజ్ఞాన భిక్ష పెట్టించండి" అని కోరుకుంటాడు. యెత్తుకు పై యెత్తు వేసే తుగ్రుల్‌ఖాన్ తన కొడుకుతో "ఆరి వెర్రి వెధవాయ్! రాజకీయవాదికి ఆప్తులేవిట్రా?" అని నవ్వేస్తాడు.

"పీడన వల్ల అగ్ని పుడుతుంది; "ఛంఘిజ్‌ఖాన్" దుర్భరమైన ప్రజా పీడనలో అవతరించిన జ్వాలా రేఖ. విధ్వంసకరమైన జ్వాలా రేఖ ప్రభవించరాదనే వారు మానవ జగత్తులో భరించరాని ఈ ప్రజా పీడన యెందుకు వుండాలో సమాధానం చెప్పవలసి వుంటుంది" అంటూ నవలను ముగిస్తాడు తెన్నేటి సూరి.

1954 ప్రాంతాల్లో యీ నవల ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలో వారం వారం 'సశేష నవల'గా వెలువడుతున్నప్పుడు వొక మిత్రుడు సూరిగారిని "నువ్వు రాస్తున్నది ఛంఘిజ్ ఖాన్ జీవితమా లేక వారం వారం వెలువుడుతున్న వర్తమాన రాజకీయ వార్తల సమీక్షా?" అని అడిగారట. ఆయనకలా తోచటం న్యాయమే నంటారు రచయిత. 12, 13, శతాబ్దాలలో యేరకం కుళ్లు రాజకీయాలు ఆసియా ఖండంలో వ్యాపించి, ఛంఘిజ్‌ఖాన్ అనే శక్తి ప్రభవించడానికి కారణమయ్యాయో, అవే రకం కుళ్ళు రాజకీయాలు నేడు ప్రపంచమంతటా వ్యాపించి వున్నాయ్. నిజంగా యీ విషయాన్ని గమనించితే, చరిత్ర పుటలు వెనక్కు తిరగబడుతున్నాయా" అని ఆశ్చర్యం కలుగుతుంది" అన్నారు సూరి 1954లోనే.

"ఛంఘిజ్‌ఖాన్ నా ఆదర్శ వీరుడు" అన్న జవహర్‌లాల్ నెహ్రూ తన "ప్రపంచ చరిత్ర సమగ్రావలోకనం" (గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ) లో "చరిత్రలో ఛంఘిజ్ ఖాన్ నిస్సందేహంగా గొప్ప సైన్యాధిపతి. అలెగ్జాండరూ, సీజరూ అతడితో పోలిస్తే చాలా తక్కువ రకం సైన్యాధ్యక్షులు" అని కూడా అంటారు.

"ఈ రచనకు కావల్సిన రాజకీయ, నైసర్గిక, సాంస్కృతికాది విషయ సంచయాన్ని సేకరించుకొనడంలో నేను చేసిన పరిశ్రమను, తెర వెనుక పడే కష్ట నిష్ఠూరాలను గమనించవలసిన అవసరం సామాన్య పాఠకునకు లేకపోయినా, రచనలో తనను లగ్నమానసుణ్ణి చేస్తున్నది ఈ పరిశ్రమేనన్న విషయాన్ని ఒక దాన్ని గుర్తించితే అంత వరకు చాలు" అంటారు తెన్నేటి సూరి. తన ముందు మాటలో వినయంగా.

**వస్తువులో విదేశీయమైనా, నవలగా సర్వమానవాళికీ అవసరమైన, ఆత్మీయమైన నవల 'ఛంఘిజ్‌ఖాన్'. నవలారచనకు కావల్సిన అన్ని సాంకేతి కాంశాలలోనూ పరిపుష్టమై తెలుగు వాళ్ళు తమదని ఆత్మ విశ్వాసంతో ప్రపంచానికి పరిచయం చేయవలసిన నవల యిది. అన్ని యితర భాషల్లోకీ అనువాదం చేయవలసిన గొప్ప అంతర్జాతీయ నవల. 1954 ప్రాంతాల్లో యింత గొప్ప నవల వెలువడ్డానికుండిన గొప్ప సాహిత్య జీవితమూ, నాగరికతా, పఠనాశక్తీ, యిప్పుడింత ఘోరంగా పతనం కావడానికి కారణాలేమిటో యిప్పటికైనా గుర్తించాలి! అదే తెన్నేటి సూరి వంటి ప్రపంచ స్థాయి మహా నవలాకారుడికిప్పుడు మనమివ్వగలిగిన నివాళి.**

తెలుగులో రాయలేని, రాయని అధికార్లను నిలదీయండి



Unfiled Notes Page 33

చలసాని నరేంద్ర
9849569050

# అందకుండాపోతున్న గృహవసతి





అభివృద్ధి లక్ష్యాలలో ప్రజలు అందరికి అందుబాటులో సొంత ఇల్లు సమకూర్చుకొనే సదుపాయం కల్పించడం కీలకమని ఐక్యరాజ్య సమితి ఎప్పుడో గుర్తించింది. ప్రపంచంలో సుమారు 100 కోట్ల మంది ప్రజలు మురికి వాడలలో నివసిస్తున్నారు. 160 కోట్ల మంది ప్రజలకు సౌకర్యవంతమైన గృహ వసతి లేదు. వీరందరికి అనువైన గృహ వసతి కల్పించడం కోసం అంతర్జాతీయ సంస్థలు, జాతీయ ప్రభుత్వాలు ఎన్ని పథకాలు, కార్యక్రమాలు రూపొందిస్తున్నా లక్ష్య సాధనలో వెనుకబడి పోతున్నారు. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా నగరాలలో గృహ వసతి దుర్భరంగా మారుతున్నది.

మన ప్రధాన మంత్రి సహితం 2022 నాటికి దేశంలో ప్రజలు అందరికి సొంత ఇల్లు ఉండే విధంగా ఉండాలని భారీ ప్రణాళికలకు రూపకల్పన జరిపారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా దేశంలో వివిధ పథకాల ద్వారా ముఖ్యంగా పేదలకు గృహ వసతి కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. దేశంలోనే మొదటగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం పేదలకు గుడిసెలు నిర్మించే 'ఉచిత గృహం' కార్యక్రమానికి అంకురార్పణ జరిపారు. అప్పటి నుండి ఇప్పటికే తెలంగాణలో చంద్రశేఖరరావు ప్రభుత్వం పేదలకు రెండు పడకల ఇళ్ళు నిర్మించే వరకు దేశ వ్యాప్తంగా పలు పథకాలు అమలులోకి వస్తున్నాయి.

మరోవంక బ్యాంకులు ఎంతో ఉదారంగా గృహ నిర్మాణానికి రుణాలు ఇస్తున్నాయి. ఎన్ని ప్రయత్నాలు జరుగుతున్నా అందరికి గృహం అత్యాశగానే మిగులుతున్నది. రాను రాను సామాన్యుడు సొంత ఇల్లు సమకూర్చుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వం భారీ స్థాయిలో నిర్మిస్తున్న గృహాల నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. పైగా లబ్ధిదారుల విషయంలో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. బినామీ పేర్లతో అధికార పక్షానికి చెందిన ఒకరే పలు ఇళ్లను కైవసం చేసుకోవడం కూడా జరుగుతున్నది.

ఇప్పుడు పట్టణాలలో ఇళ్ల అద్దెలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. అందుకు సహేతుకమైన కారణాలు కనిపించడం లేదు.

**దేశంలోఆర్ధిక వృద్ధి రేటును మించి ఇళ్ల స్థలాలు, ఫ్లాట్ ల ధరలతో పాటు అద్దెలు ఎందుకు పెరుగుతున్నాయి ? ప్రతి సంవత్సరం ఇళ్ల ధరలు పెరిగి పోతూ ఉంటే మధ్య తరగతి ప్రజలు కూడా కొనుక్కోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాలలో సహితం కోటీశ్వరులు కూడా సొంత ఇల్లు కొనుక్కోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. అంటే నేటి యువతరం భవిష్యత్ లో సొంత ఇంటి కలను నెరవేర్చు కోవడం దాదాపు దుర్లభంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.**

ఎక్కడైనా ఒక అభివృద్ధి ప్రణాళిక అమలులోకి వస్తున్నా, ఒక పరిశ్రమ గాని, నూతన రహదారి గాని, ఒక సంస్థ గాని వస్తున్నది అంటే ముందుగా ఆయా ప్రాంతాలలో భూముల ధరలు పెరిగి పోవడం, ఇళ్ల అద్దెలు పెరిగి పోవడం జరుగుతున్నది. 1952లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు రాజధానిగా ఉన్న కర్నూలులో అద్దెలు పెరగకుండా నాటి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక చట్టం తీసుకు వచ్చింది. కానీ ఇప్పుడు రాజధాని నగరంగా అమరావతిని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తూ ఉంటే అద్దెల నియంత్రణకు ఎటువంటి ప్రయత్నం చేయటమే లేదు.

ఇళ్ల ధరలు పెరగడానికి రెండు అంశాలు ప్రధానంగా కారణం అవుతూ ఉంటాయి. మొదటిది భూమి ధర, రెండొవది నిర్మాణ వ్యయం. గత పలు సంవత్సరాలుగా దేశంలో ద్రవ్యోల్బణంకు మించి నిర్మాణ వ్యయం పెరగడం లేదు. అంటే నిర్మాణ వ్యయంలో పెరుగుదల మధ్య తరగతి ప్రజలు భరించలేనంతగా ఉండవలసిన అవసరం లేదు. స్టీల్, సిమెంట్ వంటి వాటి ధరలు పెరుగుతున్నా సాంకేతికంగా వస్తున్న మార్పులతో నిర్మాణ వ్యయం మొత్తం మీద తగ్గవలసిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మరిన్ని అత్యాధునిక సదుపాయాల కోసం హెచ్చు మొత్తం ఖర్చు పెట్టవలసి రావచ్చు. అది వేరే విషయం.

ఇళ్ల ధరలు విపరీతంగా పెరగడానికి పెరుగుతున్న భూమి ధరలే ప్రధాన కారణం అని గమనించాలి. దేశంలో పెరుగుతున్న జనాభాతో పాటు భూమి వైశాల్యం పెరిగే అవకాశం లేనందున ఆ విధంగా పెరగడం

సాధారణమే అని సర్దిచెప్పుకోవచ్చు. అయితే ఇళ్ల నిర్మాణం కోసం అవసరమైన భూమి చాలా స్వల్పం. వ్యవసాయం, పరిశ్రమలు, పలు ఇతర ప్రజా ప్రయోజనం పేరుతో జరిపే నిర్మాణాలతో పోల్చితే గృహావసరాల కోసం అవసరమైన భూమి స్వల్పమే గదా.

ఇప్పుడు ఉత్పత్తి రంగం కూడా సాంకేతికంగా పెను మార్పులకు గురవుతూ ఉండడంతో పెద్ద పెద్ద నగరాలలో కాకుండా తక్కువ ధరకు భూమి లభించే ప్రదేశాలలో అక్కడనే చిన్న చిన్న నగరాలను అభివృద్ధి చేసుకొంటూ వెలుస్తున్నాయి. దానితో అభివృద్ధి భారీ నగరాల నుండి చిన్న చిన్న పట్టణాల వైపుకు మరలుతున్నది. అయితే ఉత్పత్తి రంగంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి. సేవల రంగంలో పెరుగుతూ ఉండడంతో పెద్ద నగరాలలో జనాభా గణనీయంగా పెరుగుతూ భూమిపై వత్తిడి పెంచుతున్నది.

ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకొని స్థిరాస్తి వ్యాపారులు ఒక నేరమయమైన బృందంగా మారుతూ సాధారణ ప్రజలను పిండి పిప్పి చేస్తున్నారు. వడ్డీ వ్యాపారుల తర్వాత సాధారణ ప్రజలను విపరీతంగా దోపిడీకి గురిచేస్తున్నది స్థిరాస్తి వ్యాపారులే అని చెప్పవచ్చు. నాణ్యత పట్ల శ్రద్ధ చూపకుండా, నగరాల్లో ఇళ్ల ధరలు విపరీతంగా పెరిగిపోవడానికి కారణం అవుతున్నారు. అందుకనే స్థిరాస్తి వ్యాపారం కూడా నేడు ఒక భారీ పరిశ్రమగా మారుతున్నది. మూడు దశాబ్దాల క్రితం ఇటువంటి పరిస్థితులు లేవని చెప్పవచ్చు.

నేడు ప్రభుత్వమే ఒక స్థిరాస్తి వ్యాపారిగా మారుతున్నది. ప్రభుత్వం ఏ కొత్త పథకం చేపట్టినా ముందుగా ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తులు ఆ ప్రాంతంలోని భూములను కారుచవుక ధరలలో కొనివేసి, ఆ తర్వాత **వారే వాటిని పలు రేట్ల ధరలకు అమ్మి విపరీతంగా సంపాదిస్తున్నారు. ఇటువంటి వ్యక్తులు రాజకీయాలలో కూడా ప్రవేశించి పార్టీలను, ప్రభుత్వాలను శాసిస్తున్నారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతూ, మంత్రులుగా కూడా వెలగపెడుతున్నారు.**

**నేడు నగర ప్రాంతాలలో పలు నేరాలకు సహితం స్థిరాస్తి వ్యాపారులే కేంద్రంగా ఉంటున్నారు. చాలా అసాంఘిక కార్యక్రమాలకు నేతృత్వం వహిస్తున్నారు. ప్రజాజీవనంలో అంతులేని అవినీతిని ప్రోత్సహిస్తున్నారు. నగరాలలో పెరుగుతున్న నేర సంస్కృతికి ఒక విధంగా వీరు కేంద్ర బిందువుగా మారుతున్నారు. ఇది ఆందోళన కలిగించే పరిణామం అని చెప్పక తప్పదు.**

అమరావతి పేరుతో ఇటువంటి వ్యాపారమే జరుగుతున్నది. రైతుల నుండి 35 వేల ఎకరాలను సేకరించి, ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రైతులు తమ వంతు వచ్చిన భూములను అభివృద్ధి చేసుకొనే అవకాశం ఇవ్వకుండా, ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు తన భూములను కట్టబెడుతూ అక్కడ స్థిరాస్తి వ్యాపారానికి విశేషమైన ప్రాధాన్యత ఇస్తున్నది. దేశంలో అన్ని ప్రభుత్వాలు దాదాపుగా ఇదే విధంగా ఏదో ఒక రూపంలో చేస్తున్నాయి.

దేశంలో నల్లధనం పోగవడానికి స్థిరాస్తి వ్యాపారం ఒక ప్రధాన కారణం అని చెప్పవచ్చు. వారి వ్యాపారాన్ని కట్టడి చేయడం కోసం ఇప్పుడొక చట్టం తీసుకు వచ్చినా ఆ చట్టంలో కూడా పలు లోపాలు ఉన్నాయి. ముఖ్యంగా నగరాల అభివృద్ధికి నిర్దుష్టమైన ప్రణాళిక, యోజన ప్రభుత్వాలలో లోపిస్తుంది. ప్రతి నగరంలో ప్రమాణాలను ధిక్కరించి నిర్మాణాలు చేస్తూ ఉండటం, తర్వాత వాటిని కొనుక్కున్న వారి నుండి భారీ జరిమానాలు వసూలు చేసి వాటిని క్రమబద్ధీకరించడం ఒక తమాషాగా మారుతున్నది.

ఇప్పుడు సేవల రంగంలో ఉద్యోగ అవకాశాలు సహితం పెద్ద పెద్ద నగరాలకు కేంద్రీకృతం అవుతూ ఉండడంతో అందుబాటులో గృహాలు లభించే చిన్న చిన్న పట్టణాలలో కొనలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. నిర్దుష్టమైన గృహ నిర్మాణ విధానాలను ఏ ప్రభుత్వమూ అమలు పరచడం లేదు. **నేడు రాజకీయాలను స్థిరాస్తి వ్యాపారులు శాసించే పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు అన్ని రాజకీయ పార్టీలలో వారు పెత్తనం చేస్తున్నారు. దానితో వారిని నియంత్రించే సాహసం ఎవ్వరూ చేయడం లేదు.**

ప్రభుత్వ యంత్రాంగం కూడా వారి ముందు సాగిల పడుతున్నది. నిబంధనలు అతిక్రమించిన వారికి జైలు శిక్ష లేకపోవడం, పైగా అటువంటి అక్రమాలకు సహకరించిన అధికారులకు ఎటువంటి శిక్షలు లేకపోవడంతో ఎవ్వరికీ చట్టాల పట్ల భయం ఉండటం లేదు. ప్రజలు అందరూ చూస్తూ ఉండగానే అక్రమంగా నిర్మాణాలు జరుగుతూ ఉంటే ఎవ్వరూ పట్టించుకోకుండా రెండు, మూడేళ్లు అయిన తర్వాత ఇళ్లను కొనుక్కొనే వారిని నిబంధనలు అతిక్రమించారని వేధింపులకు గురి చేయడం నేడు జరుగుతున్నది.

ఏది ఏమైనా అందరికీ గృహాలు నిర్మించి ఇవ్వడం ప్రభుత్వాలకు సాధ్యం కాదు. ఒక వేళ నిర్మించి ఇచ్చినా వాటి నాణ్యత అధ్వాన్నంగా ఉండవలసిందే. నిర్మాణంలో ఎన్ని కుంభకోణాలు జరుగుతూ ఉంటాయో వేరే చెప్పవలసిన అవసరం లేదు. సామాన్యులు సహితం ఇళ్లను నిర్మించుకొనే విధంగా, భూముల ధరలు కృత్రిమముగా పెరగకుండా నిర్దుష్టమైన చర్యలు తీసుకోవాలి. అందుకు స్పష్టమైన ప్రణాళికాయుతమైన కార్యాచరణ అవసరం.

"ఇల్లు కట్టి చూడు - పెళ్లి చేసి చూడు" అని అంటారు. అంటే ఈ రెండూ చాల శ్రమతో కూడుకున్న వ్యవహారాలు. ఈ రెండింటి విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకో వలసిన అవసరాలు ఉంటాయి. స్థిరాస్తి వ్యాపారులు నిర్మిస్తున్న గృహాలలో చాలావరకు 'పైన పటారం - లోపల అన్నీ లొసుగులు' వలే ఉంటున్నాయి. అత్యధిక ధరలకు అమ్ముతూనే నాసిరకపు నిర్మాణాలు చాలావరకు జరుగుతున్నాయి. నిర్మాణ నాణ్యతలకు ఎటువంటి హామీ ఉండటం లేదు. ఇది మరోరకంగా ఘరానా మోసంగా మారుతున్నది.


# సీబీఎస్ఈ ఫారాల్లో తెలుగు మాయం

పదవ తరగతి, పెన్నెండవ తరగతి పరీక్షలకు అభ్యర్థన చేసుకునే పత్రాల్లో సీబీఎస్ఈ తెలుగును విస్మరించింది. విద్యార్థి మాతృభాషకు ఉండే గడిని కూడా తొలగించింది.

గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే

కథానిక

# పెద్ద రగస్యం

సిహెచ్. భాగ్యలక్ష్మి
96869 03386

ఎక్కడెక్కడి నుండో భక్తులు స్వామి దర్శనం చేసుకుని ఎప్పుడు ఆ భగవంతుడు అవహిస్తాడా అని ఎదురుచూస్తూ ఉంటారు. కానీ ఆ భాగ్యం నూటికో కోటికో అదీ పరమ భక్తులకు తప్ప కలగదు. అలాంటిది మీరు మొదటిసారి కలిసి స్వామి చెవిలో ఏదో చెప్పగానే స్వామికి భగవంతుడు ఆవహించినాడు.. మీరెవరో మహా సిద్ధులు మాదిరిగా ఉన్నారు.
కొంచెం నాకు మంత్రోపదేశం చేయండి అని అడిగినాడు.



సిన్నప్పటి నుంచి మా సిన్నమ్మ ఒరే ఒక్క తూరన్నా మా ఇంటికోచ్చిపోరా అంటాన్యాది. నాదేమో కడప.

వాల్లూరేమో అనంతపురం మూలాన ఆడాడ్నే ఉండాది. ఇన్నేండ్లకు ఇప్పుడు కుదిరినాది. కాదు కాదు ఇన్నాళ్లకు సిన్నాయన కొత్తిల్లు కట్టుకున్నాడు సూసి రాపో అని నాయన సెప్తే నాకు ఇప్పటికి కుదిరిచ్చుకోవాల్సి వచ్చినాది.

పల్లె అయినా మా ఊరికంటే పెద్దదే. ఊర్లో ఏందో పెద్ద పూజ ఉన్నట్టుండాది...పెద్ద పెద్ద హోర్డింగులు, బోర్డులు అగుపిచ్చా న్దాయ్... ఎవరో మోహనానంద సామంట- సిన్నాయన సెప్పినాడు ఇయ్యాల ఆయప్ప పుట్టిన్రోజంట.

సుట్టుపక్కల పల్లెల్లో ఆ సామికి బాగా పేరంట. యానాడో అమావాస్సకో పున్నానికో ఆయప్పకు దేవుడు పూన్తాడంట. అప్పుడు ఏంగావాల్నో కోరుకుంటే అయ్యి శానామటుకు అయితాయంట అని సిన్నాయన సెప్పుకుంటా పోయినాడు.

ఇంటికి పోతానే గబగబా నీళ్లు పోస్కోని ఇంత మెక్కి మనమూ ఓ తూరి సూసొద్దామని పోయినా. మొహం, గీత, సంసారం, భగవంతుడు అని ఆ సామి ఏదేదో సెప్తా ఉండాడు.

కొంచెం దగ్గరికి పోయి సూసినా... ఓర్నీ-ఈడు మోహనానంద సామి గాదు, మట్టి పెల్ల గాదు-ఉండూరోడే...

ఎల్లమ్మగారి మోహన్ గాడు... ఆరేండ్ల నుండి ఈడు ఊర్లో లేకున్నింటే అందరూ బెంగళూరు పోయి దోశల అంగడి పెట్టుకున్నారు అని అనుకున్టాంటాన్యారు...ఈడేమో సామీజీ అయి ఈడ తేల్నాడు.. ఒరేరే మొహనా, యాడ్నుంచి యాడికి పోయినావురా అని అనుకున్యా.

ఈడు మా పిల్ల గ్యాంగు మొత్తంలోనే పాపరోడు అని అంతా అనుకున్టాన్యారు... ఊర్లో ఈన్ని కొట్టని మొగోడు లేడు, తిట్టని ఆడమనిసి లేదు.

ఓ తూరి మా సేలో బోరు ఏచ్చాన్దారని మా నాయనకు, కూలోల్లకు సద్ది ఇజ్జామని పోతా ఉన్య. వంక కాడ ఎదురూరు రమాదేయక్క ఈ ఎల్లమ్మగారి మోహన్ గాడు అగుపిచ్చినారు. రమాదేయక్కది మా ఊరిపక్కనే ఉండే ఎదురూరు. మా ఊర్లో గునక ఒక రమా దేయి ఉండాది గాబట్టి ఆయక్కను అంతా ఎదురూరు రమాదేయ్ అని పిలుచ్చాంటారు. మేము ఎమ్డో తర్గతి సదువుతాన్యప్పుడు రమాదేయక్క పదో తర్గతి.

నేనాడికి వొచ్చాల్కు రమాదేయక్క సెరువుకట్ట గంగమ్మ మాదిరి ఈ మోహనుగాడి మీద ఉరుముతాన్యాది ...

నన్ను సూసి, సూడరా రాజేసు ఈ ముండనాకొడకు.. పెద్దంతరం సిన్నంతరం లేకుండా...ఆయమ్మి సుజాత మొహం సూసి ఇడుచ్చాండా ఈన్ని.. లేకున్యింటేనా డొక్క సీల్సి డోలు కట్టిన్నిన్దును.. రేయ్ రాజేసు ఇంగోతూరి ఈడు నాయమ్మడి పడినాడంటే మెట్టుతీస్కోని మెరవణి జేచ్చానంజెప్పు అని నా ముందే మా మోహన్ గాడి సెంప పగలగొట్టిపోయినాది. ఆయక్క ఎనుములు కాయనీకి వచ్చినట్టున్దాది.. యీ డేమి వాగింటాడో, ఆయక్క ఈడి సెంప ఎందుకు పగలగొట్టింటాదో ఆడి గురించి ఎరుకుండేవాళ్లకు ఎవురికైనా తెలిసి పోతాది...

మావోడు ఉరేయ్ ఇదెవ్వరికీ సేప్పొద్దు అని నా కాడ్నించి ఒట్టు ఏయిచ్చుకున్యాడు.. అప్పటాంచి ఎదురూరు రమాదేయక్క యాడ కనపడ్యా ఈడికి ఒంటేలే.. ఆయక్క జోలికి



## తెలుగు భాషా వికాసంతోనే తెలుగు సాహిత్య వికాసం

'పిల్లలను తెలుగును నేర్చుకోనివ్వకుండా, సాహిత్యం చదివేవాళ్ళు తగ్గిపోతున్నారని కన్నీరు కారిస్తే వుపయోగం లేదు' అని తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు, డా॥ సామల రమేష్ బాబు కవులను, రచయితలను ఉద్దేశించి, నెల్లూరులో జరిగిన సభలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ అన్నారు. కవి గుర్రాల రమణయ్యగారు నవంబరు 11న నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'తెలుగు సాహిత్యం – భాష' అనే అంశంపై సభను నిర్వహించారు.

విద్యారంగంలో తెలుగును బోధనాభాషగా రక్షించుకోవాలని, కేవలం ఒక సబ్జెక్టుగా తెలుగును ఏదో 'తూతూ మంత్రం'గా నేర్పితే సరిపోతుందని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల నేతలు భావిస్తున్నారని, ఇది జాతిని నాశనం చేసే కుట్ర అని మనం తెలుసుకోవాలని అన్నారు. తెలుగును రక్షించుకొని, పాలనలో, విద్యలో తెలుగును పూర్తిగా వినియోగంలోకి తెస్తేనే తెలుగుకు వికాసం ఉంటుందని, అప్పుడే తెలుగు సాహిత్యం కూడా వికసిస్తుందని – ఈ వాస్తవాన్ని కవులు, రచయితలు గ్రహించి, తమ రచనల్లో ప్రచారం చెయ్యాలని డా॥ రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు.

సభలో విశిష్ట అతిథిగా శ్రీ గుదిబండి వెంకటరెడ్డి (హైదరాబాదు), నెల్లూరు జిల్లా తెలుగు భాషోద్యమ సమితి గౌరవ అధ్యక్షులు శ్రీ చలంచర్ల భాస్కరరెడ్డి, తెలుగు భాషోద్యమ సేవా సమితి అధ్యక్షులు ఆచార్య ఆదిత్య, కవి – రచయిత శ్రీ బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, డా॥ జి. మురళీధర్ సభలో ప్రసంగించారు. తర్వాత కవి సమ్మేళనం గుర్రాల రమణయ్యగారి ఆధ్వర్యంలోజరిగింది.

పోల్య గానీ బుద్ధి మాతరం మార్లె మోహను గాడిది...ఏమైపోతాడ్రా ఈడు అనుకుంటాన్యారు ఊర్లో అంతా. బెంగళూరులో దోశల అంగడి పెట్టుకున్యాడు అని అంటాంటే పోనిలే యాడ్నోసాట బతుకుతాన్నాడు అనుకు న్యారు...సూచ్చే ఈడ తేల్యాడు సెప్పేది అయిపోయినాంక పొయ్యి కలుజ్జామనుకున్యా...

వాకిలికాడ ఉండే ఆయప్పతో, స్నోవ్ కొంచెం మా మోహన్ ని కల్సాల్ల లోపలికి పోయ్యేదా అని అడిగినా.. ఆయప్ప నన్ను ఇట్టా సూసి, స్వామీ ఆశ్రమంలో మగవారిని స్వామీ అని ఆడవారిని శక్తీ అని పిలవాల్ల అని నాకు క్లాసు పీకి ఇంతకీ మీరు స్వామికి ఏమవుతారు అని అడిగినాడు...ఏం ల్యా న్నా.. హ్మ్ హ్మ్.. ఏం ల్యా సామీ.. ఆయప్పది మా ఊరే.. బాగా తెలిసినోడే అన్యా.. అప్పుడాయప్ప, స్వామీజీకి ఐహిక జీవితము ఏమి గుర్తులేదు.. కనుక ఆయన మిమ్మల్ని కనుక్కోలేరు అని సెప్పినాడు.

అట్నా సామీ.. అమెరికాలో పంజేసే మా వాడొకడు సామి ప్రవచనాలు అమెరికాలో పెట్టియాలనుకున్యాడే.. పోస్లే సామి ఆడికి అది కుదర్దని సెప్తా అన్య.. ఏమనుకున్యాడో ఏమో ఆ వాకిలికాడి సామి.. వెళ్లి కలవండి అని లోపలికి అంపిచ్చినాడు.

లోపలి పోయినా... ఇటువల్ల ఒక సామి అటువల్ల ఒక సామి ఇసనకర్రతో మోహనుకు, అదే అదే మోహనానంద సామికి ఇసురుతా ఉన్నారు. నన్ను సూసి కూకో అన్యట్టు సైగ జేసి నాడు.. నిజంగానే ముందుది అంతా మతికి లేదా లేక కతలు పడ్తాన్నాడా అనేది అర్థం కాల్యా... ఎదురుగా ఉండే పీట మీద కూకొని, కొంచెం ముందుకు వంగి, సిన్నగా ఆయప్పకు మాత్రమే ఇనిపిచ్చే మాదిరి సామి మిమ్మల్ని సూన్నీకి ఎదురూరు రమదేయి వచ్చిన్నాది అని అన్యా....

అంతే వాయి, పచ్చవాతం ఒకేతూరి ఒచ్చినట్టు కాళ్లు సేతులు బిగిచ్చుకొని గిల గిలా ఊగిపోయిన్నాడు...ఈవల్ల సామి ఆవల్ల సామి శాంతి శాంతి అని యావో మంత్రాలు సదువుతా...స్వామి ఒళ్లోకి దేవుడు వచ్చాడు. కావాల్సిన కోరిక కోరుకుని త్వరగా బయటకు వెళ్ళండి అన్యారు. నేను అచ్చే నవ్వు ఆపుకుంటా బయటకోచ్చాన్యా ...

అప్పుడే ఆవల్ల ఇసురుతాన్య సామి బెరబెరా వచ్చి...

సామి ఈ స్వామి వద్ద నాలుగేళ్ల నుండి శిష్యునిగా ఉన్నాను.

ఎక్కడెక్కడి నుండో భక్తులు స్వామి దర్శనం చేసుకుని ఎప్పుడు ఆ భగవంతుడు అవహిస్తాడా అని ఎదురుచూస్తూ ఉంటారు. కానీ ఆ భాగ్యం నూటికో కోటికో అదీ పరమ భక్తులకు తప్ప కలగదు. అలాంటిది మీరు మొదటిసారి కలిసి స్వామి చెవిలో ఏదో చెప్పగానే స్వామికి భగవంతుడు ఆవహించినాడు.. మీరెవరో మహా సిద్ధులు మాదిరిగా ఉన్నారు. కొంచెం నాకు మంత్రోపదేశం చేయండి అని అడిగినాడు.

దానికేం బాగ్యం సామి, 'ఎదురూరు రమాదేయ్' అనే మహామంత్రం ఆ సామికి సెప్తే నీకు గునక దేవుడు అగుపిచ్చాడు అని లోపల అనుకుని...వచ్చాండే నవ్వును ఆపుకుంటా, అది పెద్ద రగస్యం సామి అని అన్నుంచి బయట పన్యా...

కీ.శే. దుర్గానంద్

# శబ్దగాండీవి వేమన-5



(నవంబరు సంచిక తరువాయి)

అసలు వర్ణమంటే ఏమిటి? చాతుర్వర్ణ్యం మయాసృష్టం' అని ఆర్యోక్తి నుడివినా వర్ణాలు మొట్టమొదట నాలుగు కాదు రెండే ఉండేవి అని నా అభిప్రాయం. వర్ణము అంటే రంగు. మనిషి ఒంటి రంగును బట్టి కులం నిర్ణయిం చేవారు. తెల్లగా ఉండే వాళ్లు ఒక వర్ణం, నల్లగా ఉండేవాళ్లు ఒక వర్ణం. ఎండల్లో ఎండి, వానల్లో నాని, పని పాటలు చేసుకునే వాళ్లు నల్లగా ఉంటారు గాబట్టి వాళ్లు ఒక వర్ణంగానూ, ఇంటి పట్టున నీడన ఉండే వాళ్లు తెల్లగా ఉంటారు గాబట్టి ఒక వర్ణంగానూ లెక్కింప బడ్డారు. ఒంటి రంగు పుట్టుకతో వచ్చేది కాదు. కర్మ వల్ల వచ్చేది. ఒకే వర్ణము వారు తరతరాలుగా పని పాటలు చేస్తూ ఉండటం వాళ్ల శరీరం నలుపుకు తిరిగి ఉంటుంది. ఇది వాళ్ల కష్ట జీవితానికి ప్రతీక. ఒకే వర్ణం కలిగి ఒకే వృత్తిలో ఉన్నవాళ్ళ గుణ స్వభావాలు ఒకటిగానే ఉంటాయి గాబట్టి కర్మతో గుర్తింపబడ్డ వాళ్లు గుణంతోనూ గుర్తింపబడుతూ వచ్చారు. అందువల్లే గుణ కర్మ విభాగశః అన్నారు. ఇది రానురాను పుట్టుక పరమై పోయింది. ఇప్పుడు వర్ణాలు రెండు కాదు గదా నాలుగయి నలభై అయి ఇంకా వందలు వందలుగా విస్తరించి నాయి. దేశం దృష్టిలో ఇన్ని ఉన్నా ప్రపంచం దృష్టిలో రెండే ఉన్నాయి. తెల్లని చర్మం గల యూరోపియన్లు అందరూ ఒక వర్ణం క్రిందకు వస్తారు. నల్లని నీగ్రోలూ, ఆసియా వాసులూ ఒక వర్ణం క్రిందకు వస్తారు. కాశ్యపి అంటే భూమి, కశ్యప ప్రజాపతి భార్య. కశ్యప ప్రజా పతికి ఇద్దరు భార్యలుండే వాళ్ళు. ఒక భార్య ఐరోపా ఖండం. రెండవ భార్య ఆసియా ఖండం. ఒకావిడ పశ్చిమ దేశీయ, రెండో ఆవిడ పూర్వ దేశీయ. పశ్చిమ దేశీయే అదితి. పూర్వ దేశీయ దితి. దితి సుతులు దైత్యులు, రాక్షసులు. వీళ్లను పూర్వ దేవులు అన్నారు. అంటే నీగ్రో వాళ్ళూ మనమూ రాక్షసులమన్నమాట. అసలు దేశవాళీ అదివాసులం. మనల్ను తరిమి అదితి సుతులు ఆదిత్యులు-పాశ్చాత్యులు వచ్చారు. మన దేశంతోనే గాదు ప్రపంచంలో ఉన్న ఈ ఆది వాసులందరి పట్లా ఈ అత్యాచారమే జరిగింది. కొత్తగా వచ్చిన దేవతలు పాతగా ఉన్న పూర్వ దేవుల మీద ఎప్పుడూ యుద్ధాలు జరిపి వలసల్ను ఏర్పాటు చేసుకుంటూ ఉండేవాళ్ళు. భూగోళంలో ఒక పశ్చిమార్ధ గోళం అదితి, కశ్యప ప్రజాపతికి ఒక భార్య అయి, రెండో పూర్వార్ధ గోళం దితి రూపంలో రెండో భార్య అయింది అని చెప్పిన పురాణాలలో ఎంత గూఢార్థముందో చూడండి. అందువల్ల గుణానికి ప్రాధాన్యం ఇవ్వాలని కబీరు వేమన్నలు చెప్పారు. కులమనే ఒరను పారేసి గుణమనే కత్తిని తీసుకోమంటాడు' కబీరు. వేమన ఏమంటున్నాడు...

*గుణములు గలవాని కుల మెంచగా నేల*
*గుణము కలిగెనేని కోటి సేయు*
*గుణములేక యున్న గ్రుడ్డి గవ్వయు లేదు.*

అసలు ఈ జీవన ద్రష్టలు సాంప్రదాయికులు చేసుకున్న జీవిత లక్ష్యాల పునాదుల్నే చెరిపి వేశారు. అసలు కాన్వాసు అదే అయినా వీళ్ళు ఇంకో రకమైన లైఫ్ స్కెచ్ దాని మీద గీచుకున్నారు. సనాతనులకు స్వర్గసుఖం అనుభవించడం లక్ష్యం. దానికి యజ్ఞ యాగాదులూ క్రతువులూ ఆచరించాలి. అప్పుడు రంభా అప్సరస స్త్రీల సుఖ సంభోగాలు, కల్పవృక్ష చ్ఛాయా విహార సౌఖ్యాలూ లభిస్తాయి. కాని ఈ యోగుల జీవన లక్ష్యం స్వర్గం కాదు, బ్రహ్మ సాయుజ్యం. బ్రహ్మ ఎక్కడున్నాడు. తనలోనే ఉన్నాడు. తనలో ఉన్న వానిని పొందడానికి ఎరుక కావాలి. జ్ఞానం కావాలి. ఇలా వీళ్లు జ్ఞాన మార్గావలంబులు అయ్యారు. వాళ్లు కర్మ కాండ పరాయణులయ్యారు. వీళ్లు జ్ఞానం తెలిసిన జ్ఞానులు, వాళ్లు ఛందస్సు తెలిసిన ఛాందసులు. వాళ్లు కర్మల జాలంలో చిక్కుకుని పరమాత్మను తెలుసుకోలేకపోతున్నారు. అందుకే వేమన ఇలా అంటాడు...

*తెఱల మఱుగున గల తేజ మంతయు జూచి*
*మఱియు బ్రహ్మమందు మనసు నిలిపి*
*గరిమ నున్న యట్టి ఘనులెందు గల రయా!*

మఱుగు అంటే మాయ. భ్రాంతి. ఈ భ్రాంతి వీడిపోతేనే బ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది.

ఈ సనాతనులు మరీ మరీ మాయా వాగురంలో చుట్టుకోవడానికి ప్రయత్నం చేస్తుంటారు. వీళ్లకు సహధర్మచారిణి లేనిదే యజ్ఞం చేయడానికి వీల్లేదు. పుత్రుడు లేకుండా పున్నామ నరకాన్ని తరించడానికి వీల్లేదు.

ఇలాంటి నియమాలన్నీ పెట్టుకోవడం ఎక్కువ భార్యా సుఖాన్నీ, ఎక్కువ పుత్ర సుఖాన్నీ అనుభవించడానికే. మనం చేసే నైచ్యాలూ స్వార్థాలూ అన్నీ వీళ్లకోసమే గదా! భార్యా పుత్రుల మీద మనకున్న ఈ అతి లంపటత్వమే ఇతరుల సుఖాలకు అవరోధాలు సృష్టిస్తుంది. మన కుర్రవాడు బొమ్మ బాగా చూడాలంటే ఇతరుల భుజాల మీదకు ఎక్కించ వలసి వస్తుంది. అందుకనే ఈ యోగులు భార్యా పుత్రుల్ని బంధనాలుగా గ్రహించారు. వీళ్ల సంకెళ్లు.

*'తెలియ తనదు భార్య తెగబారు సంకెల'* అంటాడు వేమన.

జీవితంలో కసి లేనిదే కవిత్వం రాదు. హాయిగా ఆహ్లాదంగా ఉన్నా కవిత్వం వస్తుంది గాని అది వేరు. అల్లసాని పెద్దనగారికి కప్పురపు విడెము, తూగుటుయ్యాల ఉంటేనే గాని కవిత్వం రాలేదు. ఉమర్‌ఖయ్యాంకు సాకీ మధురాధరాలతో పాటు తిక్త కషాయ మధువును చప్పరిస్తేగాని కవిత్వం రాలేదు. ఒక ఇంగ్లీషు కవికి ఎప్పుడూ భార్య పక్కనుండి నసపెడుతుంటే గాని కవిత్వం వచ్చేది కాదట. వేదన కవికి కావాలన్న మాటేగాని అసలు ఈ వేదన కవి లోనికి ఎలా వచ్చింది. కసీ, మాత్సర్యం, అసూయ వలనే

వచ్చింది. కాని కవిలో ఉండే కసీ, మాత్సర్యాలకూ మామూలు మనిషిలో ఉండే మాత్సర్యాలకూ కొంచెం తేడా ఉంది. కవిది సమష్టి మాత్సర్యం. ఒకడు, ప్రక్కవాడు తింటుంటే సహించలేడు. ఇది వ్యక్తిగతమైన అసహనం. ప్రక్కవాడికి తిండి పెట్టకుండా తాను సుఖంగా భోంచేసే వాణ్ణి కవి చూచి సహించ లేడు. వాడి మీద విరుచుక పడతాడు. వేమన సంఘం మీద విరుచుకు పడటం అంతా ఇలాంటిదే. ఇది సమష్టి అసూయ, కసి. వ్యక్తి కసి 'ఉత్తమ పురుష'లో ఉంటుంది. కవి కసి 'ప్రథమ పురుష'లో ఉంటుంది.

ఈ కసితోనే వేమన సనాతనుల మీద దాడి చేశాడు. సనాతన ఛాందసులది టైం టేబులు జీవితం. వేమన మొదలైన యోగులది వర్క్ చార్ట్‌లాంటి జీవితం. గృహస్థాశ్రమ జీవితంలో ఎన్నో నియమాలు పాటింపవలసి ఉంటుంది. ప్రొద్దునే లేవాలి స్నానం చేయాలి. సంధ్య చేయాలి. జపం చేయాలి.

నిత్య హవన కర్మలు, బలి నైవేద్యాలు ఎన్నో చేయవలసి ఉంది. అలాగే బ్రహ్మచారి జీవితం, వానప్రస్థ జీవితం కూడా. వాళ్ల జీవిత డైరీ అంతా ఇలాంటి టైం టేబులు నిబంధనలతో నిండిపోయి వాళ్లది రికార్డుల జీవితం, ఆఫీసు ఫైళ్ల జీవితం అయిపోయింది. ఇలాంటి జీవితం మోయడం ఎంత కష్టం! వేమన అంటాడు...

*సంధ్య వార్చనేమి, జపము సేయగనేమి*
*వేద శాస్త్రములను వెలయనేమి*
*పరము గనని వాడు బాపడు గాదురా"*

ఇవన్నీ వేమన దృష్టిలో వ్యర్థం. టైం టేబుల్లో అవసరం ఉన్నవీ, అవసరం లేనివీ సందర్భం ఉన్నవీ సందర్భం లేనివీ అన్ని పనులూ తప్పని సరిగా నియమబద్ధంగా చేసుకుంటూ పోవలసి ఉంటుంది. ఎప్పుడో ఏ కాలంలోనో తయారు చేసిన శాస్త్ర నియమాలు. ఆ నియమాల మీద ఇప్పుడూ నడవాలి అనడం అవివేకం. వర్క్ చార్ట్ లైఫు ఇలా ఉండదు. నీకు ఇప్పుడు ఎంత కావాలో అంతే చేయి. ఆ పనే చేయి. సత్య శౌచ దయా ధర్మాల్ను ముందు బెట్టుకుని అవసరం వచ్చినప్పుడు వీటిని అనుసరిస్తూ నిర్మలమైన జీవితం గడుపుకుంటూ పొమ్మంటారు యోగివరులు. మరి టైం టేబులు వేసుకుని మనం దయా ధర్మ గుణాలను ప్రదర్శించ గలమా! 9 నుండి 10 గంటల లోపు ధర్మగుణం ప్రదర్శించాలని టైం టేబులు వేసుకున్నాము అనుకోండి. అప్పుడు మన గుమ్మానికి ఏ బిచ్చగాడూ రాడు. అప్పుడు మన ధర్మగుణం ఏమవుతుంది? ఇలాంటి టైం టేబుల్లో ఉండే అవకతవకల్ను ఈ సత్యద్రష్టలు ఎప్పటికప్పుడు దిద్దుతుంటారు.

పోతన ప్రభావం వేమన మీద కూడా ఉంది అని చెప్పడానికి మనకు ఎక్కువ ఆధారాలు దొరకవుగాని "అందుగలడిందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండెందెందు వెదకి చూచిన అందందే గలడు దానవాగ్రణి వింటే" అన్న పద్యం, దాని అందమైన శైలీ వేమనను కూడా ముగ్ధుణ్ణి చేసి ఉండవచ్చు. ఈ క్రింది పద్యం కొంచెం అలానే ఉంది.

అందునిందు నుండు అఖిలుండు చూడగా

*నెందు దాని నిండి యెఱుగు చుండు*
*నతని పూజ ఫలము నందంగ వలెనయా*
*అందునిందు ననక యన్నింటి యందును*
*విష్ణు వమరియుండు వెలయ భువిని*
*వెనుక జక్రి తిరుగు విష్ణు చక్రంబుతో*

'చక్రి సర్వోప గతుండు అని పోతన అన్నాడుగాని. చక్రి వెనుక విష్ణు చక్రంలో ఉంటాడు అన్న మాట మాత్రం అమోఘమైన భావ గాంభీర్యం గలది. చక్రం తిప్పుతూ పరమాత్మ ఈ సృష్టి వెనుక ఉన్నాడు అన్న దానికి మనకు ఇహ మాటలు చాలవు. చెప్పడానికి.

'కారే రాజులు రాజ్యముల్ గలిగిరే గర్వోన్నతిం బొందరే

వారేరీ సిరి మూట గట్టుకొని పోవం జాలిరే భూమిపై"

పోతన్నగారి ఈ పద్యం ప్రభావం కూడా వేమనపై ఉంది.

*ఉన్నవారలెవరొ చన్నవారెవ్వరో*
*కన్నవారలెవరొ కానరారు*
*ఉన్న చన్న కన్న నొక్కడే చూడరా!*

ఈ పద్యంలోని భావాన్ని ఆట వెలదిలో వేమనగారు ఎంత బాగా చెప్పారో! అంతేగాదు. వేమన ఈ పద్యాల ద్వారా పోతన్న గారి ప్రాసతో కూడా పోటీ పడదలచినట్టుంది. కారే రాజులు అని రకార ప్రాసతో శార్దూలంలో పోతన ఏ సోయగాన్ని తీసుకు రాదలచాడో వేమన నకార ద్విత్వంతో ఆట వెలదిలో ఆ అందాన్ని తీసుకు రావడానికి ప్రయత్నించాడు. ఉన్న చన్న కన్న నొక్కడే చూడరా! ఈ ప్రాసను తన ఏకేశ్వర ప్రతిపాదనకు ఎంత చక్కగా వినియోగించు కున్నాడో అర్థమైంది.

వేమనకూ తదితర కవులకూ ఇంత సామ్యం ఉండటం కేవలం పరస్పర ప్రభావం చేతనే గాదు. ఈ సాహిత్యం రెండు మూడు వేల శతాబ్దాల నుంచి వికసించుతూనే ఉంది. చక్కగా తన ప్రసార మార్గాలు ఏర్పరచుకుంది. పరమాత్మ ఎలాంటిది, జీవుడు ఎలాంటివాడు, ప్రకృతి ఏమిటి? మానవుడు లోకంలో ఎలా సంచరించాలి, ముక్తికి సాధనాలు ఏమిటి, యోగమేమిటి అనే వాటి మీద ప్రత్యేక సాహిత్య సంప్రదాయాలు ఏర్పడ్డాయి. కవి సమయాలు, ఉపమా రూపకాలు, దృష్టాంతాలు, సాంకేతికాలు అన్నీ సంపూర్ణ రేఖల్తో స్థిరపడ్డాయి. తెలుగులోనే కాదు, భారతీయ భాషలన్నింటిలోనూ పద్యాలుగా గీతాలుగా వచనపరంగా అన్ని విధాలైన ప్రక్రియల్లో ఈ ఉపనిషద్వాదాన్ని ఈ జీవ బ్రహ్మైక్య వాదాన్ని ఈ అచల వాదాన్ని ఈ నిర్గుణోపాసనను ఎందరో యోగులు, సిద్ధులు, భక్తులు గానం చేశారు. ఇది బీజ రూపంలో ఉపనిషత్తుల్లో అంకురితమైంది. శంకరునితో పుష్పితమైంది. వేమన కబీరు లాంటి వారితో పుష్ప ఫల భరితమై శాఖోపశాఖలుగా విస్తృత పడి రవీంద్రునిలో తిరిగి క్రొత్తంటు తొక్క బడ్డది. దీనికి తెలుగులో ఎన్నో కావ్య రూపాలు వెలసినాయి. శివ కవుల రూపంలో సిద్ధాంత పరంగా మత పరంగా ముడిముడిగా ఉన్నది. వేమనలో పూర్తి కవిత్వం రూపాన్ని సంతరించు కుంది. పద్య బంధంలో తెలుగు హృదయ నిబద్ధమైంది. బ్రహ్మంగారు, సిద్ధప్ప, ఎడ్ల రామదాసు, యాగంటి ఇనగంటి మొదలైన వారి ద్వారా తత్వాలుగా పాటలుగా ఎంతో ప్రజాదరణ పొందింది. సీతారామాంజనేయము ద్వారా ఎంత కావ్యశిల్పం సంతరించుకోవాలో అంతా సంతరించుకుంది. దీని సాహిత్యం వేరు, దీని జీవన సరళి వేరు. ఇది భారతజాతి మీద బలమైన

**పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి**

ముద్ర వేసింది. మను చరిత్ర వసు చరిత్రాదులు హృదయాహ్లాదానికి సృష్టింపబడ్డ సాహిత్యమేగాని ఇది జీవిత దృష్టి కోణంలో మార్పు దెచ్చిన సాహిత్యం. అది వినువిందు సాహిత్యం.

ఇది కనువిప్పు సాహిత్యం. అది తేనె తరక ఇది ఆరోగ్యపు చురక. అది నాట్యశాల ఇది పాఠశాల. అది షడ్రసోపేత భోజనం ఇది తిన్న తిండిని వంటబట్టించే మందు గుళిక. ముత్యాల కోసం సముద్రంలోకి వెళ్లిన వాడు ముత్యాలు పట్టుక వచ్చినట్టు ఈ జ్ఞాన కవులు ప్రజలకు ముక్తిని తీసుక వచ్చి యివ్వలేక పోయినా మంచి జీవితాన్నీ, జీవన సరళిని ప్రసాదించారు. అందువల్ల దీనిని ఒక ప్రత్యేక జీవిత విధానంగా ప్రత్యేక మతంగా అధ్యయనం చేయవలసి ఉంది.

హిందూ మతమే ఈ దేశానికి సొంత మతమైతే ఇది వేరే మతం క్రిందకు వస్తుంది. ఇదే హిందూ దేశపు మతమైతే హిందూ మతం బాహిరమైంది అవుతుంది. హిందూ దేశము వేదాలు కావాలి అంటుందా! అయితే ఇది వద్దంటుంది. హిందూ దేశం యజ్ఞ యాగాదులు కావాలంటుందా! అయితే ఇది వద్దంటుంది. హిందూ దేశం పుట్టుక కావాలంటుందా! ఇది వద్దంటుంది. హిందూ దేశం గుళ్ళు కావాలంటుందా! ఇది వద్దంటుంది. హిందూదేశం కులాలు కావాలంటుందా! ఇది వద్దంటుంది. అయినప్పుడు ఈ భారతదేశం ఎవరిది? ఏ మతానికి. ఏ కులానిది? ఈ దేశానికి ముసల్మానులు హిందూ దేశమని పేరు పెట్టారు. మన పేరు ఎప్పుడూ మనం పెట్టు కోము. ఇతరులు పెడతారు. మనదేశం పేరు ఇతరులే పెట్టారు. ఏ దేశం పేరైనా ఇతరులే పెడతారు. భరతుడు పాలించాడు గాబట్టి భారతదేశం అని ఇంకో పేరు ఉంది.

ముసల్మానులు పెట్టిన పేరులో ఇది ముసల్మానులది కాని దేశమనే ఉంది గాని ఇక్కడ ఏ మతం ఉన్నదో వాళ్లు పెట్టిన పేరు వల్ల నిర్ధారణ కావడం లేదు. సింధు అనే నది ప్రవహించడం వల్ల సింధు దేశాన్ని వాళ్లు హిందూ దేశంగా పిలుచు కున్నారు. ఒక రాజు పేరుతో భారతదేశమవడం ఒక నది పేరుతో హిందూ దేశమవడం వల్ల ఇది ఏ మత చిహ్నితమైన దేశమో అర్థం కావడం లేదు. ఇప్పటికీ దీని లక్ష్యమేమిటో దీని జీవన విధానమేమిటో అర్థం కావడం లేదు. కాని జ్ఞానుల ద్వారానే ఒక దృష్టి కోణం దీనికి ఏర్పడ్డది. (ఈ భారతదేశానికి ఇప్పుడు ఏదైనా పేరు పెట్టవలసి వస్తే ఈ సిద్ధుల యోగుల బ్రహ్మ తత్వాన్ని బట్టే పెట్ట వలసి వస్తుంది. ఎందుకంటే వేదాలను ఒప్పుకొనక పోవడం, యజ్ఞ యాగాదులను తిరస్కరించడం, కుల మతాల్ను గుణపరంగా భావించడం లాంటి విషయాల తోనే ఇప్పటి 60శాతం భారతీయుల జీవితం నడుస్తుంది.

రైతులు, కార్మికులు, పాటక జనులు, కళాకారులు, చేతి పనుల వాండ్రు, వృత్తి పనుల వాళ్ళు అందరూ ఈ 60 శాతంలోనికి వస్తారు. వేదాలు కావాలి, స్వర్గ నరకాలు కావాలి, జన్మలూ మృత్యువులూ కావాలి అనే వాళ్ళు 40 శాతమే. అంటే భారతదేశం పురోహితుల పౌరాణికుల సనా తనుల జీవిత పద్ధతిని వీడి ఈ తాత్వికులు చెప్పిన సరళ జీవితం, సదాచార సంపన్నత మొదలైన గుణాలతో కూడిన జీవిక విధానం వైపుకే మొగ్గు చూపింది. ఇప్పుడీ దేశానికి గుణాత్మకమైన పేరేమైనా పెట్టదలిస్తే బ్రాహ్మదేశము' అని పెట్టాలి.

రాజ్యాంగంలో ఎలాగూ మతాతీత దేశమని ఉంది. అంటే నాస్తిక దేశమనే. నాస్తిక దేశమూ ఆస్తిక దేశము కాకుండా నిరాకార దేశము నిర్గుణ దేశము అనే అర్థం వచ్చేటట్టు ఉండాలి. ఇప్పుడిది ఇతర దేశాల దృష్టితో తటస్థ దేశము అంటే నిర్లిప్త దేశము. బీద దేశము అంటే వర్ధమాన దేశము. ఇంకో పేరు పెట్టవచ్చు అశోక దేశము. అశో కుని ధర్మచక్రం ఉంది గాబట్టి రాజకీయంగా ఈ బ్రహ్మావాద చర్చ జర క్కుండగానే జ్ఞానులు దీనికి కొన్ని పేర్లు పెట్టినట్టు ఈ పేర్లన్నీ వ్యవ హారంలోకి వచ్చినాయి. మళ్లీ ఈ పేర్లన్నీ వ్యవ హారంలోకి వచ్చినాయి. మళ్లీ ఈ పేర్లన్నీ ఒక్కసారి తడవండి... ఈ దేశం వ్యావహారికంగా వేదాంతులకు ఎంత దగ్గర వచ్చిందో - నాస్తిక దేశము, నిర్లిప్త దేశము. అశోక దేశము, వర్ధమాన దేశము...

ఈ వ్యవహార నామాల్ను బట్టే తెలుస్తుంది. ఈ దేశానికి జ్ఞాన మార్గానికీ ఎంత దగ్గర సంబంధమో ఈ జ్ఞానులు ప్రవేశపెట్టిన జీవిత విధానంతోనే మన దుస్తులు ఎలా ఉండాలి, దైనిక జీవితం ఎలా ఉండాలి. చదువులు ఏవి చదవాలి. ఇతరులతో ఎలా వ్యవహరించాలి అన్న ప్రతి విషయమూ వాళ్ల ఒరవడిలోనే నడుస్తుంది. మనస్సు, వాక్కు శరీరంలో ఇది అతి క్లుప్తతను వరించింది. వస్త్ర ధారణ వ్యవహారాదుల్లో ఎంతో సంయమం చూపింది. అతి సరళత్వానికి సంకేతమా అన్నట్టు వేమన బట్టే కట్టలేదు. గాంధీగారు కొల్లాయి గుడ్డ కట్టుకున్నాడు. మన రైతులు మన కర్మజీవులు అందరూ అతి సాధారణమైన దుస్తులు వేసుకుంటారు.

జంధ్యాలు వేసుకుని పొలాల్లోకి ఎవరూ పోరు. దేవాలయాల్లోకి ప్రజలు వేడుక కోసం పోతుంటారుగాని వాళ్ల మనస్సుల్లో దేవుడు ఒక్కడు అనే భావం ఎప్పుడూ స్థిరపడి ఉంది. ఈ జ్ఞానులు ఏర్పరచిన బాటమీదే ప్రజా జీవితం నడుస్తున్నది అన్నది నిర్వివాదాంశం. హిందూ మతమంటే పంచకూళ్ల కషాయం. పంగనామాలు పెట్టుకోవాలో విభూతి పుండ్రాలు పెట్టుకోవాలో మంచిగంధం బొట్టు పెట్టుకోవాలో మనకు అర్థం గాకుండా ఉంది. వేదశాస్త్రాలు చదవాలో యోగాభ్యాసం చేయాలో అర్థం గాకుండా ఉంది. ధర్మశాస్త్రాను సారంగా నడిచిన రాముడూ మనకు దేవుడే, వాటిని తిరస్కరించిన బుద్ధుడూ దేవుడే ఈ స్థితిలో తాత్వికులు ఈ దేశానికొక చక్కని రూప కల్పన చేశారు. కబీరు, వేమనలాంటి జ్ఞానుల జీవితం దీనికి ఒరవడి ఈ ఒరవడి మీదనే ఈ దేశానికి నిర్వచనం చెప్పవలసి ఉంటుంది. వ్యాఖ్యానం చేయ వలసి ఉంటుంది, అర్థం చేసికొన వలసి ఉంటుంది.

ఈ దేశంలో మతమతాంతరాలెన్నో ఉన్నాయి. భాషలెన్నో ఉన్నాయి. మనం చాలా దగ్గరగా నుంచుంటే అందరి ముఖాలూ వేరుగా కనిపించుతాయి. మనకు వేరుగా ఉన్న ముఖాలను రక్కబుద్ధి పుడుతుంది, కొట్టబుద్ధి పుడుతుంది. ఇంకొంచెం పైకి వెళ్లి చూస్తే ఈ ముక్కూ కళ్లల్లో ఉన్న తేడాలు తెలియవు. ముఖాల ఆకారాలన్నీ ఒకటిగానే కనిపించుతాయి. ఇంకా పైకి విమానంలోకి వెళ్లి చూస్తే ముఖాల్లో కూడా తేడాలు కనిపించవు అన్నీ మానవాకారాలు లాగా కనిపించుతాయి. అప్పుడు ముక్కు ముఖాల తేడాతోనే గాదు, ఆకారాల తేడాతో కొట్టుకునే పరిస్థితి కూడా ఉండదు. అలాగే కులాలు మతాల్ను భాషల్ను దగ్గర

**వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది. వాడని భాష వాడిపోతుంది**

దగ్గర పెట్టుకు చూస్తుంటే ఒకరినొకరు రక్కుకుంటూ గిచ్చుకుంటూ ఉండాలని పిలుస్తుంది గాని దూరంగా ఎత్తుగా ఎగిరి చూస్తే ఈ యిరుకు మనస్తత్వాలు ఉండవు. ఈ యోగులు, జ్ఞానులు ఇలా మనుషుల్ని పైకి విమానాల మీద ఉండి, చూశారు గాని ఎడ్ల బళ్లమీదా రిక్షాల మీదా ఉండి చూడలేదు. అందువల్ల వాళ్లకు ఒకే ఒక మానవత్వం కనిపించింది. వేమన అంటున్నాడు.

*కనగ సొమ్ములెన్నొ కనకం బదొక్కటే*
*పసుల వన్నెలెన్నొ పాలొకటియె*
*పుష్పజాతులెన్నొ పూజ యొక్కటె సుమా!*

పశువుల్లో తేడా ఉన్నా పాలల్లో తేడా లేదు, ఏ పుష్పమైతేనేం, అన్నింటితో మనం పూజ చేయవచ్చు. ఈ యోగులది ఇంత విశాల దృష్టి ప్రతి వాడూ తన కులాన్ని చెప్పుకోవడానికి చాలా సంకోచ పడతాడు. కొందరు తమ కులాన్ని గొప్పకు వినియోగించుకుంటే కొందరు పరిస్థితికి వినియోగించుకుంటారు. కాని వేమన రెడ్డి ఇక్కడ తన కులాన్ని కవిత్వానికి ఎంత చక్కగా వినియోగ పెట్టాడో చూడండి.

*చెడ్డవాని మిగులజెఱచును దైవంబు*
*అడ్డు పడదు వాని కాపదైన*
*చెడ్డచేను జూచి రెడ్డి తామెచ్చునా.*

తన చేనైతే మాత్రమేం చెడిపోయి నప్పుడు యజమాని దాన్ని చూచి మెచ్చు కుంటాడా యేమి? ఇక్కడ 'రెడ్డి' పదం కులానికీ అందమిచ్చింది. కవిత్వానికీ అందమిచ్చింది.

వేమన యోగి పాండిత్యం కేవలం ఆట వెలదుల వరకే పరిమితమైంది అనుకోవడానికి వీల్లేదు. ఆయన సాహిత్యాలు శాస్త్రాలు కూలంకషంగా చదివిన పండితుడు. ప్రజల భావాల్ను ప్రజల మాటల్లో చెప్పడానికని ఆట వెలది, కందం లాంటి ఛందస్సును ఎన్నుకున్నాడే గాని ఒక్కొక శబ్దం ఆయన ప్రయోగించే తీరు చూస్తుంటే ఆయనెతో గహన పండితుడు ఉన్నత భావ సంపన్నుడు అని తెలుస్తుంది. జీవ రహస్యము, బ్రహ్మతత్వము మొదలైన విషయాలు చెప్పేటప్పుడు ఆయన పారము కడముట్ట చూచాడు. మూర్ఖుల్నా అపండితుల్ని ఎక్కడి కక్కడ తిట్టి పోశాడు. గాడ్దె కేమి తెలుసు గంధపు వాసన అని, పంది బురద మెచ్చుగాని పన్నీరు మెచ్చునా అని మూర్ఖుల్ను తిట్టేటప్పుడు హద్దూ అయిపూ లేకుండా అతని గంటం సాగింది. ఏ కాస్త అవకాశం దొరికినా విద్యల్ను విన మంటాడు. అప్పుడు వినడమే, చదవడం చాలా తక్కువ.

*తనకు బ్రొద్దువోని తరుణం ఏదైనచో*
*వినకతీర దధిక విద్యలైన*
*గరిత వినదె ప్రియుని కొఱకు గాక ధ్వని.*

ఇక్కడ ఈ దృష్టాంతం ఇవ్వడంలోనే ఆయన సునిశిత భావన బోధ పడుతుంది. ఈ చదువులెందుకు చదవాలి అంటే గరిత వినదె ప్రియుని కొఱకు గాక ధ్వని అన్నాడు. ప్రియుడు వస్తాడని ప్రియురాలు పదే పదే గడప దగ్గరకు వెళ్లి కాకి ధ్వని వింటుంది. ఈ మాటలో ఎన్నో అర్థాలు ఉన్నాయి. ప్రియురాలికి కాకి ధ్వని విననవసరం లేదు. భర్త కోసమే వినాలి. మీకు ప్రొద్దువోని తరుణంలో వేమన చదువుకో మన్నాడు. అసలు మనం చేసే పని ముఖ్యం. ఆ పనికి తీరిక గలిగినప్పుడు కొంచెం చదువుకో మని చెప్పాడు. ఉపాంగంగా. రెండో అర్థంలో జీవుడు ప్రియుని పొందాలి. కాబట్టి కాక ధ్వని శకునంలా ఉపయోగపడ్డట్టు మనకు గ్రంథ పఠనం ఉపయోగ పడుతుంది. వినక తీరదిక విద్యలైన. పెద్ద చదువులైనా చదివి తీరాలి అంటున్నాడు. ఇంకొక చోట.

*అందునిందు ననక యన్నింటి యం దును*
*విష్ణు వమరియుండు వెలయ భువిని*
*వెనుక చక్రి తిరుగు విష్ణు చక్రంబుతో'*

అనడంలో ఆయనకు ఎంత వ్యుత్పన్నత ఉన్నదో వ్యక్తమవుతుంది. విష్ణువు అంటే పరమాత్మ ఆయన చక్రి, చక్రంబట్టి సృష్టి అంతటా తిరుగుతుంటాడు. ఈ భావానికి మనం ముగ్ధులం కాక తప్పదు. కాని 'విష్ణువు' 'చక్రి' పదాలు ఆయన వాడిన పద్ధతి చూడండి. ఒకే వ్యక్తి విష్ణువు, చక్రి. విష్ణువు అంటే శబ్దార్థం వ్యాపించి ఉన్నవాడని అందువల్లే విష్ణువ మరియుండు వెలయభువిని అని అమరి యుండు దానికి వ్యాపృతి అర్థంలో చెప్పాడు. చక్రం తిప్పడానికి చక్రి అని చెప్పాడు. అంటే పరమాత్మ వ్యాపకుడు, సృష్ట్యాధారుడు సృష్టి చాలకుడు అని చెప్పడానికి విష్ణువును సంకే తంగా తీసుకుని రెండు గుణాలకు రెండు శబ్దా లను వేశాడు. ఇంతకంటే పాండిత్యం ఏమి కావాలి. ఇంత గొప్ప భావాలూ పదాలూ చదవకుండా ఎలా వస్తవో నాకు అర్థం కావడం లేదు.

కవిత



## గోదావరిలాంటి 'గరిమెళ్ళ'

గోదావరి సాక్షిగా
అక్షరంలో ధైర్యం నింపినవాడు
తెల్లదొరల పాలనలో
ప్రజల యిక్కట్లెరిగినవాడు
అక్షరానికీ జీవముంటుందని,
అది పాటై ప్రవహిస్తుందని,
ఆ వేగం 'భయం' పుట్టిస్తుందని
పాలనకి రుచి చూపినవాడు
స్వాతంత్ర్యోద్యమ రహదారిలో
ప్రజల అడుగుల కోసం
గళమెత్తిన గాయకుడు
మాకొద్దీ తెల్లదొరతనమని
పరపాలనగుట్టు విప్పి,
స్వదేశీ మంత్రానికి
ప్రాణ ప్రతిష్ట చేసినవాడు
దండాలు, దండాలు అని
భారతమాత గొప్పతనాన్ని
పూలవనం చేసినవాడు
పాలనలో క్రూరత్వాన్ని
అక్షరాలలో పొదిగి, బొమ్మను గీసి,
ప్రజల ముందు నిలబెట్టిన వాడు
జీవితాన్ని పాటను చేసి
చెరసాల కంకితమైనవాడు
పాటకి ప్రాణం పోసి
పల్లకీ మీద ఊరేగించిన
దేశభక్తుడు గరిమెళ్ళ!

*(డిశంబరు 18, గరిమెళ్ళ సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా)*

ఎస్. ఆర్. పృథ్వి
99892 23245



Unfiled Notes Page 41

కథానిక

# ఆత్మకు కులమేది!

డా॥ లక్ష్మి అయ్యర్
9680276038



సార్ ! మీరెపుడు వస్తున్నారు ? గెస్ట్ హౌస్ లో మంచి వి. ఐ. పి రూమ్స్ ఐదు రిజర్వు చేయమని రాజుకు ముందే చెప్పి ఉంచాను. ఇంకా మూడు రోజులే వున్నాయి, ఆతృతతో అడిగింది రాష్ట్రీయ సదస్సు సమన్వయకురాలు డాక్టర్ రమ.

"ఆ, రమాజీ, నేను రేపు రాత్రి ఫ్లైట్ లో బయలుదేరుతున్నాను. 10 గంటలకు పూణే వచ్చేస్తాను. అన్నట్లు, తెలుసుగా నీకు నా గురించి. నేను నేరుగా సదస్సుకు వచ్చేస్తాను. గెస్ట్ హౌసులో ఉండను. పూనేలో ఓ మఠం వుంది. అక్కడే బస చేస్తాను...అవతలి కంఠం వి సి రామానుజాచార్యులది. అలాగే సార్, □మఠానికి బండి పంపిస్తాను...అని ఫోను□□ పెట్టేసింది రమ. రాజస్థాన్ కు వెళ్ళినపుడు కూడా ఇదే తతంగమంట "నాకు బావిలోని నీళ్ళు త్రాగి అందులోనే స్నానం చెయ్యాలి. నేను శ్రీ వైష్ణవుణ్ణి. బయట మంచి నీళ్ళు కూడా పుచ్చుకోను. ఎక్కడన్నా మఠం గానీ, గుడిగానీ, అదీ బావి ఉంటేనే వస్తాను... అన్నారంట. అక్కడ వున్న సెమినార్ వాళ్ళు కిషన్గఢ్‌లో వెదకి వెదకి ఓ బావి వున్న బ్రాహ్మణ ఇంటిని కష్టపడి పట్టుకొని వాళ్ళను ఒప్పించి ,ఏర్పాటు చేశారంట పాపం.

అత్యున్నత సంస్కృత విద్యను అభ్యసించిన అఖండ పండితులు ఆ వీ.సీ. తన ఊర్ధ్వ పుండరీకాలతో, వైష్ణవ ముద్రలతో, బ్రాహ్మణ పంచకట్టుతో ఓ ఉపన్యాసం ఇచ్చారంటే కాళిదాసు, దండి కూడా మైమరచి పోతారేమో అనిపించే అనంత పాండిత్యం .కాని కుల మత ఛాందస భావాలను తనలో ఇముడ్చుకున్న మనిషి. "మేడం !అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది రమ ." చూడు సతీష్ !అన్ని ఏర్పాట్లూ దగ్గరుండి చూడు, సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని...ఆరేడు మంది సంస్కృత ప్రోఫెసర్లైన వి సి లు వస్తున్నారు. ఏ లోటు లేకుండా చూడాలి తెలిసిందా ? అంటూ వడి వడిగా హాలువైపు నడిచింది రమ.

పూనేలోని ఓ యూనివర్సిటీలో జరుగబోతున్న మూడు దినాల జాతీయ సదస్సుకు కార్య నిర్వాహకురాలు డాక్టర్ రమ త్రిపాఠి. రెండు రోజుల సదస్సు చాలా బాగా జరిగింది. మూడో రోజు తెల్లవారుజామున రెండు గంటలకు రమకు మఠం నుండి ఫోను వచ్చింది. వి. సి రామానుజులుగారు స్పృహ తప్పి పడిపోయారని ఆయనను పక్కనే వున్న చిన్న ఆసుపత్రిలో చేర్పించారని. ఇంట్లోనుండి కారు తీసుకొని హుటా హుటిగా అక్కడకు వెళ్ళిన రమ ముందే గుమికూడిన పండిత బృందాన్ని చూసి ఖంగుతిన్నది రమ.

"ఏమైంది సార్ !" అక్కడ వున్న ఇంకో వి. సి.చౌదరి గారిని అడిగింది. నిన్న రోజంతా ఏమీ తినలేదు, నీళ్ళు కూడా పుచ్చుకోలేదు. రాత్రి ఏడుగంటల ప్రాంతంలో ఫలహారం మఠంలో తీసుకుంటానని మేము చెప్పినా వినకుండా గెస్ట్ హౌస్ నుండి వెళ్లి పోయారు. రోజూ 5 కు వెళ్తారు నిన్న ఎవరినో కలవాలని మాదగ్గర కొచ్చారు. ఇక్కడేదో ఫుడ్ పాయిజన్ అయిందని డాక్టర్లు చెప్పారంట మఠం వాళ్ళతో .ఆయనను అడ్మిట్ చేసిన ఓ చిన్న క్లినిక్ కు అందరూ పరిగెత్తారు కార్లలో. కొద్దిగా కూడా శుభ్రత లేని ఓ చిన్న ఆసుపత్రిలో ఓ మూల బెడ్ లో అచేతనంగా పడి వున్న ఆయనను చూసిన రమ కళ్ళు కన్నీటితో నిండి పోయింది ." డాక్టరుగారి రూములోకి ఖంగారుగా పరుగెత్తి అడిగింది "ఏమైంది డాక్టర్ ?" "చాలా క్రిటికల్ స్టేజి మేడం ! విషాహారం ఊపిరితిత్తులవరకు పాకింది. ఆహారంలో ఏదో ఇన్ఫెక్షన్ అయింది ఇక్కడ 150 కి.మీ.వేరే ఆసుపత్రి కూడా లేదు. నేను వచ్చేవరకు ఇక్కడే డ్రిప్స్

వెంకటేశ్వరా ! మడుగు, మడుగు అని గవర్నమెంట్ ఇచ్చిన వంట మనిషిని మార్పించి బ్రాహ్మణుణ్ణి పెట్టుకున్న రామానుజాచార్యులు, మీనా జాతి వారి చేతుల్లో చాయ్ కూడా తాకనని కంకణం కట్టుకున్న బ్రాహ్మణుడు ఈ రోజు ఓ మీనా జాతి ఆస్పత్రిలో అనాధగా పడి వున్నారు. 'ఆయనకు బ్లడ్ డొనేట్ చేసిన వ్యక్తి పీటర్ అనే కుర్రాడని, ఆయనకు స్పృహ వచ్చిందని కానీ మాట్లాడలేక పోయారని చివరిగా కళ్ళతో సైగ చేసి నీళ్ళు అడిగారని, పక్కనే వున్న నర్సు ఫాతిమా నీళ్ళు అందించి త్రాపించిందని, ఆమె చేతుల్లోనే ప్రాణాలు వదిలారని, ప్రాణం పోయిన గంట తర్వాతే పెళ్ళాం, పిల్లలు వచ్చారని. ఆయన బాడీని అప్పగించి ఫ్లైట్ లో ఎక్కించారని రమ జూనియర్స్ అందరూ చెప్పారు.




## మాతృభాషలో విద్య విద్యార్థుల హక్కు: ప్రజల భాషలో పరిపాలన ప్రజలందరి హక్కు కొవ్వూరు – గీర్వాణ విద్యాపీఠంలో డా॥ సామల రమేష్‌బాబు ప్రసంగం

పిల్లలకు పరాయి భాషలో పాఠాలు చెప్పడం దుర్మార్గం అనీ స్వంత భాషలో కనీసం ప్రాథమిక విద్యను పొందడం విద్యార్థుల సహజ హక్కు అనీ తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులోని 'ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం సంస్కృత కళాశాలలో నవంబరు 18 మంగళవారం– 'సమైక్య భారతి' నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ బి.వి.వి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా డా॥ మోపిదేవి విజయగోపాల్, విశిష్ట అతిథులుగా సామాజిక కార్యకర్త శ్రీమతి తుమ్మల పద్మజలక్ష్మి, (కాకినాడ) ఎస్.వి.జె. కళాశాల ప్రిన్సిపాల్ డా॥ సిహెచ్. రమాదేవి, తాడేపల్లి గూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు లెఫ్టినెంట్ జల్దా విశ్వనాథ్ కుమార్ మున్నగువారు ప్రసంగిస్తూ – తెలుగును రక్షించుకొని అభివృద్ధి చేసుకోవాలని, అందుకోసం వివిధ కోణాల్లో పలు అంశాలను ప్రస్తావించారు. తెలుగు బోధనలో పాఠ్య ప్రణాళికల్లో, ప్రభుత్వ విధానాల్లో రావలసిన మార్పులను తెలిపారు.

డా॥ రమేష్‌బాబు తన ప్రసంగంలో సాహిత్యంతోనే భాష వికసిస్తుందనే రోజులు పోయాయి. ఒకప్పుడు సాధారణ ప్రజలకు చదువు, ఉద్యోగాలు అక్కరలేని రోజుల్లో కొద్దిమంది పండితులకే భాషా విజ్ఞానం పరిమితమై ఉండేదని, ఈ ఆధునిక యుగంలో విద్య అన్ని స్థాయిల్లో అందరికీ అందుబాటులో ఉండాలని, భాషను పాలనలో, పరిశోధనలో, అన్ని రంగాల్లో అమల్లోకి రావాలని, స్వంత భాషలోనే ఈ వికాసం అంతా జరగాలని అన్నారు. వాడుతూ ఉంటే ఏ భాషైనా వికసిస్తుందని, ప్రజల భాషలన్నిటికీ ఈ మౌలిక శక్తి ఉందని, వాడని భాషలు వాడిపోతాయని, ఆ పరిస్థితి తెలుగుకు పట్టనీయకూడదని ఆయన అన్నారు. సమైక్య భారతి నేత పి. కన్నయ్య, ప.గో.జిల్లా కార్యదర్శి కల్లేపల్లి చల్లారాం. కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇచ్చి ఉంచింది మా నర్సు" అన్నాడు తాపీగా డాక్టర్ శ్రవణ్ కుమార్ మీనా.

వెంకటేశ్వరా ! మడుగు, మడుగు అని గవర్నమెంట్ ఇచ్చిన వంట మనిషిని మార్పించి బ్రాహ్మణుణ్ణి పెట్టుకున్న రామానుజాచార్యులు, మీనా జాతి వారి చేతుల్లో చాయ్ కూడా తాకనని కంకణం కట్టుకున్న బ్రాహ్మణుడు ఈ రోజు ఓ మీనా జాతి ఆస్పత్రిలో అనాధగా పడి వున్నారు. అస్సాం లోని ఆయన పెళ్ళాం బిడ్డలకు ఫోన్ చేసి, ఫ్లైట్ లో పిలిపించే పనిని తన జూనియర్ కు అప్పజెప్పి, మిగతా ప్రొఫెసర్లతో ఓ వైపు సదస్సు నిర్వహించి సాయంత్రం సభను పూర్తి చేసి వచ్చిన రమకు దొరికిన షాక్ సమాచారం 'ఆయనకు బ్లడ్ డొనేట్ చేసిన వ్యక్తి పీటర్ అనే కుర్రాడని, ఆయనకు స్పృహ వచ్చిందని కానీ మాట్లాడలేక పోయారని చివరగా కళ్ళతో సైగ చేసి నీళ్ళు అడిగారని, పక్కనే వున్న నర్సు ఫాతిమా నీళ్ళు అందించి త్రాపించిందని, ఆమె చేతుల్లోనే ప్రాణాలు వదిలారని, ప్రాణం పోయిన గంట తర్వాతే పెళ్ళాం, పిల్లలు వచ్చారని. ఆయన బాడీని అప్పగించి ఫ్లైట్ లో ఎక్కించారని రమ జూనియర్స్ అందరూ చెప్పారు. " మరి నా కెందుకు చెప్పి ఏడువలేదు....అడిగింది రమ కాస్త కోపంగానే ."ఎలా మేడం ? ఫంక్షన్ లో సి.ఎంతో మీరు స్టేజిలో వున్నారని చెప్పారు, వాళ్ళూ, కళ్ళు తుడుచుకుంటూ. దేవుడా ! నీ సహస్ర నామాలు, ఉపనిషద్‌లు, వేదవేదాంగాలు చదివిన ఓ సద్బ్రాహ్మణ పండితోత్తమునికి ఇలా అనాధ చావు రాసావా ? తండ్రీ ! అని మనస్సు మూగగా రోదించింది. ఆస్పత్రిలో చట్ట రీత్యా పేపర్లలో సంతకాలు పెట్టి, అన్నీ ముగించి ఇంటికి వచ్చింది రమ. స్నానం చేసి శ్రీ వేంకటేశ్వరుని పటం ముందు నిలబడి చేతులు మోడ్చి కళ్ళు మూసుకున్న రమకు తల్లి రూం నుండి మధురమైన ఘంటసాల కంఠం తో భగవద్గీత వినిపింప సాగింది

*"సర్వ భూతస్థ మాత్మానాంసర్వ*
*భూతానిచాత్మనే / ఈక్షతే యోగయుక్తాత్మా*
*సర్వత్ర సమ దర్శన"*

ఆత్మకు కుల మత వర్గ భేదాలు లేవని, అందరి ఆత్మలు ఒక్కటేనని సమదర్శిగా వుండాలని, అలాంటి సమదర్శే నీకు ప్రియ పాత్రుడవని అంటున్నావే స్వామీ, నిండు హృదయంతో అందరిని ప్రేమించే నిర్మల మనస్సు మాత్రం ఇవ్వు స్వామీ అనుకొని కళ్ళు మూసుకొని ప్రార్థించింది రమ.

ధారావాహిక



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 20. బౌద్ధ మహావిజ్ఞాని - అసంగుడు

ఈ విశ్వానికి కొన్ని ధర్మాలుంటాయి. అవే ఈ విశ్వంలోని ప్రతిపదార్ధంలోనూ, ప్రతిచోటా వ్యక్తమవుతూ ఉంటాయి. విశ్వధర్మాలకి భిన్నమైనది, కొత్తదీ ఏదీ ఉండదు. కొత్తది అంటే మనకు కొత్తగా తెలిసిందే తప్ప కొత్తగా వచ్చింది కాదు. పుట్టింది కాదు.

భూమి గ్రహాలలో ఒకటి. భూమి ప్రతి వస్తువుని ఆకర్షించుకుంటుంది.కాబట్టి, ప్రతి గ్రహం ఆకర్షణ శక్తి కలిగి ఉంటుంది. దీనిని నిరూపించడం కోసం మనం ప్రతి గ్రహం మీదికి పోయి చూడనవసరం లేదు. అది ఒక విశ్వధర్మం. అంతే..! అలాగే..బౌద్ధం ప్రకటించిన భవచక్రం కూడా. కొందరు బౌద్ధులు నేను చెప్పింది అంగీకరించరు. భవచక్రం అంటే 'మానవ జనన ప్రక్రియ కాదు' అంటారు. వారు దాన్ని జన్మరాహిత్య ప్రక్రియగానే చూస్తారు. జన్మ లేకుండా జన్మరాహిత్యం ఉంటుందా? ఈ నామరూపాలూ, తృష్ణలూ జన్మలేకుండా ఉంటాయా? భవచక్రం అంటే పుట్టుక,గిట్టుకలకు సంబంధించని అంశం కాదు.

అందుకే మనం ఈ భవచక్రాన్ని అసంగుడు రాసిన "యోగాచార భూమి" అనే గ్రంథంలో పుట్టుకలకు సంబంధించిన చక్రంగా చక్కగా చూస్తాం.

కొత్తగా సంయోగం చెందిన శుక్ర, అండ కణాలతో కలసి పిండంగా ఏర్పడుతుంది గదా! దీని గురించి అసంగుడు తన "యోగాచారభూమి"లో చాలా విపులంగా చెప్పాడు.

అసంగుడు గొప్ప బౌద్ధ దార్శనికుడు. బౌద్ధ దార్శనిక దిగ్గజం, దిగ్నాగుని గురువు. 'అభిధమ్మకోశం' రచించిన వసుబంధు ఇతని తమ్ముడే. వీరు నేటి ఆఫ్ఘన్ లోని పెషావర్‌కు చెందిన పఠాన్లు. అసంగుడు మహాయానోత్తర తంత్రం, సూత్రాలంకార, యోగాచార భూమి, వస్తుసంగ్రహణి, బోధిసత్త్వ పిటకావవాదం అనే ఐదు గ్రంథాలు రాశాడు. ఇవి విజ్ఞానవాదానికి చెందినవి. వీటిలో యోగాచారభూమి లో మనం చర్చించుకునే విషయం ప్రధానంగా ఉంది. ఇది 17 భాగాల గ్రంథం. వీటిలో లోకాల పుట్టుక, భూమి పుట్టుక, జీవుల పుట్టుక, పంచ భూతాల పుట్టుక, జ్ఞానేంద్రియాల విషయం, జ్ఞానాల పుట్టుక, మనోవిజ్ఞానం, మరణం, పుట్టుకల విషయాలన్నీ ఉన్నాయి.

అసంగుని తమ్ముడు గుప్తవంశంలోని చంద్రగుప్తుని గురువు. కాబట్టి వీరి కాలం క్రీ.శ. 350-400 మధ్య అంటే నాగార్జునుని కంటే 3శతాబ్దాల తర్వాతి వారు. అసంగుని కాలానికి పురాణ, ఇతిహాసాలు పుట్టపగిలినట్లు తెగ వచ్చాయి. మంత్రతంత్రాలతో, యజ్ఞయాగాలతో సంతానం పొందవచ్చు అనే నమ్మకం బాగా ప్రచారంలో ఉంది. తల్లి తండ్రుల కలయికతో సంబంధంలేకుండా దేవతలు పుంఖాను పుంఖాలుగా పుట్టుకొస్తున్న కథలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మానవ జనన ప్రక్రియను బౌద్ధ భవచక్రం ఆధారంగా శాస్త్రీయంగా విశ్లేషించాడు అసంగుడు.

ఆ వివరణలు కొద్దిగా చూద్దాం:

"మనస్సు (మనోవిజ్ఞానం) తన కర్మల్ని బట్టి 'అంతరాభవం' అనే రూపాన్ని ధరిస్తుంది. ఈ మనస్సు ఏదో ఒక శరీరంలో ఉత్పన్నం కావడానికి మూడు విషయాలు అవసరం.

**1. స్త్రీ ఋతుమతి కావాలి (అండోత్పత్తి జరగాలి):** అండాల ఉత్పత్తి తల్లి తనానికి తొలిమెట్టు. అండాల ఉత్పత్తి జరగనిదే సంతానం కలగదు. కాబట్టి సంతానానికి తొలికారణం అండమే. ఇది గొప్ప తిరుగుబాటు. వైదికంలో సంతానానికి తొలి కారణం తల్లి కాదు, తండ్రే. అండం కాదు, బీజమే-అంటే క్షేత్రం కాదు బీజం. అందుకే ఇప్పటికీ మనకు తండ్రి వారసత్వమే వస్తుంది. తండ్రి ఇంటిపేరు రావడానికి కారణం బీజప్రాధాన్యతను బట్టి మన జన్మను లెక్కించడమే. కానీ అసంగుడు మాతృస్వామ్య దృక్పథంతో క్షేత్రానికే తొలిప్రాధ్యాతనిచ్చాడు.

**2. పురుషుడు బీజవంతుడై ఉండాలి:** అంటే...శుక్రకణాలు తగినన్ని ఉండాలి. పురుషుడు వంధ్యుడు కాకూడదు. అతనిలో శుక్రకణాల



Unfiled Notes Page 44

సంఖ్య తగినంత ఉండాలి. అంటూ స్పెర్మ్‌కౌంట్ ప్రధానం.

**3. అంతరాభవుడు ఉండాలి:** .అంటే ... ఈ రెండు కణాల్ని అంటే శుక్ర,అండ కణాల్ని సంయోగం చెందించే అంతరాభవ స్థితి ఒకటి ఉండాలి.

వీటితోపాటు యోని దోషం (ఫాలోపియన్ నాళ దోషం) , బీజ దోషం (స్పెర్మ్ కౌంట్), కర్మ (స్త్రీపురుష కలయిక)... వీటిలో ఏ దోషమూ లేకుండా ఉండాలి."–అంటాడు అసంగుడు.

దీన్నిబట్టి చూస్తే.. శుక్ర, అండ కణాలతోపాటు గంధబ్బం – లేదా అంతరాభవం పొందిన గత జీవి తాలూకు మనస్సు (విజ్ఞానం) కూడా ఉండాలి అనే అర్థం అవుతుంది. ('అంతరాభవం' అంటే మనస్సు శరీరాన్ని వదిలి వేరొక శరీరంలో ఉత్పన్నమయ్యే మధ్యకాలం. దీన్ని గంధర్వం, గంధబ్బం, మనోమయం అని కూడా అంటారు. ఈ విషయాన్ని గత వ్యాసాల్లో విపులంగా చూశాం)

యోగాచారభూమిలో మొదటి అధ్యాయం "విజ్ఞానభూమి".

పంచేంద్రియాలు వాటి పనితీరు, వాటి విజ్ఞానం గూర్చి ఇందులో ఉంది. రెండో అధ్యాయం "మనోభూమి". ఇందులో బౌద్ధులు చెప్పే ఆరో ఇంద్రియమైన మనస్సు, మనో విజ్ఞానాల గూర్చిన వివరణలు ఉన్నాయి.–

ఇందులోనే "చ్యుతి" నుండి "శిశుపోషణ" వరకూ వివిధ దశల వివరణ ఉంది. "చ్యుతి" అంటే మరణం.

ఈ వివరణల్లో క్రమంగా మరణం, అంతరాభవం, మరో శరీరంలో ఉత్పన్నం కావడం, గర్భం, గర్భాదానంలో అవరోధాలు, గర్భదానానికి సహాయకాలు, యోని దోషాలు, బీజదోషాలు, కర్మదోషాలు, అంతరాభవ పరివర్తన, గర్భాశయంలో విజ్ఞాన పరివర్తన, గర్భంలో వివిధ అవస్థలు, గర్భంలో స్త్రీపురుషుల గుర్తింపు, గర్భం నుండి వెలువడుట, శిశుపోషణ– ఇలా ఒక క్రమ వివరణ ఉంది. వాటిలో ప్రత్యేకంగా గర్భావస్థల్ని చెప్పిన తీరు ఎంతో శాస్త్రీయంగానూ ఉంది. ఇప్పుడు వాటిని కూడా చూద్దాం.

1. కలల అవస్థ (ప్రాథమిక దశ): శుక్ర, అండ కణాలు తల్లి గర్భంలో కలిసి, కాగిన పాలలా పొంగి చల్లబడి పిండంగా మారతాయి.

2. అద్బుద అవస్థ: పిండం మాసం ముద్దలా మారేస్థితి.

3. పేశీ అవస్థ: గ్రుడ్డు దశ

4. ఘన అవస్థ: గట్టి ముద్దలా మారే స్థితి (మృదులాస్థి)

5. ప్రశాఖ అవస్థ: పిండానికి శరీరభాగాలు ఏర్పడే దశ

6. కేశ, రోమ, నఖ అవస్థ: వెంట్రుకలు, గోళ్ళు ఏర్పడే స్థితి

7. ఇంద్రియ అవస్థ: ఇంద్రియాలు ఏర్పడే స్థితి

8. లింగభేద అవస్థ: ఆడ, మగ భేదం ఏర్పడే స్థితి

ఇలా జీవి పుట్టుకకు ముందు గర్భంలోని ఈ 8 గర్భావస్థల గురించిన వివరణ ఉంది.

అలాగే... పుట్టాక 5 అవస్థలు ఉన్నాయి. వాటని జాతావస్థలు అంటారు. శైశవం, బాల్యం, కౌమారం, యౌవ్వనం, వార్ధక్యం– ఈ ఐదు జాతావస్థలు– ఈ అవస్థలు పూర్తయ్యాక మరణావస్థ–

మొత్తం మీద పరిశీలిస్తే... భవచక్రంలోని 12 దశలూ ఒక దాన్నుండి ఒకటి పుట్టుకొస్తాయి. ఒకదాని మీద ఆధారపడి మరొకటి ఉంటాయి. అంటే.. ఒకదశ మారి మరోదశగా రూపొందుతుంది.

ఇదే ప్రతీత్య సముత్పాదం. ఒక దశ దాని తర్వాతి దశకు ఎలా కారణమో తెలిపేదే ఈ భవచక్రం. ఇది కార్యకారణవాదానికి తిరుగులేని శాస్త్రీయ నిదర్శనం కూడా.

**మరొక్కసారి గుర్తుకు తెచ్చుకుందాం:**

ప్రతీత్య సముత్పాదాన్ని మనం చాలా కొద్దిగానే చర్చించాం. ఇది ఒక అనంతమైన విషయం. పేరుకు తగ్గట్టే దీని విషయానికీ తెంపుఉండదు. అందుకే బుద్ధుడు:

"ప్రతీత్య సముత్పాదం చాలా గంభీరమైనది" అన్నాడు.

ఒక్కసారి నాలుగు అడుగులు వెనక్కువెళ్ళి మొత్తం భవచక్రాన్ని రెండు ముక్కల్లో నేటి విజ్ఞాన శాస్త్రంతో జోడించి చూద్దాం.

| బౌద్ధ భవచక్రంలో | | విజ్ఞానశాస్త్రంలో |
|---|---|---|
| 1. అవిద్య | ... | ఎలక్ట్రాన్, ప్రోటాన్ల దశ |
| 2. సంఖారాలు | ... | మూలకాలు, పదార్థ దశ |
| 3. విజ్ఞానం | ... | జీవపదార్థం, సంయోగబీజదశ |
| 4. నామ | ... | పిండదశ(మెదడు పుట్టుక) |
| 5. రూప | ... | భ్రూణ దశ (శరీర అవయవాల పుట్టుక) |
| 6. స్పర్శ | ... | శిశుదశ (మెదడూ, జ్ఞానేంద్రియాల సమన్వయం) |
| 7. వేదన | ... | జ్ఞాపకశక్తి ప్రారంభం |
| 8. తృష్ణ | ... | అనుభూతి చెందే దశ |
| 9. ఉపాదానం | ... | అలవాట్లు, కోరికలు ఆరంభదశ |
| 10. భవం | ... | శారీరక, మానసిక పరిపూర్ణత |
| 11. జన్మ | ... | జననం |
| 12. జరామరణం | ... | 5 జాతావస్థలు, మరణం |

ఇదీ, క్లుప్తంగా భవచక్రంలోని ముఖ్యాంశాలు.

**ఆర్య నాగార్జునుడు – ఆది శంకరుడు:**

ఈ పదాలు చూడగానే మనకి 'భజగోవిందం' ఆ వెంటనే శంకరాచార్యుల వారు గుర్తుకువస్తారు. ఆలా గుర్తుకు రాడానికీ ఒక చరిత్ర ఉంది. దాన్నీ చూద్దాం:

క్రీ.పూ ఆరో శతాబ్దం నాటి బుద్ధుడు ప్రతీత్య సముత్పాదం, భవ చక్రాల గురించి తొలిసారి చెప్పాడు. ఇది అనాత్మవాద ప్రతిపాదన.శాస్త్రీయ భౌతికవాదం. ఇదే బుద్ధునికి కలిగిన జ్ఞానోదయం. ఇందులో భవచక్రం నుండి వేరుపడే మార్గం నిర్వాణం.భారత దేశంలో పుట్టిన తత్వాలన్నింటికీ జన్మలేని స్థితిని పొందాలనేదే మూల సూత్రం. దానికి బౌద్ధం కూడా అతీతం కాదు. దీన్ని ఒకరు కైవల్యంఅన్నారు. ఒకరు మోక్షం అన్నారు. ఒకరు నిర్వాణం అన్నారు.

మిగిలిన వారంతా దేవుడు, జీవుడు, ఆత్మ, పరమాత్మల ద్వారా ఈ జన్మరాహిత్య స్థితిని వివరిస్తే... బౌద్ధం అనాత్మద్వారా దీన్ని వివరించింది. అదే భవచక్రం. నిర్వాణ స్థితే దు:ఖరహిత స్థితి. నిర్వాణం పొందడం అంటే తిరిగి పునర్భవం చెందని స్థితే! ఇలా అందరూ నిర్వాణ స్థితిని పొందితే ఇక ఈ జగతి ఏమవుతుంది? జీవుల ఉనికి ఏమవుతుంది? అని ఒక భిక్షువుకు అనుమానం కలిగింది. అదేవిషయాన్ని బుద్ధుణ్ణి అడిగాడు. దానికి బుద్ధుడు జవాబు ఇవ్వక మౌనం వహించాడు.

ఈ మౌనం సమాధానం కాదు. బుద్ధుడు అనేక సార్లు అనవసరపు విషయాలమీద మౌనం వహించాడు. కానీ ఇది అనవసరపు విషయంకాదు. లోకం అంతా నిర్వాణం పొందాక ఈ ప్రపంచ ఉనికి ఏమిటి? ఈ ప్రశ్న పదే పదే వెంటాడుతూనే ఉంది...ఉంటుంది.

...

దీనికి ఒక సమాధానాన్ని బుద్ధుని తర్వాత 600 సంవత్సరాలకి ఒక ప్రజ్ఞాని ఇచ్చే ప్రయత్నం చేశాడు. ఆయనే రెండో బుద్ధునిగా కీర్తిగాంచిన ఆచార్య నాగార్జునుడు. నాగార్జునుడు ఏమన్నారంటే...

"ఒకలోకం ఆవిర్భవిస్తుంది. (సృష్టించబడడం కాదు. ఆవిర్భవించడమే). దానిపై జీవులు ఆవిర్భవిస్తాయి. అవి తృష్ణకు లోనై దు:ఖం పాలవుతాయి. వాటిని దుఃఖం నుండి విముక్తిపొందే మార్గం చూపే బుద్ధుడూ పుడతాడు. ఆయన మార్గం సర్వజీవుల్ని నిర్వాణం పొందించి దుఃఖ విముక్తుల్ని చేస్తుంది. ఇక పునర్భావంపొందే జీవులే ఉండవు. ఇలా కొన్నేళ్ళు సాగుతుంది. బుద్ధుడు అగ్గణ్ణి సుత్తంలో చెప్పినట్లు విశ్వం సంకోచించుకు పోతుంది. లక్షల ఏళ్ళు చీకట్లు కమ్ముకుంటాయి. ఆతర్వాత మరలా మహా వెలుగు ఉద్భవిస్తుంది. లోకాలు పుడతాయి. కొత్త కల్పం మొదలవుతుంది. మరలా జీవులు ఉద్భవించడం...దు:ఖ పడడం...మరలా దుఃఖ విముక్తి మార్గం చూపే బుద్ధుడు రావడం... అందరూ నిర్వాణం పొందడం....మరలా చీకటి....మరలా వెలుగు... మరోకల్పం... ఇలా అనవరతం సాగుతూనే ఉంటుంది." ఇదీ నాగార్జునుని సిద్ధాంతం.

ఆచార్య నాగార్జునుడు చెప్పిన సిద్ధాంతం ఈ నాటి విశ్వ ఆవిర్భావ బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతాన్ని పోలి ఉండడం విశేషం. విశ్వం ఒక్కసారే పుట్టదు. ఒకసారే గిట్టదు. అది ఒక పరిణామ ప్రవాహం మాత్రమే!

....

నాగార్జునుడు, అసంగుని తర్వాత చాలా కొద్దికాలానికే బౌద్ధ తాత్త్విక చింతన కొడిగట్టింది.

ఏమైనా....

ఈ ప్రపంచం ఉన్నంత వరకూ బౌద్ధం ఒక శాస్త్రీయ వైజ్ఞానిక సిద్ధాంతంగా నిలబడి ఉండడానికి బుద్ధుడు ఆవిష్కరించిన ప్రతీత్య సముత్పాదం అనే 'కార్యకారణ సంబంధం' ఒక్కటి చాలు.

ఈ లోకంలో పుట్టే ఏ వైజ్ఞానిక సిద్ధాంతానికైనా అదే... పంట పండించే నాగేటి చాలు.

(...పూర్తయింది)

కవిత

## తెలుగు కవిత్వం

కవీ! అసలు సిసలు తెలుగు కవీ
నీవు కవిత్వం చెప్పే ముందు కాస్త ఆలోచించు
నీవు ఏమి చెప్పదలచుకున్నావు
ఎవరిని ఉద్దేశించి రాస్తున్నావు
ఎందుకంటే నీ చదువరులలో పెక్కురు
తెలుగు వెలుగుల సొబగులు శోభలు తప్ప
పరాయి భాషల మెలకువ లెరుగనివారు

అన్య భాషా పదాలు వాడి, పాపం
అవమానించకు వారిని, అసలు చిన్న బుచ్చుకోనీకు
ఆ భాషలు ఏవయితేనేం
సగటు తెలుగుకవి పరాయిభాషలే
మింగుడు బడని ఎంగిలిభాషలే
ఇంగిత మెరిగి ఎంచుకోవాలి
పదునైన పదాలను మేలైన పదాలను
అదను చూచి వాడి చూడు అనువైన చోట

అసలు నీవు కవిత్వం ఎప్పుడు రాస్తావు
నీలో ఉత్తేజం ఉత్పన్నమయినప్పుడు
నీలో ఉద్రేకం రగిలి పొంగినప్పుడు
ఉత్సాహం ఉరకలు వేస్తున్నప్పుడు
ఊహాలజగత్తులో విహరిస్తున్నప్పుడు
ఏదో చెప్పాలని పదేపదే తొలుస్తున్నప్పుడు

ఆ ఉత్సాహాన్ని ఆ ఊహలని
అనుకున్న రీతిలో రంగరించి
నీ ప్రియతమ చదువరులకు
ప్రీతి పాత్రంగా అందించాలని
కదూ నీ యాతనా నీ తపనా

చెప్పి చూడు తేటగా సూటిగా
చక్కనైన చిక్కని తెలుగు పదాలతో
తెలుగులో ఇనిసిపోయి కలసిపోయిన
పరాయి పదాలైనా ఫరవాలేదు
అవి తెలుగు పదాలే అని భ్రాంతి కలిగించాలి

అరటి పండు తిన్నట్టు వెన్న ముద్ద
ఆరగించినట్టు గుండెలోతు తడివినట్టు
మనసు విప్పి మాటాడినట్టు స్పందిస్తారు
అప్పుడవుతుందది అచ్చమైన కవిత్వం
ఆకట్టుకునే కవిత్వం ఆదమరిపించే కవిత్వం
అమృత తుల్యమైన అసలు సిసలు తెలుగు కవిత్వం
ఇంటా బయటా రాణించే ఇంపైన కవిత్వం
అమ్మ చేతి వంటలాంటి కమ్మని కవిత్వం

- వై. మాధవరావు
040-27645255

తెలుగు చరిత్రకారులు

జి. వెంకటేశ్వరరావు
9491457496

# భావరాజు వెంకట కృష్ణారావు



భావరాజు వెంకటకృష్ణారావు సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు. రాజమహేంద్రవరంలో జన్మించారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో బి.ఎ., బి.యల్ చదివారు. 'చిత్తబోధవృత్తం' అనే గ్రంథాన్ని రచించిన ఇతని తండ్రి బాపిరాజు పంతులు శిక్షణలో పెరిగి పండితుడైనాడు.

భావరాజు వెంకటకృష్ణారావు ఐదు సంవత్సరాలు మద్రాసు ప్రభుత్వ మత ధర్మాదాయశాఖలో కమీషనర్‌గా పనిచేశారు. తరువాత హైదరాబాద్ సంస్థానంలో మత ధర్మాదాయశాఖ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేశారు. తరువాత రాజమండ్రి వచ్చి న్యాయవాద వృత్తిలో ప్రవేశించారు.

ఆయనకు చరిత్ర పరిశోధన అంటే అత్యంత అభిమానం. తెలుగునాటకమందు శ్రద్ధ ఉన్నది. రాజమండ్రిలోని గౌతమిగ్రంథాలయానికి ప్రథమ కార్యదర్శిగా పనిచేశారు. ఇచటనే "ఆంధ్ర ఇతిహాసపరిశోధక మండలి" స్థాపించబడింది. మండలి స్థాపకులలో భావరాజు వారు ఒకరు. ఇందులో చిలుకూరి వీరభద్రరావు, డా॥ చిలుకూరి నారాయణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ ఉన్నారు. కృష్ణారావుగారు మండలి మొదటి కార్యదర్శిగా పనిచేశారు. మండలి ప్రచురించిన పత్రికకు సంపాదకునిగా పనిచేశారు... "రాజరాజనరేంద్ర పట్టాభిషేక" సంచికను తన సంపాదకత్వంలో ముద్రించారు. ఈ పత్రిక దక్షిణ హిందూ దేశ చరిత్ర – ముఖ్యంగా ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించిన అనేక వ్యాసములను ముద్రించింది. వీరి పరిశోధక వ్యాసములు, మరియు శాసనములకు సంబంధించిన సమాచారం (బీహార్ అండ్ ఒరిస్సా రిసెర్చి సొసైటీ) పత్రికలలో ముద్రించబడింది. తూర్పు చాళుక్య శాసనములను కొన్నింటిని పరిష్కరించి "ఎపిగ్రాఫియా ఇండికాలో" విపులమైన వివరణలతో ప్రకటించారు.

భావరాజువారు చారిత్రక పరిశోధకులేకాక మంచి కథకులు. వీరి కథలు భారతి, ప్రబుద్ధాంధ్ర మొదలగు పత్రికలలో ప్రచురింపబడినవి. తెలుగులో రాజరాజనరేంద్రుడు, ప్రాచీనాంధ్ర నౌకాజీవనము – ఆంధ్రదేశము–విదేశ యాత్రికులు, తూర్పు చాళుక్యుల చరిత్ర, వీరు రచించిన "చరిత్ర–శాసనములు, ప్రముఖుల జీవితములు, ఆంధ్రోద్యమం, ప్రాచీన నగరములు, పురావస్తు పరిశోధనలు" మున్నగు వ్యాసములు భారతి, ప్రబుద్ధాంధ్ర. ఆంధ్రపత్రిక, జయంతి, శారద, కిన్నెర – అనే పత్రికలతో ప్రచురింపబడినవి. ఎర్లీ డైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రా అనే గ్రంథాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించి ఎం.ఏ. డిగ్రీని పొందినారు.

భావరాజువారు తూర్పు చాళుక్యుల చరిత్ర 'హిస్టరీ ఆఫ్ ఈస్టర్న్ చాలుక్యాస్ ఆఫ్ వేంగి' ఎ.డి.1210 ఎ.డి. – 1210) అనే గ్రంథాన్ని వ్రాస్తున్న సమయంలో అకాల మృత్యువాత పడ్డారు. అందువల్ల ఈ గ్రంథం ముద్రణకు నోచుకోలేదు. తరువాత వీరి సతీమణి హైమావతి – తెలుగు అకాడమీ వారిని ప్రచురించమని కోరినది. భావరాజువారికి నిజమైన నివాళి అర్పించడం అవుతుందని అకాడమీ వారు వారి గ్రంథాన్ని ప్రచురించడానికి అంగీకరించారు. కానీ భావరాజు వారి గ్రంథంలో కొన్ని అసంపూర్తి అంశాలు ఉన్నాయని తెలిసింది. ఇదే విషయాన్ని ఆ గ్రంథంలో వివరించారు. భావరాజు వారి వ్రాతప్రతిలో అక్కడక్కడ కొన్ని అంశాలను చేర్చడం జరిగింది. ఏదిఏమైనా – భావరాజు వారి గ్రంథం అత్యంత ప్రామాణికమైన పరిశోధనాత్మక గ్రంథమని – ఆంధ్రదేశ చరిత్రలో ఏర్పడిన కొన్ని ఖాళీలను ఈ గ్రంథం పూరిస్తుందని, ఆంధ్రదేశ చరిత్రను, సంస్కృతిని తెలియజేసే అత్యంత ప్రామాణికమైన గ్రంథమని – తెలుగు అకాడమీవారు ఈ గ్రంథముద్రణలో వివరించారు. మరో ముఖ్యమైన విశేషమేమిటంటే – నేలటూరి వెంకటరమణయ్య అనే చరిత్రకారుని కంటే ముందుగా వేంగిచాళుక్యుల మీద వ్రాసిన ప్రామాణిక గ్రంథమే భావరాజు వారిదని చెప్పకతప్పదు.

సాహిత్య అకాడమీ కార్యదర్శి దేవులపల్లి రామానుజరావు ఈ గ్రంథానికి ముందుమాట వ్రాస్తూ "ఈ గ్రంథం ఆంధ్రదేశానికి సంబంధించిన ఆరు శతాబ్దాలచరిత్ర అని, ఈ చరిత్ర వేంగీరాజ్య విజయం – 7వ శతాబ్దంతో మొదలయి పశ్చిమచాళుక్య చక్రవర్తి రెండవ పులకేశితో అంటే 12వ శతాబ్దంతో అంతమయిందని వివరించబడింది. తూర్పు చాళుక్యుల రాజ్యకాలం నిత్యం నిరంతర యుద్ధాలతో సాగింది. దీనితో పాటు ఈ కాలంలోనే తెలుగు సాహిత్యం ఉన్నత స్థితికి చేరింది. ఈ కాలంలోనే తెలుగుపద్యం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. దీని ప్రభావం చాళుక్య శాసనాలలో స్పష్టంగా కనిపించింది. తెలుగు మహాభారతం రాజరాజనరేంద్రుని కాలంలోనే వ్రాయబడింది. అంటే తెలుగు భాషా చరిత్రలో ఈ కాలం తెలుగుభాషకు సాంస్కృతిక పునరుజ్జీవన కాలంగా భావించబడింది. తూర్పు చాళుక్యుల – కుబ్జ విష్ణువర్థనుని కాలంలోనే – కళలు, సంస్కృతి, పునరుజ్జీవింపబడినవి. ఈ కాలంలోనే విజయాదిత్య నరేంద్ర మృగరాజులు – 108 శివాలయములను నిర్మించారు. ఈ రాజు 108 యుద్ధాలలో విజయం సాధించినాడనడానికి గుర్తుగా ఈ శివాలయములను నిర్మించాడని చెప్పవచ్చు.

భావరాజు వారు రచించిన ఈ గ్రంథంలో కొన్ని అంశములు ఆ కాలానికి కాకుండా కాలం చెల్లిపోయినవి కావచ్చును. కానీ వీరు వ్రాసిన గ్రంథం వారి చారిత్రక స్పృహకు అద్దం పట్టుతుందనడంలో సందేహం లేదు.

ఇంతటి ఘనకీర్తి గల భావరాజు వెంకటకృష్ణారావుగారు 1957 సంవత్సరంలో మరణించారు. ఆంధ్ర– తెలంగాణాలలోని చరిత్ర పరిశోధకులు భావరాజువారి చరిత్ర పరిశోధనలను అర్థం చేసికొని తమ కాలాన్ని చారిత్రక పరిశోధనలకు వినియోగిస్తారని ఆశిస్తున్నాను.

పుస్తక సమీక్ష

# "త్యాగరత్న"

## 'విద్యా సుందరి' బెంగుళూరు నాగరత్నమ్మ జీవితాధారిత నవల




కన్నడ మూలం : ఆచార్య మవెయూరు గురుస్వామి
అనువాదం : రంగనాథ రామచంద్రరావు
పుటలు: 300 వెల: రు.250/-
ప్రచురణ : సజ్జాజు బాలచందర్, 'సంస్కృతి' గుంటూరు.
ప్రతులకు: అనల్ప బుక్ కంపెనీ, సికింద్రాబాద్ - 500 094,
ఫోన్ : 7093800678

ఇతర సాహిత్య ప్రక్రియలతో పోల్చి చూస్తే, తెలుగులో ఆత్మ కథలు, జీవిత చరిత్రలు తక్కువే అనిపిస్తుంది. అందులో కూడా, స్త్రీల జీవిత చరిత్రలు చాలా అరుదు. ఈ నేపథ్యంలో - త్యాగరత్న, విద్యా సుందరి బెంగుళూరు నాగరత్నమ్మ జీవితాధార నవల పాఠకుల ముందుకు రావటం సంతోషదాయకం. కన్నడ భాషలో బహుముఖ కృషి చేస్తున్న డా. మలెయూరు గురుస్వామి వ్రాసిన నవలను తెలుగు పాఠకులకు రచయితగా, అనువాదకులుగా సుపరిచితులైన రంగనాథ రామచంద్రరావు కన్నడ - తెలుగు భాషల అందాలను, పలుకుబడులను తన అనువాదంతో మెరుగులు అద్ది స్వతంత్ర రచన అనిపించేలా అందించారు.

కన్నడ భాషలో ఈ నవలకు గురుస్వామి పెట్టిన పేరు - 'కపిలె హరిదళు కడవిగె' అంటే 'కపిల ప్రవహించెను కడలికి' అని అర్థం. కర్ణాటక రాష్ట్రంలోని 'నంజనగూడు' గ్రామంలో పుట్టలక్ష్మమ్మ అనే 'దేవదాసికి పుట్టిన కుమార్తె 'రత్న', మైసూరు వెళ్ళి 'నాగరత్న' గా విద్యను నేర్చి బెంగుళూరుకు వెళ్ళి 'నాగరత్నమ్మాళ్'గా, చివరకు మద్రాసులో 'త్యాగరత్న' గా ఎదిగిన తీరు ఈ నవలలో చాల అందంగా సరళ సుందరంగా చెప్పారు రచయిత. నంజనగూడులోని కపిలనది ముందుకు ప్రవహించి, తిరుమ కూడలు నరసీపురదగ్గర కావేరీ నదితో సంగమించి, మళ్ళీ ముందుకు సాగి, సముద్రంలో చేరిపోయింది. ఈ తీరుగానే కర్ణాటక రాష్ట్రంలో పుట్టిపెరిగిన నాగరత్నమ్మ అనే కళా స్రవంతి, మద్రాసు మాగాణంలో ప్రవహించి త్యాగరాజులవారి సమాధి జీర్ణోద్ధరణ కోసం తన సంపదనంతటినీ ఉపయోగించి చివరకు బెంగుళూరు నాగరత్నంగా ప్రసిద్ధిగాంచిన 'స్వర సామ్రాజ్ఞి ఆహతనాదం  సృష్టి మూలమైన అఖండ అనాహత నాదంలో ఐక్యమైంది'. గురుస్వామి పెట్టిన పేరు నవలకు అలా సార్థకమైతే తెలుగు అనువాదానికి 'త్యాగరత్న' అన్న పేరుంచారు. 300 పుటలలో ఉన్న ఈ నవలను ఐదు అధ్యాయాలలో - 'రత్న', 'నాగరత్న'; 'నాగరత్నమ్మ'; 'నాగరత్నమ్మాళ్' (నాగరత్నమ్మగారు); 'త్యాగరత్న'గా విభాగం చేసి ఒక గొప్ప స్త్రీ జీవితాన్ని ఆవిష్కరింప చేశారు అనువాదకులు.

కర్ణాటక సంగీత కోకిల, గానకళా విశారద, విద్యా సుందరి, గృహలక్ష్మీ స్వర్ణ కంకణంతోపాటు 'త్యాగసేవాసక్త' బిరుదును పొందిన బెంగుళూరు నాగరత్నమ్మ (1878 - 1952) జీవిత విశేషాలు ఈ నవలలో ఆసక్తికరంగా సాగాయి. కేవలం పురుష గాయకులే కర్ణాటక సంగీతంలో ప్రసిద్ధులుగా చలామణీ అవుతున్న రోజుల్లో, తన గాన కళా పరిజ్ఞానంతో విద్వాంసురాలిగా పేరు పొందిన నాగరత్నమ్మ, ఎంతో ఘనమైన కీర్తినీ, సంపాదనను కూడా స్వంతం చేసుకుంది.  అయితే ఆమె జీవితంలో ముఖ్యంగా రెండు వివక్షలను ఎదుర్కొంది- ఒకటి స్త్రీ అయినందుకు, రెండవది - దేవదాసీ వ్యవస్థకు చెందినందుకు. అయినా, నిజాయితీ, ధైర్యం, ఆత్మాభిమానం, దయాగుణంతో తన ఆశయాల సాధనకై నిరంతరం పోరాటం చేసిన ధీర వనితగా నారీ రత్నంగా చరిత్రలో నిలిచిపోతుంది. దేవదాసీ సముదాయ రక్షణకు పూనుకున్న విధానం, మొత్తం వ్యవస్థ తనకు వ్యతిరేకంగా నిలిచినా ఆమె వెనుకంజ వేయలేదు. తన సంపదనంతటినీ తిరువైయారులోని త్యాగరాజుల వారి సమాధి జీర్ణోద్ధరణ కోసం వినియోగించింది. త్యాగరాజు ఆరాధనోత్సవాలకు పునాది వేసింది.

సంగీత విద్యతోపాటు సాహిత్యంలో కూడా కృషి చేసి రచనలు చేసింది. ముద్దుపళని రాసిన 'రాధికా స్వాంత్వనతో' కావ్యాన్ని పరిష్కరించిన స్వాభిమాన ప్రతీక ఆమె. పళని రాసిన 'ప్రస్తావన' ను, అంతకు ముందు వదిలి పెట్టబడిన సాహిత్య విలువలున్న పద్యాలను జోడిస్తూ, సమగ్ర కృతిని 1910లో వావిళ్లవారు ప్రకాశకులుగా ప్రచురించగా, సంచలనం కలిగించింది. కందుకూరి వీరేశలింగంగారు రచయిత్రిగా పళని కులాన్నిబట్టి విలువ తగ్గిస్తే, నాగరత్నమ్మగారు ఆ కుల గౌరవాన్ని నిలబెట్టింది.

కేవలం 'జీవిత చరిత్ర' కాకుండా, 'జీవితాధార నవల'గా రూపొందించటం వలన కల్పిత పాత్రలు, వర్ణనలు, 'సంభాషణలు' యిలా కొంత కల్పన చేయటానికి అవకాశం ఏర్పడింది. అయినప్పటికీ రచయిత పాఠకులను ఆ కాలంలోకి, నాగరత్నమ్మ వ్యక్తిగత, సాంఘిక జీవితంలోకి తీసుక వెళ్ళి ఆసక్తికరంగా, సరళమైన రీతిలో, చక్కటి కథా శిల్పంతో నవలను తీర్చి దిద్దారు. కన్నడ తెలుగు సాహిత్యాలకు సేతుబంధంలా ఉన్న ప్రసిద్ధ రచయిత రంగనాథ రామచంద్రరావు అనువాదం చేసి అందించిన ఈ నవలకు సాహిత్యంలోను, చరిత్రలోను, స్త్రీల చరిత్ర నిర్మాణంలోను సముచిత స్థానం తప్పక లభిస్తుంది.

ఎమ్.వి.శాస్త్రి
9441342999

అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ
ప్రేమించలేడు..



Unfiled Notes Page 48

పుస్తక సమీక్ష

# "తెలంగాణా ఉద్యమంలో 'చారిత్రికాంశాలు'



**తెలంగాణా ఉద్యమంలో చారిత్రికాంశాలు**
**చారిత్రికోద్యమ వ్యాసాలు**
రచయిత : సంకేపల్లి నాగేంద్రశర్మ
పుటలు: 294 వెల: రు.350/-
ప్రతులకు: ఇ.నెం. 6-6-1031/1
శివాజీ నగర్, కరీంనగర్ - 505 001
ఫోన్ : 9441797650

మలి తెలంగాణా ఉద్యమం (2000-2014) లో చురుకైన పాత్ర, మూడు దశాబ్దాల పైగా సాహిత్య, పాత్రికేయ అనుభవం, 500 కు పైగా చరిత్ర, సాహిత్య, సామాజిక అంశాలపై వ్యాస రచన, ఎనిమిది పుస్తకాల ప్రచురణ, తెలుగు భాషోద్యమంలో క్రియాశీల కార్యకర్త వెరసి సంకేపల్లి నాగేంద్రశర్మ - తెలంగాణ సంస్కృతి, చారిత్రక చిహ్నాల సమాచారపు వివరాలతో, ముఖ్య చారిత్రిక ఘటనలు, ఉద్యమ స్వరూపాలను ఏర్చి కూర్చిన 43 వ్యాసాల సంకలనం-'తెలంగాణా ఉద్యమంలో 'చారిత్రికాంశాలు'.

రచయిత వృత్తిరీత్యా చరిత్రాధ్యాపకుడు. వృత్తి ప్రవృత్తి సమానం కావటం, సాహిత్యాధ్యయనం పై మక్కువ, అన్నిటినీ మించి తెలంగాణా ప్రాంత చరిత్రపై సాధికారత, సంస్కృతి, చారిత్రిక స్థలాల పరిరక్షణ, త్రవ్వకాలు, శాసనాలు, పర్యాటక స్థలాలు, దేవాలయాలు - యిలా తెలంగాణా గురించిన సమస్త అంశాలపై ప్రామాణిక ఆధారాలు, వివరాలు, సమాచారం సేకరించి, ఉద్యమ కాలంలో వ్రాసిన వ్యాసాలు -ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, దక్కన్ లాండ్, వార్త, నడుస్తున్న చరిత్ర - అమ్మనుడి వివిధ పత్రికలలో ప్రచురించబడి, ఆనాటి తెలంగాణీయుల్లో ఉద్యమ స్ఫూర్తినీ, ప్రాంతీయ అభిమానాన్ని ఇతోధికంగా పెంచేందుకు దోహదపడ్డాయి. కేవలం తన అభిప్రాయాలే కాకుండా ఇతరుల అభిప్రాయాలను, ఆలోచనలను కూడా అక్షరబద్ధం చేసిన వ్యాసాలు ఈ సంకలనంలో మనకు కనిపిస్తాయి.

డా॥ డి. రామాచార్య వ్రాసిన చారిత్రిక పద్య కావ్యం 'మహా మంత్రియుగంధర' పై వ్రాసిన కూలంకష సమీక్షా వ్యాసం, 'తెలంగాణా పర్యాటక దర్శిని...' (తెలంగాణా రిసోర్స్ సెంటర్ - టి.ఆర్.సి ప్రచురణ), డా॥ గుమ్మన వ్రాసిన 'ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ' పై సమీక్ష; 'రుద్రమదేవి', 'శాతకర్ణి' చిత్రాలపై సమీక్ష; చరిత్ర పరిశోధకులు డా.జై శెట్టి రమణయ్య, ఆచార్య జయశంకర్, సురవరం ప్రతాపరెడ్డి మొ॥ వారిని గురించిన వ్యాసాలు, కోటిలింగాల, కరీంనగర్ జిల్లా, రామప్ప-వేములవాడ దేవాలయాలు, యింకా తెలంగాణలోచారిత్రిక కట్టడాలు, గుట్టలు ; ఇలా అన్ని అంశాలపై తన వ్యాఖ్యానాలను, అభిప్రాయాలను ఒక చరిత్ర వ్యాసాల సంపుటిగా పుస్తక రూపంలో వెలువరించిన పుస్తకం ఇది. చరిత్ర, సాహిత్యం - ఈ రెండిటిపైనా రచయితకు గల అపారమైన అభిమానాన్ని, అభినివేశాన్ని ఈ సంకలనంలో అన్ని వ్యాసాలలోను పాఠకులు చూడగలుగుతారు. ఈ సంకలనం, చరిత్ర అధ్యయన పరులకు, ఈ తరం యువకులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం అవుతుంది. శర్మగారి వ్యాసాలలో సునిశితమైన నిష్పక్షపాత ధోరణి, నిజాయితీ, తెలంగాణాలోని సమస్తం పట్ల ఆయన మక్కువనీ తెలియచేస్తాయి. అయితే, పాత్రికేయానుభవం ప్రభావం వలన రచనా శైలిలో కొంత 'రిపోర్టింగు' ధోరణి కనిపించినా, సమగ్రంగా చూస్తే తెలంగాణా రాష్ట్ర భావితరాలకు చరిత్ర, పురాతత్వశాస్త్ర విద్యార్థులకు ఒక మంచి ఉల్లేఖనా గ్రంథంగా ఉపకరిస్తుంది.

ఎమ్.వి.శాస్త్రి
9441342999

## తెలుగు తల్లి

కవిత

ఇప్పుడిప్పుడే
తెలుగు గుండె
లబ్‌డబ్ మానేసి
మాతృవేదాన్ని వల్లె వేస్తోంది
రాజుల కిరీటాన్ని
కవుల పాదాల ముందుంచిన
రతనాల రోజు
కళ్ళముందు తెరలు తెరలుగా
ప్రస్ఫుటమౌతోంది
తెలుగుతల్లికి హారతి పట్టాల్సిన రోజులు
త్వరలోనే రావాలని
గుండె గుండెకూ చాటి చెప్పే సమయం ఆసన్నమైంది
గడపగడప ముంగిట్లో
తెలుగుతల్లికి హారతి పట్టే తరుణమిది
పాలుత్రాగే ప్రాయంలోనే
తెలుగు యాసను కాసింత నూరిపోయాలి
నేడు కావలసింది తెలుగుతల్లికి నీరాజనాలు
తెలుగుకోసం పాటుపడిన ప్రతి హృదయానికి
పాదాభివందనాలివే
గల్లీ నుండి ఢిల్లీదాకా
జై తెలుగుతల్లి అనే నినాదం మార్మోగాలి
తెలుగు మన హక్కు
ప్రతి ఇంట్లో
అమ్మా - నాన్నా అనే పిలుపులు వినిపిస్తూనే వుండాలి
భవిష్యత్తు మన తెలుగు లోగిలి సొంతం
అని దిక్కులు పిక్కటిల్లేలా చాటి చెబుదాం..!

గుర్రాల రమణయ్య
9963921943



**కథానికా జీవి డా॥ వేదగిరి రాంబాబు స్ఫూర్తిపథం :** వ్యాసాలు
పుటలు: 182, వెల: అమూల్యం
ప్రచురణ: శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్
హెచ్.ఐ.జి. -1, బ్లాక్ -6, ఫ్లాట్ 10,
బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ - 500 044
సెల్ :9391343916




**బడి :** కవితల సంపుటి
రచయిత : సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
పుటలు: 100, వెల : 70/-
ప్రతులకు : సహచర బుక్ మార్ట్, విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్ హౌస్, దిశపుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్
సెల్ : 9490634849



**ప్రతిభాశాలి ఆచార్య ప్రతాపగిరి రామమూర్తి :** వ్యాసాలు
రచన: రావినూతల శ్రీరాములు
పుటలు: 62, వెల: రు.50/-
ప్రతులకు : వై. భరద్వాజ, సరస్వతి నిలయం
ఇ.నెం. 1213414/11, తార్నాక
సికింద్రాబాద్ - సెల్ : 8099392141




**బతుకు వెతుకులాట :**
రాయలసీమ మాండలిక పద పరిమళం
రచయిత : సద్లపల్లె చిదంబర రెడ్డి
పుటలు:508, వెల: రు.400/-
ప్రతులకు: సి. కళానిధి, 21-6-139
టీచర్స్ కాలని, హిందూపూరు - 515 211
అనంతపురం, సెల్ : 9440073636




**ఒకే ఒక్క దారి:**(అష్టాంగమార్గం)
పుటలు:168, వెల: రు.150/
రచన : బొర్రా గోవర్ధన్
ప్రతులకు: ఆర్ట్సఅండ్ లెటర్స్, హైదరాబాద్ స్టడీ సర్కిల్
1-2-365/25/సి, ఇందిరా పార్క్ క్రాస్ రోడ్స్,
దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029
సెల్ : 9704640273




**మున్నుడి :**ముందు మాటలు
, పుటలు:144, వెల: రు.100/-
రచన : సింగమనేని నారాయణ
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్ బ్రాంచీలు
నవచేతన బుక్ హౌస్ బ్రాంచీలు
నవోదయ బుక్ హౌస్ బ్రాంచీలు




**ఆనందరావు కథలు :** కథలు
రచయిత : ఆనందరావు పట్నాయక్
పుటలు:144, వెల: రు.120/-
ప్రతులకు: ఇందిరా పబ్లికేషన్స్, నేతాజీ నగర్
రాయ్‌గడ - 765001, ఒరిస్సా
అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు



**మనంగా బతకాలని :** కవిత్వం
రచయిత : చింతాడ తిరుమలరావు
పుటలు: 56, వెల: రు.50 /-
ప్రతులకు: చింతాడ తిరుమలరావు
ప్లాట్ నెం. 14, వెంకటేశ్వర నగర్
విశాఖ 'ఎ' కాలని, శ్రీకాకుళం - 532 001
సెల్ : 9441262559




**కవిత్వ భాష :** సాహిత్య వ్యాసాలు
రచన : బొల్లోజు బాబా
పుటలు: 200, వెల: రు.148/-
ప్రతులకు: బొల్లోజు బాబా, 30-7-31
సూర్యనారాయణ పురం, కాకినాడ
తూర్పుగోదావరి జిల్లా
సెల్: 9849320443




**అడవి దీపాలు :** కవిత్వం
రచన: తోకల రాజేశం
పుటలు: 128, వెల: రు.80/-
ప్రతులకు : తోకల రాజేశం, అవదాం (పోస్టు)
(వయా) భీమవరం, నెన్నెల (మండలం)
మంచిర్యాల (జిల్లా) - 504 204
సెల్ :9676761415




**ప్రేమ కథలు (కథలు), ఆడదే ఆధారం (కథలు)**
రచన : రాయవరపు సరస్వతి
ప్రేమ కథలు (కథలు), పుటలు: 88, వెల: రు.40/-,
ఆడదే ఆధారం (కథలు) పుటలు:72, వెల: రు.40/-,
ప్రకాశకులు : శైలి ప్రచురణలు, 30-2-3, జి3, ఉప్పులూరి వీరన్న ఎన్‌క్లేవ్, వడలి వారి వీధి
తణుకు - 534 211, సెల్ : 9885045360




Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362





# ‘అక్షరాస్యత, సామాజికఉద్యమాలకు పత్రికలు తోడ్పడ్డాయి’

అక్షరాస్యత, సామాజిక ఉద్యమాలకు పత్రికలు తోడ్పడ్డాయి అన్నారు ప్రముఖ పాత్రికేయులు, రచయిత డా॥ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అడల్ట్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ (స్పేస్) సంస్థ నిర్వహించిన ఆచార్య రావెళ్ల కృష్ణారావు 5వ స్మారకోపన్యాసం చేశారాయన. హైదరాబాదులో ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోగల ఆంధ్ర మహిళా సభ విద్యాసంస్థల ప్రాంగణంలోని సాక్షరతా భవన్‌లో నవంబర్ 27 మంగళవారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది.

తొలుత, కార్యదర్శి శ్రీ పి. పూర్ణచంద్రరావు ఆహ్వానం పలికి వేదికనలంకరించిన ప్రముఖులను పరిచయం చేశారు. స్పేస్ అధ్యక్షులు డా॥ సామల రమేష్‌బాబు తమ అధ్యక్షోపన్యాసంలో అక్షరాస్యత - మహిళా సాధికారతలపై దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ గారు చేసిన నిర్మాణాత్మకమైన కృషిని వివరించారు. అదే స్ఫూర్తితో రావెళ్ళ కృష్ణారావుగారు స్పేస్ సంస్థను ప్రారంభించారని చెప్పారు. స్పేస్ సంస్థ ఉపాధ్యక్షులు ప్రొ॥ ఘంటా రమేష్ మాట్లాడుతూ కృష్ణారావుగారు సామాజిక అభివృద్ధి అనేది కేవలం విద్య ద్వారానే సాధ్యపడుతుందని పూర్తిగా నమ్మి, విశ్వవిద్యాలయ విద్యా విభాగంలో ఉన్నప్పటికీ, కిండర్ గార్డెన్ స్థాయి పిల్లల నైతిక, మనో వికాసాలకు కావలసిన సాహిత్యాన్ని గురించి ఆలోచించి ఎంతో కృషి చేశారని వివరించి, స్వయంగా ఆయన నైతిక విలువలకు సంబంధించి పిల్లలకోసం రాసిన పుస్తకం జాతీయ అవార్డును పొందడాన్ని, వయోజన విద్యకోసం ఆయన చేసిన కృషిని వివరించారు.

ఈ సందర్భంగా స్పేస్ సంస్థవారు “డా॥ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అక్షరాస్యత, మహిళా సాధికారత–2018” పురస్కారాన్ని - ఎస్ఆర్‌సి ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా పదవీ విరమణ చేసి, లిటరసీ హౌస్ సెక్రటరీగా సేవలు అందిస్తున్న డా॥బి.నాగ లక్ష్మి గారికి అందించి సన్మానించారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ...అక్షరాస్యతకు మహిళా సాధికారతకు చాలా దగ్గరి సంబంధం ఉంది కాబట్టే దుర్గాబాయమ్మగారు మొదటినుంచే ఈ విషయంపై శ్రద్ధ పెట్టారు అని అన్నారు. స్మారకోపన్యాసం చేసిన ప్రముఖ పాత్రికేయులు, మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు సమకాలీన సమాజాన్ని సాహిత్యం, వార్తా మాధ్యమాలు ప్రతిబింబించే వైనాన్ని వివరించారు. వీరేశలింగం పంతులుగారు తాను చేపట్టిన సామాజిక ఉద్యమాలకు సహకారంగా సాహిత్యాన్ని ఆవిష్కరించడం గురించి వివరించారు. ఈ సందర్భంగా నెల్లూరు సారా ఉద్యమానికి వయోజన విద్య వాచకంలోని కథ స్ఫూర్తినివ్వడం ఇతర పరిస్థితులను చర్చించారు. పత్రికల ప్రభావం సమాజంపై కచ్చితంగా ఉంటుందని చెబుతూ తెలుగులో తొలి పత్రికలైన ఆంధ్రపత్రిక, ప్రభ, మున్నగునవి ఏ విధంగా తోడ్పడ్డాయో వివరించారు. 1914లో స్వాతంత్ర్య సమరయోధులు కీర్తిశేషులు కాశీనాథుని నాగేశ్వరరావు ప్రారంభించిన ఆంధ్రపత్రిక గ్రామానికి ఒక్కొక్కటి చొప్పున చేరినా, చదువురాని 10 మంది ఆ పత్రికను చదివించుకొని వినేవారని, క్రమంగా తామేచదవాలనే ప్రయత్నంలో భాగంగా అక్షరాలు నేర్చుకున్నారని చెప్పారాయన. అట్లా పత్రికల వల్ల అక్షరాస్యత, అక్షరాస్యత వల్ల పత్రికల ముద్రణ క్రమంగా పెరిగిందన్నారు. ఒకప్పటి భారతి పత్రికలోని వ్యాసాల ప్రభావం, అందులో ప్రతిబింబించిన చారిత్రక సామాజిక అంశాలను గురించి వివరించారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాలలో ఉపయోగిస్తున్న మాండలిక పదాలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి, ఇతర భాషా పదాలకు తగిన తెలుగు పదాలను సృష్టించుకొని భాషను పరిపుష్టం చేసుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు పొత్తూరి. దీనిపై విద్యా రంగం దృష్టిపెట్టి భాషా వికాసానికి ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో సుసంపన్నం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర మహిళా సభ అధ్యక్షులు శ్రీమతి ఉషారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీమతి ఉషాకందా, కార్యదర్శి డా॥ లలితా కామేశ్వరిగార్లను సన్మానించారు. కార్యక్రమం ఎస్.ఆర్‌సి, హైదరాబాద్ డైరెక్టర్ డా॥ బండి సాయన్నగారి వందన సమర్పణతో ముగిసింది. **- ఇంద్రాణి**





**అమ్మనుడి** తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
December 2018 Vol :4, Issue 10 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/13/2018-20

అందరికి ఆరోగ్యం - రాఘవేంద్ర లక్ష్యం !!




**రాఘవేంద్ర హెర్బల్స్** ఆయుర్వేదిక్ స్టోర్ & క్లినిక్
1. వివేకానంద పార్కు ఎదురుగా, యన్.జి.ఓ. కాలనీ, వనస్థలిపురం, **హైదరాబాద్** - 500 070.
2. వాయుపురి బస్టాప్ ప్రక్కన, సిద్ధి రెస్టారెంట్ దగ్గర, నేరేడ్‌మెట్ క్రాస్ రోడ్, **సికింద్రాబాద్** - 500 056.
**సెల్ : 87903 38513, 88860 71727**
మా వద్ద అన్ని కంపెనీల ఆయుర్వేద మందులు అందుబాటులో ఉంటాయి. అన్ని రకముల ఆయుర్వేద వనమూలికలు మరియు చూర్ణములు లభించును.

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244